thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 148 కరీంనగర్ బుధవారం, 6 ఆగస్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## నీట్ పరీక్షలో డబ్బుదే కీలక పాత్ర: స్టాలిన్

చెన్నై : 'నీట్' పరీక్షలో ఆద్యంతం డబ్బు కీలక పాత్ర పోషిస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు. 2025 యూజీ వైద్య కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షలో అవినీతికి పాల్పడి, అర్హత లేని వారికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు ఇప్పిస్తామని నగదుతీసుకుని మోసగించారంటూ మహారాష్ట్రకు చెందిన జాతీయ పరీక్షా ఏజెన్సీ అధికారి, పలువురువైద్యులపై సీబీఐ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్‌లో స్పందిస్తూ... "నీట్ అనేది మెరిట్ గురించి కాదు, మార్కెట్ గురించి అని నిరూపించే మరో కేసు. అందుకే మేము 'నీట్' నీట్ కాదని గట్టిగా చెబుతున్నాము. నీట్ ప్రారంభం నుంచి చివరి వరకు డబ్బు మాత్రమే ప్రముఖ పాత్ర పోషిస్తుంది. నీట్ పరీక్షా వ్యవస్థ ఒక నైతిక కుంభకోణం" అని పోస్ట్ చేశారు.




మునుగోడు: ఎల్బీనగర్ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి వచ్చేదని.. కానీ, నియోజకవర్గ ప్రజల కోసమే మునుగోడు నుంచి పోటీ చేసినట్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తనకు పదవి వస్తే అది ప్రజలకే ఉపయోగపడుతుందని.. అందరిలా పైరవీలు చేస్తూ దోచుకునేవాడిని కాదని వ్యాఖ్యానించారు. రాజగోపాల్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి కావాలా?మునుగోడు ప్రజలు కావాలా? అంటే మునుగోడు ప్రజలే కావాలని కోరుకుంటానన్నారు. "పార్టీలో చేరినప్పుడు మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవులను అడ్డుపెట్టుకుని సంపాదించేవాడిని కాదు. నా స్వార్థం కోసం మంత్రి పదవిని అడగటం లేదు. మంత్రినైతే మంచి జరుగుతుందని మునుగోడు ప్రజలు భావిస్తున్నారు. భువనగిరి ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవి ఇస్తారా? ఇవ్వరా? అనేది పార్టీ అధిష్ఠానం ఇష్టం. ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు, నా జూనియర్లకు కూడా ఇచ్చారు. ఎవరి కాళ్లో మొక్కి పదవి తెచ్చుకోవాలనుకుకోవట్లేదు. దిగజారి బతకడం నాకు తెలియదు. మళ్లీ త్యాగానికైనా సిద్ధం.. ఎంత దూరమైనా మునుగోడు ప్రజల కోసం వెళ్తా. నా నియోజకవర్గ ప్రజలు తలదించుకునే పని ఏనాడూ చేయను" అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.



## అసెంబ్లీలో మైక్ కట్ చేయకుంటే..
## కాళేశ్వరంపై వాస్తవాలు బయటపెడతాం: కేటీఆర్

దిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక అంతా ట్రాష్ అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘంతో సమావేశం కోసం దిల్లీకి వెళ్లిన ఆయన.. అక్కడ మీడియాతో మాట్లాడారు.

భారత రాష్ట్ర సమితి, మాజీ సీఎం కేసీఆర్‌ను దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే 650 పేజీల కాళేశ్వరం నివేదికను వారికి అనుకూలంగా కుదించారని కేటీఆర్ ఆరోపించారు. పూర్తి నివేదికను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా మాట్లాడే అవకాశం ఇస్తే.. కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలను బయటపెడతామన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ దిల్లీలో నాటకాలు చేస్తోందని కేటీఆర్ విమర్శించారు.

## వినియోగానికి తగినట్లు యూరియా సరఫరా చేయండి.. కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్: రాష్ట్రంలో ఆగస్టు నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దీనికి అనుగుణంగా సరఫరా చేయాలని కేంద్రానికి తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర రసాయన, ఎరువులశాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన లేఖ రాశారు. "ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఆగస్టు నెలలో పంటలకు అత్యధిక వినియోగం దృష్టిలో ఉంచుకుని కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతోందని అంచనా. ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 4.51 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా మాత్రమే జరిగింది. ఏప్రిల్ ప్రారంభం నాటి నిల్వలు కూడా వాడుకొని 5.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు విక్రయించాం. కేంద్రం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించి.. అందులో 1.31 లక్షల మెట్రిక్ టన్నులు దేశీయంగా, 0.39 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో దిగుమతి చేసుకోవాల్సిన యూరియాకు సంబంధించి షిప్‌మెంట్ వివరాలు ఇంకా రాలేదు. దేశీయ సంస్థలైన పీపీఎల్ నుంచి 11,000 మెట్రిక్ టన్నులు, ఎంసీఎఫ్ఎల్ నుంచి 7,000 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. ఆయా సంస్థలు సరఫరా చేయలేమని తెలియజేశాయి. ఏప్రిల్ నుంచి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఏర్పడింది. ఈ విషయంలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా తక్షణం చర్యలు తీసుకోవాలి. ఆ కొరతను ఆగస్టు నెల కోటాలో మంజూరు చేయాలి"అని మంత్రి తుమ్మల లేఖలో పేర్కొన్నారు.

# కాళేశ్వరం రిపోర్టుపై చర్చకు స్పెషల్ అసెంబ్లీ సెషన్స్..!

# సారొస్తారా!?

## రాజకీయ వర్గాల్లో ఇదే చర్చ!!




హైదరాబాద్ : కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై చర్చించేందుకు నిర్వహించే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్షనేత, మాజీ సీఎం కేసీఆర్ హాజరవుతారా? అనే చర్చ సర్వత్రా మొదలైంది. ఎందుకంటే ఆయన ప్రతిపక్ష హోదాలో ఇప్పటివరకు కేవలం రెండు సార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారు. అలాగే సభలో జరిగిన ఏ చర్చల్లోనూ పాల్గొనలేదు. దీనితో అసెంబ్లీ అటెండెన్స్ కోసం మాత్రమే ఆయన వచ్చివెళ్లారనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ తనను దోషిగా చిత్రించిన కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై జరిగే ప్రత్యేక సెషన్‌కు వస్తారా అనేదానిపై ఉత్కంఠ నెలకొంది.

**అసెంబ్లీ వేదికగా కేసీఆర్‌పై విమర్శల దాడి....** ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ప్రతిపక్షనేత కేసీఆర్ ను నిండు సభలో దోషిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం స్ట్రాటజీ రచిస్తున్నది. ఇంతకాలం కేవలం రాజకీయ విమర్శలు చేసిన రూలింగ్ పార్టీ ఇకపై కమిషన్ ఇచ్చిన నివేదికను అస్త్రంగా చేసుకుని, కేసీఆర్, హరీశ్ రావులపై దాడి చేసేందుకు ప్లాన్ చేస్తున్నది. ఆ ఇద్దరి కారణంగానే అవినీతి జరిగిందని, రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని విమర్శల దాడి చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే ఇంతలో కమిషన్ రిపోర్టు పారదర్శంగా లేదని, రాజకీయ కక్ష సాధింపు కోసమే అన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ విమర్శలు మొదలుపెట్టింది. అయితే ఆ విమర్శలకు సభలోనే కౌంటర్ ఇవ్వాలని సీఎం రేవంత్ ప్లాన్ చేస్తున్నారు.

**సభను ఫేస్ చేయగలారా?...** ఒకవేళ అసెంబ్లీకి కేసీఆర్ వచ్చి ఘోష్ రిపోర్టుపై మాట్లాడుతారా? ఆ రిపోర్టును మొత్తం తప్పు అంటారా?లేకపోతే కాళేశ్వరంలో అసలు అవినీతి జరగలేదని ఏ విధంగా వాదిస్తారు?అనే చర్చ జరుగుతోంది. నిజానికి కేసీఆర్ సభకు రావాలని, చర్చల్లో పాల్గొనాలని అధికార పార్టీ సభ్యులే ఎక్కువగా కోరుకుంటున్నారు. ఆయన ప్రతిపక్ష హోదాలో ఏ విధంగా మాట్లాడుతారు? అధికార పార్టీ నుంచి వచ్చి రన్నింగ్ కామెంట్స్ కు ఏ విధంగా స్పందిస్తారు? అనేదాని కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**ఢిల్లీ నుంచి వచ్చాక డేట్స్ ఫైనల్...** లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు సీఎం, మంత్రులు ఢిల్లీలో నిరసనల దీక్షలకు వెళ్లారు. ఈనెల 7న వారు తిరిగి వచ్చిన తరువాత అసెంబ్లీ సమావేశాల తేదీలను ఖరారుచేసే అవకాశం ఉంది.

అగస్టు 11 నుంచి 14 తేదీల్లోపు రెండు రోజుల పాటు సభ జరిగే చాన్స్ ఉందని, లేకపోతే పంద్రాగస్టు తరువాతే సమావేశాలు ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.




# 'చీకటి రాజకీయం'

## భారత్ ఎదుగుదలను ఓర్వలేక పోతున్న అమెరికా!

ప్రపంచంలో అనేక దేశాలను ఆర్థికంగా, వాణిజ్యంగా, రాజకీయంగా పతనం చేసి మొదటి స్థానంలో ఉండటమే గ్రేట్ అమెరికన్ రాజకీయం. మాట వినని వాళ్లపై ఆంక్షలు, సైనిక చర్యలు అంటూ నాశనం చేయటం పెద్దన్నకు వెన్నతో పెట్టిన విద్యని ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు. రష్యాతో వ్యాపారం వద్దంటూ ఇండియాపై ఒత్తిడి పెంచుతున్న అమెరికా.. తాను రష్యాతో చేస్తున్న బిజినెస్ గురించి మాత్రం బయటపెడ్డటం లేదు. ఒక్కసారి నిజమైన లెక్కలు చూస్తే ట్రంప్ డబుల్ గేమ్ గురించి ప్రతి ఒక్కరికీ పూసగుచ్చినట్లు తెలుస్తుంది. గతవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పై 25 శాతం సుంకాన్ని ప్రకటించారు. ఆ సమయంలోనే రష్యా నుంచి మిలిటరీ ఆయుధాలు, క్రూడ్ ఆయిల్ కొనుగోలు మానుకోవాలని హెచ్చరిస్తూ పెనాల్టీ విధిస్తానని చెప్పారు. తాము రష్యాతో ఎలాంటి వ్యాపారం చేయటం లేదంటున్న ట్రంప్ పూర్తిగా ప్రపంచానికి అబద్ధాలు చెబుతున్నట్లు ట్రేడ్ గణాంకాలు చెబుతున్నాయి. ఇదే క్రమంలో యూరోపియన్ యూనియన్ కూడా రష్యాతో వ్యాపారం కొనసాగిస్తున్న విషయం బయటపడింది. తాము రష్యాతో వ్యాపారం కొనసాగిస్తున్నప్పటికీ అమెరికా, ఈయూ ఇతర దేశాలను వ్యాపారం మానుకోవాలంటున్నాయి. దీనిపై బదులిచ్చిన భారత్ దేశ ఆర్థిక భద్రత, జాతి ప్రాధాన్యతలను రక్షించుకునేందుకు తమకు నచ్చిన వాళ్లతో వ్యాపారం కొనసాగిస్తామని తేల్చి చెప్పారు విదేశాంగ మంత్రి జై శంకర్. రష్యాపై ఆంక్షల తర్వాత ఎనర్జీ భద్రత కోసం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను అప్పట్లో అమెరికా సపోర్ట్ చేసిన విషయం తెలిసిందే. కానీ ప్రస్తుతం ప్రెసిడెంట్ మారగానే ప్లేటు మార్చేసింది అమెరికా. వాస్తవానికి రష్యా నుంచి చేసుకుంటున్న చమురు దిగుమతుల కారణంగా ఏడాదికి ఇండియాకు దాదాపు రూ.లక్ష కోట్ల వరకు దిగుమతుల భారం తగ్గుతోంది.

**అమెరికా రష్యాతో చేస్తున్న వ్యాపారం..** కుటిల నీతిని అనుసరిస్తున్న అమెరికా రష్యా నుంచి అణు పరిశ్రమకోసం యురేనియం హెక్సా ఫ్లోరైడ్, ఈవీ రంగం కోసం పల్లాడియం, వ్యవసాయానికి అవసరమైన ఫెర్టిలైజర్స్, కీలక కెమికల్స్, యంత్రాలు, చెక్కను దిగుమతి చేసుకుంటోంది. 2024లో రష్యా నుంచి అమెరికా 3.5 బిలియన్ డాలర్లు విలువైన దిగుమతులు చేసుకుంది.

ఈ కాలంలో 526 మిలియన్ డాలర్ల ఎగుమతులను రష్యాకు పంపింది అమెరికా. ఇక 2025లో ఇప్పటి వరకు రష్యా నుంచి అమెరికా దిగుమతులు 2 బిలియన్ డాలర్లను దాటిపోగా.. 232 మిలియన్ డాలర్ల ఎగుమతులు కూడా చేసింది అమెరికా.

**ఇండియా- అమెరికా వ్యాపారం..** వాస్తవానికి వ్యాపార పరంగా అమెరికా మార్కెట్ ఇండియాకు చాలా కీలకమైనది. ఈ రెండు దేశాల మధ్య వ్యాపారం 2024-25లో 186 డాలర్లకు చేరుకుంది. ఇందులో భారత్ వస్తు ఎగుమతులు అమెరికాకు 86 బిలియన్ డాలర్లకు పైగా ఉండగా.. అమెరికా నుంచి వస్తు దిగుమతులు 45 బిలయన్ డాలర్లుగా ఉన్నాయి. ఇక సేవారంగం ఎగుమతులు 29 బిలియన్ డాలర్లు ఉండగా.. యూఎస్ నుంచి దిగుమతులు సేవల రంగంలో 26 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రధానంగా ఇండియా ఫార్మా, టెలికాం, పెట్రోలియం ఉత్పత్తులు, జ్యూవలరీ అండ్ జెమ్స్, గార్మెంట్స్, ఆటో పార్స్ ఎగుమతులను అమెరికాకు పంపుతోంది. దాదాపు 5 రౌండ్ల చర్చల తర్వాత కూడా అమెరికా ఇండియా మధ్య ట్రేడ్ డీల్ ఫైనల్ కాకపోవటం ట్రంప్ ని నిరుత్సాహపరిచిందని నిపుణులు అంటున్నారు. అమెరికా చెప్పినట్లు డెయిరీ ఉత్పత్తులు, జీన్ మాడిఫైడ్ అగ్రి ఉత్పత్తుల దిగుమతులను ఇండియా ఒప్పుకోకపోవటంపై అమెరికా ఆగ్రహంగా ఉందని వారు అంటున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఒకపక్క ఇండియా ఈ వస్తువులను అమెరికా నుంచి దిగుమతిని నిరాకరిస్తుండగా.. ట్రంప్ మాత్రం నయానో భయానో ఇండియాను తన దారికి తెచ్చుకోవటానికి ఒత్తిడి చేస్తున్నారు. ఈక్రమంలోనే గతవారం 25 శాతం సుంకాల తర్వాత మళ్లీ ఇప్పుడు రష్యా దిగుమతులపై అదనపు సుంకాలను ప్రకటిస్తామని హెచ్చరించినట్లు నిపుణులు అంటున్నారు. తమ అవసారల కోసమే రష్యన్ ఆయిల్ కొంటున్నామని భారత్ చెప్పినప్పటికీ యూఎస్ వితండవాదం చేస్తోంది. జూలై ఒక్క నెలలోనే భారత్ మొత్తం క్రూడ్ అవసరాల్లో 36 శాతం రష్యా నుంచి వచ్చాయి.




## తెలంగాణలో స్థానికత వ్యవహారంపై సుప్రీంలో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వు

హైదరాబాద్: తెలంగాణ స్థానికత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పదో తరగతి తర్వాత రెండేళ్లు బయట ఉంటే స్థానికత వర్తించదన్న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి.. తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్థానికత అంటే ఏమిటి? ఎవరు దీని పరిధిలోకి వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును విద్యార్థులు సుప్రీంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని విచారణ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి.. రెండేళ్లు బయటకు వెళితే స్థానికత ఎలా కోల్పోతారని ప్రశ్నించారు. 2014లో నిబంధనలు తీసుకొచ్చారు.. అప్పుడు ఈ రెండు, నాలుగేళ్ల సమయం గురించి అందులో ప్రస్తావించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. 2024లో తీసుకొచ్చిన నిబంధనను 2028కి వర్తింపజేస్తే సరిపోతుందని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిబంధనల కారణంగా తెలంగాణ విద్యార్థుల హక్కులకు అన్యాయం జరగకూడదని వాదనల సందర్భంగా సీజేఐ అభిప్రాయం వ్యక్తం చేశారు. "కోటా, దుబాయ్ లాంటి ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లిన విద్యార్థులకు స్థానికత వర్తించదంటే ఎలా? ఒక విద్యార్థి తెలంగాణలో పుట్టి పెరిగి.. రెండేళ్లు బయట చదువుకున్నంత మాత్రాన కోటా వర్తించదంటే ఎలా? ప్రతి విద్యార్థి 371డి అధికరణం గురించి తెలుసుకోవాలన్నట్టుగా మీ వాదనలు ఉన్నాయి. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు ఉంటే.. 8వ తరగతిలోనే రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్న విధంగా మీ వాదనలు ఉన్నాయి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పలు రాష్ట్రాల్లో స్థానికత వ్యవహారం పలు విధాలుగా ఉందన్న రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ.. అస్సాంలో 7 సంవత్సరాల నిబంధన ఉందని గుర్తు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో పేద, మధ్యతరగతి వాళ్లకు జరుగుతున్న ఉపయోగాన్ని విస్తృత కోణం నుంచి చూడాలని, అందుకు తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేస్తున్నట్టు సీజేఐ జస్టిస్ గవాయ్ ధర్మాసనం తెలిపింది.




## వీసా గడువు తీరినా అమెరికాలోనే ఉన్నారో..: భారతీయులకు ఎంబసీ వార్నింగ్

నిర్దేశిత గడువు దాటి అమెరికాలో ఉంటున్నవారిని ఉద్దేశించి భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఈ అంశంలో ఉల్లంఘనకు పాల్పడితే కలిగే తీవ్ర పరిణామాలను స్పష్టంగా వెల్లడించింది. పర్యాటక, విద్యార్థి, వర్క్ పర్మిట్స్ సహా వివిధ వీసాలపై అమెరికాలో నివసిస్తోన్న భారతీయులను ఉద్దేశించి ఈ హెచ్చరిక చేసింది. "యూఎస్ వీసా గడువు నిబంధనలను గౌరవించండి. ఉల్లంఘనలకు పాల్పడితే.. వీసా రద్దు, బహిష్కరణకు గురయ్యే ముప్పు ఉంది. భవిష్యత్తులో వీసా రాకుండా అనర్హత వేటు పడొచ్చు. గడువు దాటి ఉండటం వల్ల అమెరికాలో ప్రయాణించడం, చదువుకోవడం, పని చేయడంపైనా శాశ్వత ప్రభావం పడొచ్చు" అని ఎంబసీ హెచ్చరించింది. దీనికి ముందు అమెరికా చట్టసభ సభ్యురాలు టేలర్ గ్రీని.. హెచ్1-బీ వీసాలపై అమెరికాకు వచ్చే భారతీయులను ఉద్దేశించి అక్కసు వెళ్లగక్కారు. అమెరికన్ల ఉద్యోగాలను లాగేసుకునే భారతీయ హెచ్1-బీ వీసాలకు ముగింపు పలకండని వ్యాఖ్యలు చేశారు. కాగా.. అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలసలపై ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. దానిలోభాగంగా బిజినెస్, టూరిస్ట్ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు షూరిటీ కింద 15వేల డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ. 13లక్షలు) వరకు బాండ్ కోసం చెల్లించాలని అగ్రరాజ్య విదేశాంగశాఖ ప్రతిపాదనలు చేసింది. వీసా కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడే ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ సదరు వీసాదారులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకొని.. గడువు పూర్తయిన తర్వాత దేశం వీడితే ఆ మొత్తాన్ని రీఫండ్ చేస్తారు. అలాకాకుండా.. చట్టవిరుద్ధంగా వ్యవహరించినా.. వీసా గడువు ముగిశాక కూడా అగ్రరాజ్యంలోనే ఉన్నా.. ఎలాంటి రీఫండ్ రాదు. వీసా గడువు తీరినా కొంతమంది దేశం విడిచి వెళ్లడం లేదని, వారివల్ల దేశ భద్రతకు ముప్పు పొంచిఉన్న నేపథ్యంలో ఈ మార్పులు తీసుకొస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం చెబుతోంది.




## విత్ డ్రా చేసుకోవాలని పిటిషనర్‌ను ఎందుకు బెదిరిస్తున్నారు: హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్: నాగారంలోని భూదాన్ భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కేసు ఉపసంహరించుకోవాలని పోలీసులు బెదిరిస్తున్నారని పిటిషనర్ రాములు పిటిషనర్ రాములు కోర్టుకు తెలిపారు. కానిస్టేబుల్ కోర్టు ముందు హాజరుకావాలని న్యాయమూర్తి గత విచారణ సందర్భంగా ఆదేశించారు. దీంతో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఇవాళ న్యాయమూర్తి ఎదుట విచారణ హాజరయ్యారు. సీఐ వెంకటేశ్వర్లు ఆదేశం మేరకు పిటిషనర్‌కు ఫోన్ చేశానని కానిస్టేబుల్ కోర్టుకు తెలిపారు. విలేజ్ హిస్టరీ రికార్డులో వివరాల నమోదు కోసం రాములుకు ఫోన్ చేసినట్టు పేర్కొన్నారు. విత్‌డ్రా చేసుకోవాలని పిటిషనర్‌ను ఎందుకు బెదిరిస్తున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదులు మరోసారి రావొద్దని ఉన్నత న్యాయస్థానం హెచ్చరించింది.

## గతంలో బూతులు మాట్లాడిన నేతలు ఎవరూ గెలవలేదు: వెంకయ్యనాయుడు



హైదరాబాద్: పత్రికలు సమాజానికి దర్పణం లాంటివని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ''సమాజంలోని అవినీతిని ప్రజలకు జర్నలిస్టులు వివరించాలి. నిజాన్ని తెలియజేసి తీర్పును ప్రజలకే వదిలేయాలి. మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి. గతంలో బూతులు మాట్లాడిన నేతలు ఎవరూ గెలవలేదు. అలాంటి వారిని నిలువరించాలని ఓ మహిళ నాతో అన్నారు. పోలింగ్‌బూత్‌ల ద్వారా బూతు నేతల నోరు మూయించాలని ఆమెకు చెప్పాను" అని వెంకయ్యనాయుడు అన్నారు.

## హైదరాబాద్‌కు రెండు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు'



దిల్లీ: దేశంలో క్రిటికల్ మినరల్స్ పరిశోధనల కోసం దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఏడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల్లో రెండు హైదరాబాద్‌కు కేటాయించినట్లు కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ఒకటి హైదరాబాద్ ఐఐటీ, మరొకటి నాన్‌ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్(ఎన్ఎఫ్‌టీడీసీ)లో నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. మిగతా వాటిని బాంబే ఐఐటీ, ధన్‌బాద్ ఐఐటీ-ఐఎస్ఎం, ఐఐటీ రూర్కీ, భువనేశ్వర్ సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ, జంషెడ్‌పుర్‌లోని సీఎస్ఐఆర్-ఎన్ఎంఎల్‌ల్లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడు సెంటర్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చనుందని వెల్లడించారు. వీటి ఆర్అండ్‌డీ కోసం రూ. 500 కోట్లు, అంతర్జాతీయ స్థాయి మానవ వనరుల అభివృద్ధి కోసం రూ. 500 కోట్లు అందించనున్నట్లు వివరించారు. దీనివల్ల హైదరాబాద్‌లోని ఐఐటీ, ఎన్ఎఫ్‌టీడీసీలు క్రిటికల్ మినరల్స్ రంగంలో లోతైన పరిశోధనలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి పవిత్రోత్సవాలకు సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సేనాధిపతి విష్వక్సేనులవారిని సాయంత్రం ఆలయ మాడవీధుల మీదుగా వసంత మండపానికి వేంచేపు చేశారు. అనంతరం మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించారు. ఆలయంలోని పవిత్ర మండపంలో అంకురార్పణ, వైదిక కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం నుంచి ఈ నెల 7వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు.

## కేసీఆర్‌ను హింసించడమే లక్ష్యంగా పాలన సాగుతోంది: హరీశ్‌రావు



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణభవన్‌లో ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యాలయాల్లో కార్యకర్తలు చూసేలా ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్‌ను హింసించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. "మహారాష్ట్రతో చారిత్రక ఒప్పందం చేసుకుని కాళేశ్వరం నిర్మించాం. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించిందా..?. ధవళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కాటన్ మీద కూడా ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వం కమిషన్ వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కేసీఆర్‌ను కూడా భవిష్యత్ తరాలు దేవుడిగా కొలుస్తాయి. కాళేశ్వరం కమిషన్ పేరుతో వండి వార్చిన నివేదికను బయటపెట్టారు. మొత్తం నివేదికను బయటపెట్టలేదు. వాస్తవాలు బయటపెట్టాలన్నదే మా ఉద్దేశం. సీఎం రేవంత్‌రెడ్డి పాలన గాలికి వదిలేసి రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు దండుకునేందుకు కమీషన్లు, ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు కోసం రాజకీయ కమీషన్లు. రాష్ట్ర మంతా కమీషన్లమయం చేశారు. కాంగ్రెస్, భాజపా కలిసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు మూడు సార్లు దెబ్బతిన్నా అక్కడకు ఎన్డీఎస్ఏ వెళ్లలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని కాళేశ్వరం కమిషన్ నివేదిక బయటపెట్టారు. కేసీఆర్, హరీశ్ రావును కమిషన్ పిలవదు అని మొదట అన్నారు..ఆ తర్వాత రాత్రికి రాత్రే కమిషన్ గడువు పెంచారు. పూర్తి నివేదిక బయటపెట్టి అసెంబ్లీలో చర్చ పెడితే... చీల్చి చెండాడుతాం. నచ్చిన పేరాలు లీకులు... నచ్చని నాయకుల్ని బాధ్యులు చేసినట్లు ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇచ్చింది, నివేదిక నిజమైతే కేంద్ర ప్రభుత్వాన్ని, అధికారుల్ని తప్పుపట్టినట్లే. ఒక వైపే చూసి, ఒక వైపే విని, ఒక వైపే నిల్చుని ఇచ్చిన నివేదికలా కనిపిస్తోంది. నివేదిక ఒక ట్రాష్.. ఆధారాలు లేని ఆరోపణలు. ప్రాజెక్టుపై ఒక సీఎం సమీక్ష చేయడం ఆయన బాధ్యత.. రాజకీయ జోక్యం ఎలా అవుతుంది? చరిత్రలో ఇలాంటి కమిషన్లు చాలా వచ్చాయి.. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చే నివేదికలు న్యాయస్థానాలు, ప్రజా క్షేత్రంలో నిలబడవు. రైతుల ప్రయోజనాలు ఫణంగా పెట్టి కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. తుమ్మిడి హట్టిని కాంగ్రెస్ ఏ ప్రాతిపదికన చేపట్టింది? తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్లకు ఒప్పందం చేసుకొని ఉంటే రాజీనామా చేస్తానని ఉత్తమ్ కుమార్ రెడ్డికి కేసీఆర్ సవాల్ చేశారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసింది? ఒక్క ఎకరాకు అయినా నీళ్లు ఇచ్చారా? రెండేళ్లలో దిల్లీకి కమిషన్లు మోశారు.. ప్రతిపక్షాలపై కేసులు, కమిషన్లు తప్ప ఏమీ చేయలేదు. వచ్చే మూడేళ్లు కూడా ఈ ప్రభుత్వం చేసేది ఇదే. కాళేశ్వరంను పడావు పెట్టి బనకచర్లకు నీరు పోవాలన్నది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన. ముమ్మాటికీ తెలంగాణకు వరప్రదాయని కాళేశ్వరం ప్రాజెక్టు...ఈ విషయం రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. కాళేశ్వరం కూలిందని ఓ వైపు అంటారు..మరోవైపు మూసీకి గోదావరి జలాలు తీసుకొస్తామని ఎలా చెబుతారు" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో 'కాళేశ్వరం' నివేదిక ద్వారా తెలిసింది: మంత్రి పొంగులేటి



ఖమ్మం: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ద్వారా తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాళేశ్వరం కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదవాడి కోసం అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలానికి ఒక ఐటీఐ కళాశాల మంజూరు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునికీకరణ చేస్తున్నామని వెల్లడించారు. మండల అభివృద్ధికి రూ. 75 కోట్లు కేటాయించామన్నారు. పేదవాడి ఆకలి తీర్చే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేశామని.. పేద రైతుల కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు.

**బాలికలకు సైకిళ్ల పంపిణీ..** ఏదులాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, 1, 59, 60వ డివిజన్లకు చెందిన 8వ తరగతి బాలికలకు మంత్రి సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి స్కూల్ విద్యార్థులతో పాటు జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా సైకిళ్లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

## మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం: మంత్రి శ్రీధర్‌బాబు

మేడ్చల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలంగాణ ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని చెప్పారు. పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 40 వేల రేషన్ కార్డులు అందించామని.. మరో 60 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తికాగానే అందజేస్తామన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో 'మీ సేవ' కేంద్రాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను నెరవేర్చడంలో సఫలీకృతమయ్యామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి వారిని సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వజ్రేష్ యాదవ్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి కుంగిన రోడ్డు.. కూకట్‌పల్లిలో ట్రాఫిక్ జామ్

హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి కూకట్‌పల్లి జాతీయ రహదారిపై ముస్లిం గ్రేవ్ యార్డ్ వద్ద ఉన్న మ్యాన్‌హోల్‌తో పాటు రోడ్డు కుంగింది. దీంతో రహదారిపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అదే రహదారిపై ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. ఫలితంగా స్టేషన్ నుంచి వై జంక్షన్ వరకు మురుగు నీరు ప్రవహిస్తోంది.



చురకలు




# ప్రజలతో మమేకమైన నేత సోలిపేట - ఆగస్టు 6... సోలిపేట రామలింగారెడ్డి వర్ధంతి



తెలంగాణ ఉద్యమంతో మమేకమైన చిత్తశుద్ధి గల నాయకుడు సోలిపేట రామలింగారెడ్డి. నిత్యం ప్రజల మధ్యనే మనుగడ సాగించిన నిరాడంబర నేతగా ప్రజల హృదయాల్లో రామలింగారెడ్డి చెరగని ముద్రవేసారు. సోలిపేట రామలింగారెడ్డి (అక్టోబరు 2, 1961 – ఆగస్టు 6, 2020) తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన రాజకీయ నాయకులు, ప్రముఖ పాత్రికేయులు, జర్నలిస్టు సంఘ నేతగా సుపరిచితులు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున 2004, 2008 (ఉపఎన్నిక)లలో దొమ్మాట శాసనసభ నియోజకవర్గం నుండి 2014, 2018 ఎన్నికల్లో దుబ్బాక శాసనసభ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1962 అక్టోబర్ 2 న సిద్ధిపేట జిల్లాదుబ్బాక మండలంలోని చిట్టాపూర్ లోని సామాన్యరైతు కుటుంబంలో జన్మించిన రామలింగారెడ్డి విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. ప్రజల హక్కులను కాపాడడానికి పత్రికలు ఉపయోగపడతాయనే విశ్వాసంతో జర్నలిస్టు వృత్తిని ఎంచు కున్నారు. వామపక్ష భావాలతో ప్రేరితు లైన రామలింగారెడ్డి మెదక్ జిల్లాలో ఎగిసి పడిన ఉద్యమాలకు బాసటగా నిలిచారు. జర్నలిస్టు సంఘం నాయకుడిగా కూడా రామలింగారెడ్డికి ప్రత్యేక స్థానం పొందారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రామలింగారెడ్డి రాజీలేని పోరాటాలు చేశారు. తను నమ్మిన ఆదర్శాలను ఆచరణలో పెట్టిన అభ్యుదయవాది సోలిపేట. వరకట్నం, తదితర ఆడంబరాల ప్రసక్తి లేకుండా సభావివాహం చేసుకున్నారు. ప్రజాకవి కాళోజితో పాటు, ఆనాటి సిద్దిపేట శాసనసభ్యులైన నేటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ సమక్షంలో చేతుల వివాహం జరిగింది. ఆదర్శాన్ని తనవరకే పరిమితం చేయకుండా తన పిల్లలకు కూడా అదే పద్ధతిలో వివాహాలు జరిపించిన ఆచరణశీలి సోలిపేట. పాఠశాల స్థాయిలోనే ఉద్యమాలపై ప్రేమ పెంచుకున్న రామలింగారెడ్డి, ఇంటర్ తరువాత అర్.ఎస్.యు. (రాడికల్ స్టూడెంట్స్ యూనియన్) జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. ప్రజా సమస్యల్లో పాలుపంచు కుంటూ వస్తున్న క్రమంలో పోలీసుల నుంచి కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర య్యాయి. 1991లో టాడా కేసు పెట్టారు. విప్లవ సాహిత్యంతో పాటు బాంబులు దొరికాయని, నక్సలైట్ గా పనిచేస్తున్నారని కేసు పెట్టి నిర్బందంలో ఉంచి చిత్రహింసలకు గురి చేశారు. నాలుగు రోజులకు సెంట్రల్ జైల్ కు తరలించారు. ఈ క్రమంలోనే దేశ, రాష్ట్రంలో జర్నలిస్టులు, ప్రజా సంఘాలు ఉద్యమాలు చేపట్టాయి. లండన్ లో కూడా ఉద్యమాలు జరిగాయి. కేంద్ర మానవ హక్కుల కమిషనర్ రంగరాజన్ జోక్యంతో కోర్టు విచారణలో పోలీసులు తప్పుడు కేసు పెట్టారని తేలడంతో నిర్దోషిగా బయటకు వచ్చారు. 1983 తరువాత ఉదయం దినపత్రికలో రిపోర్టర్ గా చేరాడు. వార్త రిపోర్టర్ గా కొనసాగుతూ ఎపియుడబ్ల్యుజె (జర్నలిస్టు యూనియన్) జిల్లా అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేశారు. జహీరాబాదులో, సిద్ధిపేటలో వార్త విలేఖరిగా పనిచేశారు. సుమారు 25 ఏళ్ళు పాత్రికేయునిగా పనిచేసిన రామలింగారెడ్డి కేసీఆర్ పిలుపుమేరకు రాజకీయాల్లోకి వచ్చాడు. 2004లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో దొమ్మాట శాసనసభ నియోజకవర్గం నుండి పోటిచేసి ఎన్నికై తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టారు. 2008 ఉప ఎన్నికల్లో కూడా ఎన్నికయిన రామలింగారెడ్డి, 2009 ఎన్నికల్లో ఓడిపోయారు. ప్రజాసేవలో నిమగ్నమౌతూనే, ఇతర మెదక్ జిల్లాలో తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో రామలింగా రెడ్డి చురుకైన పాత్ర పోషించారు. సమైక్యవాద నాయకులు కల్పించే ప్రలోభాలకు లొంగకుండా చెదరని సంకల్పంతో పోరాటంలో నిలిచారు. ఉద్యమ ప్రయోజనాలకోసం నాయకత్వం నిర్దేశించినప్పుడు తన ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014లో దుబ్బాక శాసనసభ నియోజకవర్గం నుండి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు ముత్యంరెడ్డిపై 37,925 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2018లో జరిగిన ముందస్తు తెలంగాణ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి మద్దుల నాగేశ్వరరెడ్డిపై 62,500 ఓట్ల తేడాతో గెలుపొందారు. శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. సిద్ధిపేటలోని జర్నలిస్టు కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కట్టుకున్న సాధారణమైన ఇంట్లోనే చివరిదాకా నిరాడంబరంగా జీవించారు. ఉదయం లేచింది మొదలు నియోజకవర్గ ప్రజల బాగోగులు చూడడం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం నిత్య కృత్యంగా పెట్టుకుని, ప్రజల కోసం పనిచేసే జీవన విధానంగా ఎంచుకున్న అరుదైన నాయకుడు రామలింగారెడ్డి. మధుమేహ వ్యాధితో బాధపడుతున్న రామలింగారెడ్డి కాలికి గాయమై అది ప్రమాదకరంగా పరిణ మించడంతో 2020 ఆగస్టు 5 వ తేదీన అర్ధరాత్రి దాటాక గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తొలి రాజకీయ సంస్థ స్థాపకుడు సురేంద్రనాథ్ బెనర్జీ


## – ఆగష్టు 6...సురేంద్రనాథ్ బెనర్జీ వర్ధంతి



సర్ సురేంద్రనాథ్ బెనర్జీ (1848 నవంబరు 10 %–% 1925 ఆగస్టు 6) బ్రిటిష్ రాజ్ కాలంలో భారత రాజకీయ నాయకులలో ఒకడు. తొలి భారతీయ రాజకీయ సంస్థలలో ఒకటైన ఇండియన్ నేషనల్ అసోసియేషన్‌ను స్థాపించాడు. దీని ద్వారా ఆనందమోహన్ బోస్ తో కలిసి 1883, 1885 లలో ఇండియన్ నేషనల్ కాన్ఫరెన్స్ రెండు సెషన్లకు నాయకత్వం వహించాడు. బెనర్జీ తరువాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా మారారు. కాంగ్రెస్ మాదిరిగా కాకుండా మోంటాగు-చెల్మ్స్‌ఫోర్డ్ సంస్కరణలను స్వాగతించాడు. చాలా మంది ఉదారవాద నాయకులతో అతను కాంగ్రెస్ నుండి నిష్క్రమించి, 1919 లో ఇండియన్ నేషనల్ లిబరేషన్ ఫెడరేషన్ అనే కొత్త సంస్థను స్థాపించాడు. అతను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులలో ఒకడు. సురేంద్రనాథ్ బెనర్జీ బెంగాల్ ప్రావిన్స్ లోని కలకత్తా (కోల్‌కతా) లో బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అతని తండి దుర్గా చరణ్ బెనర్జీ వైద్యుడు, ఉదారవాద, ప్రగతిశీల ఆలోచనలు గలవాడు అతని తండ్రి అతనిపై తీవ్ర ప్రభావం చూపాడు. కలకత్తా విశ్వవిద్యాలయం నుండి పట్టా పొందిన తరువాత, అతను 1868 లో రోమేష్ చుందర్ దత్, బిహారీ లాల్ గుప్తాతో కలిసి ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలను రాయడానికి ఇంగ్లాండ్ వెళ్ళాడు. అతను 1869 లో పోటీ పరీక్షలో నెగ్గినప్పటికీ, అతను తన వయస్సును తప్పుగా చూపించాడనే వాదనతో అతనిని నిషేధించారు. బెనర్జీ 1871 లో మళ్లీ పరీక్షను రాసి విజయం పొంది సిల్‌హెట్‌లో అసిస్టెంట్ మేజిస్ట్రేట్‌గా నియామకం పొందాడు. బెనర్జీ లండన్‌లోని యూనివర్శిటీ కాలేజీలో తరగతులకు కూడా హాజరయ్యాడు. అతను 1871 లో చివరి పరీక్షలు రాసి 1871 ఆగస్టులో భారత దేశానికి తిరిగి వచ్చాడు. 1874 లో, బెనర్జీ లండన్ తిరిగి వచ్చి మిడిల్ టెంపుల్ లో విద్యార్థి అయ్యాడు. బ్రిటీష్ వారి పట్ల విసుగు చెంది భారతదేశానికి తిరిగి వచ్చాడు. అతను ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో (1874%–%1875), ఎడ్మండ్ బుర్కే, ఇతర ఉదార తత్వవేత్తల రచనలను అధ్యయనం చేశాడు. ఈ రచనలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేసిన నిరసనలలో అతనికి మార్గనిర్దేశం చేశాయి. అతన్ని ఇండియన్ బుర్కే అని పిలిచేవారు. 1882 లో అతను స్థాపించిన రిప్పన్ కాలేజీ (ఇప్పుడు సురేంద్రనాథ్ కాలేజీ)లో ఇంగ్లీష్ ప్రొఫెసర్ అయ్యాడు. అతను జాతీయవాద, ఉదారవాద రాజకీయ అంశాలతో పాటు భారతీయ చరిత్రపై బహిరంగ ప్రసంగాలు చేయడం ప్రారంభించాడు. అతను జూలై 26, 1876 న ఆనందమోహన్ బోస్‌తో కలిసి తొలి భారతీయ రాజకీయ సంస్థలలో ఒకటైన ఇండియన్ నేషనల్ అసోసియేషన్‌ను స్థాపించాడు. 1878 లో భారతీయ ప్రజలను బోధించడానికి జరిగిన సమావేశంలో ఆయన ఇలా అన్నాడు, "హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, పరేసీల మధ్య శాంతి, సద్భావనల గొప్ప సిద్ధాంతం, మన దేశ ప్రగతి అన్ని వర్గాల మధ్య. "ఏకత్వం" అనే పదాన్ని అందులో మెరిసే బంగారం అక్షరాలు చెక్కనివ్వండి... మా మధ్య మత భేదం ఉండవచ్చు, సామాజిక వ్యత్యాసం ఉండవచ్చు. కానీ మనమందరం కలుసుకునే ఒక సాధారణ వేదిక ఉంది. ఇది మన దేశ సంక్షేమం వేదిక ". ఐసిఎస్ పరీక్షలకు హాజరయ్యే భారతీయ విద్యార్థులకు వయోపరిమితి సమస్యను పరిష్కరించడానికి అతను ఈ సంస్థను ఉపయో గించాడు. భారతదేశంలో బ్రిటీష్ అధికారులు దేశవ్యాప్తంగా ప్రసంగాల ద్వారా చేసిన జాతి వివక్షను ఆయన ఖండించాడు. ఇది తనను బాగా ప్రాచుర్యం పొందేట్లు చేసింది. 1879 లో, అతను ది బెంగాలీ అనే వార్తాపత్రికను స్థాపించాడు. 1883 లో, తన వార్తా పత్రికలో వ్యాఖ్యలను ప్రచురించినందుకు బెనర్జీని అరెస్టు చేసినప్పుడు, కోర్టు ధిక్కారంలో బెంగాల్ అంతటా, ఆగ్రా, ఫైజాబాద్, అమృత్‌సర్, లాహెూర్, పూణే లలో హర్తాళ్ళు, నిరసనలు చెలరేగాయి. భారత జాతీయ కాంగ్రెస్ గణనీయంగా విస్తరించింది. కలకత్తాలో జరిగిన వార్షిక సమావేశానికి భారత దేశం నలుమూలల నుండి వందలాది మంది ప్రతినిధులు వచ్చారు. 1885 లో బొంబాయిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపించిన తరువాత, బెనర్జీ 1886 లో వారి సాధారణ లక్ష్యాలు, సభ్యత్వాల కారణంగా తన సంస్థను అందులో విలీనం చేశాడు. 1895 లో పూనాలో, 1902 లో అహ్మదా బాద్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1905 లో బెంగాల్ ప్రావిన్స్ విభజనను నిరసించిన ప్రజా నాయకులలో సురేంద్రనాథ్ ఒకడు. బెనర్జీ ఈ ఉద్యమంలో ముందంజలో ఉన్నాడు. బెంగాల్, భారతదేశం అంతటా నిరసనలు జరిగి, విస్తృతమైన ప్రజా మద్దతును పొందాడు. ఇది చివరికి 1912 లో బెంగాల్ విభజనను తిప్పికొట్టడానికి బ్రిటిష్ వారిని బలవంతం చేసింది. భారత నాయకులైన గోపాల్ కృష్ణ గోఖలే, సరోజిని నాయుడులకు బెనర్జీ పోషకునిగా మారారు. మితవాద కాంగ్రెస్ సీనియర్ – మోస్ట్ నాయకులలో బెనర్జీ కూడా ఒకడు. విప్లవం, రాజకీయ స్వాతంత్ర్యాన్ని సమర్ధించిన వారు బాల గంగాధర్ తిలక్ నేతృత్వంలో 1906 లో పార్టీని వీడారు. స్వదేశీ ఉద్యమంలో బెనర్జీ ఒక ముఖ్యమైన వ్యక్తిగా విదేశీ ఉత్పత్తులకు వ్యతిరేకంగా భారత దేశంలో తయారైన వస్తువులను సమర్థించాడు. 1909 లో మోర్లే-మింటో సంస్కరణలకు బెనర్జీ మద్దతు ఇచ్చాడు. మహాత్మా గాంధీ ప్రతిపాదించిన శాసనోల్లంఘన ఉద్యమం ప్రతిపాదిత పద్ధతిని బెనర్జీ విమర్శించాడు. మాంటెగ్ చెమ్స్ ఫర్డ్ సంస్కరణలను అంగీకరించడానికి సురేంద్రనాథ్ బెనర్జీ అనుకూలంగా ఉన్నాడు. కొందరు కాంగ్రెస్‌ను విడిచిపెట్టి ఇండియన్ లిబరేషన్ ఫెడరేషన్‌ను స్థాపించారు. వారిని ఉదారవాదులు అని పిలుస్తారు. ఆ తరువాత వారు భారత జాతీయ ఉద్యమంలో తమ సాంగత్యాన్ని కోల్పోయారు. బెంగాల్ ప్రభుత్వంలో మంత్రి పదవిని అంగీకరించడం అతనికి జాతీయ వాదుల, ప్రజలకు కోపాన్ని కలిగించింది. అతను 1921 లో సంస్కరించ బడిన శాసన మండలికి ఎన్నుకోబడ్డాడు. అదే సంవత్సరంలో నైట్ , 1921 నుండి 1924 వరకు స్థానిక స్వపరిపాలన మంత్రిగా పదవిలో ఉన్నాడు. 1923 లో ఎన్నికలలో అతని ఓటమి అతని రాజకీయ జీవితాన్ని ముగించింది. కాగా 1923 లో బెంగాల్ శాసనసభ ఎన్నికలలో స్వరాజ్య పార్టీ అభ్యర్థి బిధన్ చంద్ర రాయ్ చేతిలో ఓడిపోయాడు. బ్రిటీష్ సామ్రాజ్యానికి రాజకీయ మద్దతు ఇచ్చినందుకు అతను నైట్ అయ్యాడు. బెనర్జీ బెంగాల్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేస్తున్నప్పుడు కలకత్తా మునిసిపల్ కార్పొరేషన్‌ను మరింత ప్రజాస్వామ్య సంస్థగా మార్చాడు. ఆయన 1925 లో ప్రచురించబడిన ఎ నేషన్ ఇన్ మేకింగ్ ద్వారా విస్తృతంగా ప్రశంసలు అందుకున్నాడు. సురేంద్రనాథ్ 6 ఆగస్టు 1925 న బరాక్‌పూర్‌లో మరణించాడు. భారత రాజకీయాల అధికారీ కరణకు మొదటిగా బాట వేసిన నేతగా – భారత రాజకీ యాల మార్గదర్శకునిగా బాగా గుర్తుంచుకో బడుతున్నాడు. బ్రిటీషువారు ఆయన చివరి సంవత్సరాలలో "సరెండర్ నాట్" బెనర్జీగా గౌరవించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పెన్సిలిన్ ఆవిష్కర్త ఫ్లెమింగ్ - ఆగస్టు 6...అలెగ్జాండర్ ఫ్లెమింగ్ జయంతి




వెయ్యేళ్ల కాలంలోనే అతి గొప్ప ఆవిష్కరణగా, కోట్లాది మంది ప్రాణాలకు రక్షణగా గుర్తింపు పొందింది 'పెన్సిలిన్'. వైద్యశాస్త్రంలో అద్భుతమైన యాంటీ బయాటిక్ మందుగా పేరుపొందిన పెన్సిలిన్ పేరు చెప్పగానే వెంటనే స్ఫురించే పేరు అలెగ్జాండర్ ఫ్లెమింగ్. తొలి యాంటీ బయోటిక్‌గా పేరొందిన ఆ మందును కనిపెట్టిన శాస్త్రవేత్త అలగ్జాండర్ ఫ్లెమింగ్. ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే యాంటీ బయాటిక్. వేరే ప్రయోగం చేస్తుండగా జరిగిన చిన్న పొరపాటు వల్ల ఇది బయట పడడం విశేషం. పెన్సిలిన్ వల్ల క్షయ, న్యూమోనియా, టైఫాయిడ్ లాంటి ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నుంచి మానవాళికి రక్షణ కలుగుతోంది. దీన్ని కనిపెట్టినందుకు ఫ్లెమింగ్ 1945లో నోబెల్ బహుమతిని పొందారు. సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ (ఆగస్టు 6, 1881 – మార్చి 11, 1955) స్కాట్లాండుకు చెందిన జీవ శాస్త్రవేత్త, వైద్యుడు. 1923 లో కనుగొన్న ఎంజైములు, లైసోజైములు, 1928 లో కనుగొన్న ప్రపంచ మొట్ట మొదటి యాంటీ బయోటిక్ పెన్సిలిన్ ఆయన పరిశోధనల్లో ముఖ్యమైనవి. పెన్సిలిన్ కనుగొన్నందుకు ఆయన 1945లో హెూవర్డ్ ఫ్లోరే, ఎర్నెస్ట్ బోరిస్ చైన్‌లతో కలిసి వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నాడు. బ్యాక్టీరియాలజీ, ఇమ్యునాలజీ, కీమోథెరపీ మీద అనేక వ్యాసాలు రాశారు. స్కాట్లాండ్‌లో 1881 ఆగస్టు 6న రైతు కుటుంబంలో పుట్టిన ఫ్లెమింగ్, ఏడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మధ్యలోనే ఆపేసి షిప్పింగ్ కంపెనీలో గుమాస్తాగా చేరాల్సి వచ్చింది. అనుకోకుండా ఆస్తి కలిసి రావడంతో తిరిగి ఇరవయ్యేళ్ల వయసులో చదువును కొనసాగించడం ప్రపంచానికెంతో మేలు చేకూర్చింది. సెయింట్ మేరీస్ కాలేజీలో వైద్యవిద్యలో చేరి చురుగ్గా చదువుతూనే రైఫిల్ షూటింగ్, ఈత, వాటర్‌పోలో క్రీడల్లో బహుమతులు పొందుతూ ఉండేవారు. మేరీ మెడికల్ కాలేజీ నుంచి 1906 లో ఈయన డిగ్రీ తీసుకున్నారు. డిగ్రీ పొందాక పరిశోధనల్లో నిమగ్నమయ్యారు. మొదటి ప్రపంచ యుద్ధం ఫలితంగా 1918 లో మళ్ళీ సెయింట్ మేరీ మెడికల్ కాలేజీకి చేరారు. మొదటి ప్రపంచ యుద్ధం మొదలవడంతో సైనికులకు చికిత్సలు చేసే బృందానికి నాయకత్వం వహించారు. గాయాలకు సూక్ష్మజీవుల వల్ల ఇన్ఫెక్షన్ సోకి చాలా మంది సైనికులు చనిపోవడాన్ని గమనించిన ఫ్లెమింగ్, యుద్ధానంతరం బ్యాక్టీరియాపై పరిశోధనలు చేయసాగాడు. లండన్ లోని సెయింట్ మేరీస్ హాస్పిటల్‌లోని ప్రయోగశాలలోని ఇన్‌క్యులేషన్ విభాగంలో ఫ్లెమింగ్ ఇన్ఫుఎంజా వైరస్‌తో ప్రయోగాలు చేశారు. వాటిలో భాగంగా 'స్టెఫైలో కోకి' సూక్ష్మజీవులపై పరిశోధన చేస్తుండగా ఓ రోజున చిన్న పొరపాటు జరిగింది. ఆ బ్యాక్టీరియా ఉన్న పాత్రలను బల్లపై పెట్టి మర్చిపోయి ఇంటికి వెళ్లిపోయారు. ఆ మర్నాడు వచ్చి చూస్తే బయటి వాతావరణం ప్రభావం వల్ల ఓ పాత్రలో నీలిరంగులో బూజులాంటి తెట్టు (ఫంగస్) కట్టి ఉండడం గమనించారు. చిత్రంగా ఆ బూజు ఆశించినంత మేరా పాత్రలో సూక్ష్మజీవులు నాశనమై కనిపించాయి. అంటే ఆ బూజులో సూక్ష్మజీవులను చంపే పదార్థమేదో ఉందని తెలుసు కున్నారు. దాంతో ఫ్లెమింగ్ దానిపై పరిశోధనలు చేసి చిన్న కుంచెలాగా ఉండే పదార్థాన్ని వేరుచేయ గలిగారు. లాటిన్‌లో పెన్సిలియమ్ అంటే చిన్న కుంచె అనే అర్థం ఉండడంతో దానికి 'పెన్సిలిన్' అని పేరు పెట్టారు. దాన్ని 1928లో కనిపెట్టగా, మరిన్ని పరిశోధనలు చేసి ఓ మందుగా మార్చి వాడుకలోకి తీసుకు రావడానికి 17 సంవత్సరాలు పట్టింది. దీంతో యాంటీ బయాటిక్ యుగానికి నాంది పలికినట్టయింది. ప్రచురించిన నివేదికలలో ఫ్లెమింగ్ ఇలా అంటారు: ఒకరు కొన్నిసార్లు తాను వెతకని దాన్ని కనుగొంటారు. నేను సెప్టెంబర్ 28, 1928 న తెల్లవారు జామున మేల్కొన్నప్పుడు, ప్రపంచంలోని మొట్టమొదటి యాంటీ బయాటిక్ లేదా బ్యాక్టీరియా కిల్లర్‌ను కనుగొనడం ద్వారా ఔషధం మొత్తాన్ని విప్లవాత్మకంగా మార్చాలని నేను ఖచ్చితంగా అనుకోలేదు. కానీ నేను సరిగ్గా అదే చేశానని అనుకుంటున్నాను. 1942 లో యునైటెడ్ స్టేట్స్‌లో స్ట్రెప్టోకోకల్ సెప్టిసిమియాకు మొదటి రోగికి విజయ వంతంగా చికిత్స అందించబడింది. రెండవ ప్రపంచ యుద్ధంలో సైనికుల మరణాలు మరియు విచ్ఛేదనం సంఖ్యను తగ్గించడానికి పెన్సిలిన్ సహాయ పడింది. రికార్డుల ప్రకారం, 1943 మొదటి ఐదు నెలల్లో 400 మిలియన్ యూనిట్ల పెన్సిలిన్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే సమయానికి, అమెరికా కంపెనీలు నెలకు 650 బిలియన్ యూనిట్లను తయారు చేస్తున్నాయి. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ స్కాటిష్ జీవశాస్త్రవేత్త, వైద్య రసాయన శాస్త్రవేత్త (ఫార్మకాలగిస్ట్) కాగా, ఆయన కనిపెట్టిన "ఎంజైము లైసోజైము(1923 ) , అంటి బయోటిక్ ' పెన్సిలిన్(1928 ) ' ముఖ్యమైనవి. 1945లో వైద్యశాస్త్రానికి నోబెల్ బహుమానం ఈ పెన్సిలిన్ కనుగొన్నందుకు ఫ్లెమింగ్ తో పాటు హెూవర్డ్ ఫ్లోరె, ఎర్నెస్ట్ చెయిన్ అనే మరో ఇద్దరు శాస్త్రవేత్తలకు కూడా ఇచ్చారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# ప్రజల శ్వాసగా మారిన శివారెడ్డి కవిత్వం:

## అభ్యుదయ, విప్లవ కవిత్వానికి చిరునామా కె. శివారెడ్డి - ఆగస్టు 6...కె. శివారెడ్డి జయంతి



తెలుగు సాహిత్యంలో అభ్యుదయ ఉద్యమాలకు కవితా హస్తం అందించిన మహెూన్నత కవుల్లో కె. శివారెడ్డి పేరును విశేష గౌరవంతో ఉటంకించాలి. సాంఘిక స్పృహతో కలగలసిన శబ్దాలు, అంతరంగానికి ఆలంబనగా మలచిన పదాలు, ప్రజల జీవితాలను ప్రతిబింబించే భావ వర్ణనలు ఆయన కవిత్వానికి మూల. స్థంభాలుగా నిలిచాయి. వచన కవిత్వానికి స్పష్టతను, సంభాషణాత్మకతను, ప్రజల అనుభవాలకు నైతిక వేదికను సమర్పించిన కవి శివారెడ్డి. 1943 ఆగస్టు 6న గుంటూరు జిల్లాలోని కార్మూరి వారిపాలెం అనే గ్రామంలో జన్మించిన శివారెడ్డి, తన బాల్యాన్ని గ్రామీణ జీవన సంస్కృతిలో గడిపారు. చిన్ననాటి నుంచే సామాజిక అసమానతల పట్ల చైతన్యం కలిగిన ఆయన, విద్యాభ్యాసాన్ని తెనాలి, విశాఖపట్నం ఆంధ్ర విశ్వ విద్యాలయాల్లో కొనసాగించారు. ఎం.ఏ. చేశారు. విద్యతో పాటు తాత్వికత, రాజకీయ స్పృహ, అభ్యుదయ తత్వాలను అవగాహన చేసుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహించిన శివారెడ్డి, విద్యార్థుల్లో విమర్శనాత్మక దృక్పథాన్ని కలిగించ గలిగిన అరుదైన ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారు. ఆయన కవితా ప్రస్థానం 1973లో వెలువడిన రక్తం సూర్యుడు తో ప్రారంభమైంది. ఈ సంపుటి ఆధునిక తెలుగు కవిత్వానికి కొత్త మలుపు ఇచ్చింది. ఆయన కవిత్వంలో భావోద్వేగం నినాదమై ప్రతిధ్వనిస్తుంది. సామాజిక వివక్షలు, శ్రమజీవుల కష్టాలు, పాలకుల నిర్వాకం, బాధిత జనగణాన్ని నిర్వచించే జీవితపు అస్థిత్వ సంగ్రామం %–% ఇవన్నీ ఆయన కవితల్లో నిశ్చల ధ్వనిగా నిలుస్తాయి. కె. శివారెడ్డి వచన కవిత్వాన్ని మార్గదర్శకంగా మలచినవారు. ఆయన రచనల్లో భావనకు, భావుకతకు మధ్య సమతుల్యత కనిపిస్తుంది. భాష నునుపుగా, కానీ లోతుగా ప్రవహిస్తుంది. రూపకాలతో కాకుండా వాస్తవ చీకటి వెలుగుల మధ్య ప్రయాణిస్తూ ప్రజల నిట్టూర్పులను తన పదాల్లో ఒదిగించి చరిత్రను మనోహరంగా మార్చగలిగిన సారస్వత శక్తి ఆయనది. ఆయన వచన శైలి తేలికైనదైనా, ఆలోచనల బరువు తీవ్రతగా నిలుస్తుంది. వ్యక్తిగత బాధను సామూహిక బాధగా భావించి, దానిని కవితా రూపంలో మలచిన చైతన్య వంతుడిగా ఆయన విలక్షణత కనిపిస్తుంది. తెలుగు కవిత్వాన్ని ప్రజల జీవితాలతో, శ్రమజీవుల పోరాటాలతో, విప్లవ స్ఫూర్తితో ముడిపెట్టిన కవులలో కె. శివారెడ్డి ప్రథమశ్రేణిలో నిలిచే పేరు. ఆయన కవిత్వం ప్రజల పక్షాన నిలబడిన ఓ గళం. అది అలసిన మనసులకు ధైర్యాన్ని, అణచివేతకు ఎదురు నిలిచే పునాదిని, విమర్శనాత్మక ఆలోచనకు ఆహ్వానాన్ని అందించిన శక్తివంతమైన అభివ్యక్తి. విప్లవ కవిత్వానికి ఆయన చేసిన సేవ సమకాలీన తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట అధ్యాయంగా నిలిచి ఉంది.అభ్యుదయ భావజాలంతో పాటు విప్లవ స్ఫూర్తి ఆయనకు పుట్టుకతో నేర్చిన లాంటి లక్షణం. నక్సలైట్ ఉద్యమాల, రైతాంగ పోరాటాల, శ్రమజీవుల నిత్య ఆవేదనలపై ఆయన కలం సంచలనంగా స్పందించింది. శివారెడ్డి కవిత్వం విప్లవాన్ని నినాదంగా కాకుండా %–% ఆవేదనగా, ఆత్మబంధంగా, ఆవిష్కరణగా ఆవిర్భవిస్తుంది. నక్సలైట్ ఉద్యమం, విప్లవ గర్జనలు, రైతాంగ సమస్యలు, కార్మికుల వేదన, పేదలపై పోలీసు అణచివేతలు, దళిత వర్గాలపై సామాజిక దాడులు %–% ఇవన్నీ ఆయన కలానికి అంశాలుగా మారాయి. కానీ, ఆయన కవిత్వం నినాదాలకే పరిమితంగా కాదు. అది ఒక ఆవేశం మాత్రమే కాక, ఓ ఆత్మావలోకన. అభ్యుదయ భావజాలంలో తాత్విక ఆలోచనల మెరుపులు ప్రతిఫలించే రచనలు ఆయనదే. అందుకే "విప్లవ భావనకు కవితా శబ్దం" అనే నిర్వచనానికి జీవంగా నిలుస్తారు. విప్లవ కవిత్వం అంటే కేవలం రాజకీయ భావజాలం మాత్రమే కాదు. భాష, శైలి, భావనల శక్తి కూడా విప్లవాత్మకంగా ఉండాలి. శివారెడ్డి భాష సాధారణ మానవుడు మాట్లాడే భాషే౦ కానీ ఆ భాష భావనలతో, బాధలతో, వాస్తవికతతో నిండి ఉంటుంది. శివారెడ్డి రచించిన ముఖ్య కవితా సంపుటులలో...రక్త రేఖలు, ఆసుపత్రి గీతం, నేత్ర ధనుస్సు, వర్షం వర్షం, జైత్రయాత్ర, శివారెడ్డి పీఠికలు వంటి అనేక సంపుటులు ప్రజల నిండైన జీవితం, ప్రజా భావనల అక్షర మధుర ధారగా నిలిచాయి. వచన కవిత్వానికి మౌనం ఒక నిశ్శబ్ద వ్యతిరేకతగా భావించిన కవి శివారెడ్డి. "మౌనం అనేది వ్యతిరేకతలో ఉన్న లోతైన నిరసన" అనే ఆయన మాటలు అతని కవితా శక్తికి అద్దం పడతాయి. మౌన భాష్యాలు వంటి సంపుటుల్లో ఇది స్పష్టంగా తెలుస్తుంది. భావోద్వేగాలను పదబంధాలుగా కాదు, భావరేఖలుగా విప్పి చూపగలిగిన రచనా శక్తి ఆయనది. కేవలం కవిత్వమే కాదు, విమర్శ రంగంలోనూ ఆయన పాత్ర కీలకం. సాహిత్య విమర్శా వ్యాసాలు, సమీక్షలు, సంపాదకత్వం, పాఠ్య గ్రంథాల రూపకల్పన వంటి అనేక క్షేత్రాల్లో కృషి చేశారు. అనేక యువ కవులకు మార్గనిర్దేశకులుగా నిలిచారు. శివారెడ్డి కవిత్వానికి పలు గౌరవాలు లభించాయి. ముఖ్యంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం (2013) ఆయన అజేయం కవితా సంపుటికి లభించింది. అదేవిధంగా తెలుగు యూనివర్సిటీ, ఇతర సాహిత్య సంస్థల నుంచి కూడా పురస్కారాలు అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. కె. శివారెడ్డి కవిత్వం అనేది కాలానికి ప్రతిఫలించిన ప్రజా మనోవేదన. అది ఒక సామూహిక స్పందన. కవి వ్యక్తిగా కనబడకుండా, సమాజపు ప్రతినిధిగా నిలిచిన రచయిత ఆయన. ఆయన కవిత్వం నేడు ఆలోచనలను రగిలించే ఒక స్ఫూర్తిదాయక శబ్దంగా మారింది. ప్రజల జీవితానికి అక్షర రూపమిచ్చిన ఈ వచన కవితా ప్రవాహం తెలుగువారి ఆత్మగర్వంగా నిలుస్తుంది. కవిత్వం అనేది మనిషి స్వరూపాన్నే ప్రశ్నించగలిగిన శక్తి అన్న నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం కె. శివారెడ్డి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్, జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ప్రజల గళంగా మారిన జీవిత సందేశం గద్దర్ - ఆగస్టు 6... గద్దర్ వర్ధంతి



గళం ఒక శబ్దం మాత్రమే కాదు. అది బాధను పలికించేది, నిరసనకు నినాదం ఇచ్చేది, ఆశయానికి అర్థం చెప్పేది. అలాంటి గొంతు గద్దర్‌ది. విప్లవ గేయాలకు ప్రాణం పోసినవాడు. గోళీల కంటే గొంతు మిన్న అన్న సత్యాన్ని నిరూపించిన వాడు. విప్లవాన్ని వేదికపైకి తెచ్చిన వాడు. వాణిని ఆయుధంగా మార్చుకున్న వాడు. అలాంటి వ్యక్తిత్వం గద్దర్‌ది. ఆయన కవిత్వం, పాట, ఉద్యమం, జీవితం అన్నీ ఒకే తాడుతో అల్లుకున్నవి. తెలుగు జాతికి ఆయన గొంతు ఒక నడకల పాట. విప్లవ జ్వాలను కమ్ముకున్న కంఠస్వ రాన్ని ప్రజలు గద్దర్ రూపంలో చూసారు. ఆయన్ను కేవలం ఓ గాయకుడిగా, ఓ కవిగా చూడటం తక్కువై పోతుంది. ఆయన జీవితం నిండా ప్రజల బతుకుపై ప్రేమ, శోషితుల పట్ల బాధ్యత, సమానత్వ పట్ల ఆశయ నిబద్ధత నిండి పోయినది. గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్ రావు. 1949 ఆగస్టు 17న హైదరాబాద్ సమీపంలోని మేడిపల్లిలో కార్మిక కుటుంబంలో జన్మించారు. తండ్రి వెంకటయ్య డాల్మిల్ కార్మికుడు, తల్లి శారదమ్మ నిరక్షరాసురాలు. బాల్యంలోనే అణచివేత, అసమానతలు, అత్యాచారాలను ప్రత్యక్షంగా చూశారు. ఈ అనుభవాలే ఆయనను సామాజిక చైతన్యపు మార్గంలో నడిపించాయి. తార్నాక ఐటీఐలో డిప్లొమా చేసిన తరువాత హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ లో కొంతకాలం ఉద్యోగం చేశారు. కానీ పేదల బతుకులపై నడిచే మార్గం వైపు ఆయనకు చిరునవ్వులు ఎక్కువ, చీకట్లపై ప్రశ్నలు ఎక్కువ. 1970లలో వామపక్ష భావజాలం ప్రభావితుడై, నక్సల్బరీ ఉద్యమానుసంధానంగా వెలసిన తెలంగాణ జ్ఞానవేదిక, ప్రజా నాటక ఉద్యమాల్లో ఆయన పాలుపంచు. కున్నారు. అనంతరం 'జననాట్య మండలి'లో చేరి ప్రజలలో చైతన్యం నింపే కళాకారుడిగా, ఉద్యమ స్ఫూర్తిని రగిలించే గాయకుడిగా మారారు. అదే సమయంలో "గద్దర్" అనే పేరిట పిలువ బడుతూ ప్రజల గుండెల్లో నిలిచారు. 'గద్దర్' అనే పేరు ఒక బంగ్లాదేశ్ యువ యోధుని జ్ఞాపకార్థంగా స్వీకరించారు. ఈ పేరు తరువాత ఆయన గళానికి, ఆయన పాటలకు, ఆయన పోరాట జీవనానికి ప్రతీకగా మారింది. ఆయన పాడిన పాటలు ప్రాచుర్యంలోకి రావడం కాదు౦ ప్రజల్లో ఉద్యమాత్మక చైతన్యాన్ని నింపడం ముఖ్యమైనది. "బండెనక బండి కట్టి", "పొద్దంతా పాడుతా నీ పేరంటో చెప్పు బాబోయ్", "ఇక్కడ ఖైదీ గదిలా ఊరు", వంటి గీతాలు సామాన్య ప్రజానీకంలో ఉద్యమాత్మక స్ఫూర్తిని నింపినవి. ఆయన గళం వినిపించిన చోట ప్రజలు గుమి కూడారు. ఆయన వేదిక ఎక్కితే ఆ వేదిక ఉద్యమ రంగ స్థలంగా మారేది.గద్దర్ జీవితంలో 1997 సంవత్సరం ఒక మైలురాయి. ఆ సంవత్సరం ఆయనపై నక్కి వేసిన గుళ్ల దాడిలో గుండెలోకి మూడు బుల్లెట్లు దూసుకొచ్చాయి. ఒకటి ఆయన శరీరంలో జీవితాంతం మిగిలి పోయింది. హింసను ఎదిరించిన ఆ గళాన్ని బుల్లెట్లు ఆపలేక పోయాయి. ఆ గాయంతో పాటే ప్రజల గుండెల్లో ఆయనకి స్థానం ఏర్పడింది. తన ప్రాణాల మీద జరిగిన దాడిని కూడా ప్రజల పక్షాన ఓ రాజకీయ ప్రకటనగా మలిచిన వాడు ఆయన. "గుండెపై బుల్లెట్లు పడ్డా, గళం ఆగదు" అని స్పష్టంగా ప్రకటించిన ధీశాలి ఆయన. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచి వచ్చినప్పుడు, ఆ ఉద్యమానికి శక్తి నిచ్చిన శబ్దం గద్దర్ గళమే. విభజన అనివార్యమని ప్రకటించి, ప్రాంతీయతను కాదు %–% ప్రజల ప్రయోజనాలను ప్రాతినిధ్యం వహించిన వ్యక్తి ఆయన. ఆయన పాటలు తెలంగాణ ఆకాంక్షకు ప్రాణం పోసినవే. ఉద్యమ కాలంలో జరిగిన అసంఖ్యాక సమావేశాల్లో, సదస్సుల్లో, ఊరేగింపుల్లో గద్దర్ పాటలు బలంగా ప్రతిధ్వనించాయి. ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను ఒక ఉద్యమ గీతంలా మార్చిన ఘనత ఆయనదే. 1998 లోకసభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన, తనను "జనజ్ఞాన వేదిక" అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. అది పార్టీ కోసం కాదు౦ ప్రజల ఆకాంక్షల్ని వేదికలపై నుంచి, సభల్లో నుంచి రాజ్యాంగ నిబంధనల వెలుగులోకి తీసుకురావాలన్న ప్రయత్నం. రాజకీయాల్లోకి అడుగుపెట్టినా ఆయన గళం మారలేదు. ఆయన ధోరణిలో మార్పు రాలేదు. ప్రజల పట్ల ఉన్న బాధ్యతకు రూపం చెరగ లేదు. గద్దర్ చివరికి మారినది మార్గమే అయినా, లక్ష్యానికి దూరంగా పయనించ లేదు. హింస, గుంపుల రాజకీయం, ఆయుధ మార్గం పట్ల విముఖత ప్రకటించారు. ప్రజాస్వామిక విలువలతో, మానవీయ నడకలతో కూడిన మార్గాన్నే ఆశ్రయించారు. ఈ దిశగా తన కుమారుడి వివాహాన్ని మతపరమైన సంప్రదాయాల నుంచి బయటికి తీసుకొచ్చి, ఒక ఉదారతకు నిదర్శనంగా మలిచారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ 2023 ఆగస్టు 6న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో తెలుగు నేల ఒక గొప్ప గొంతును కోల్పోయింది. ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం పొందిన ఒక యుగపురుషుడిని కోల్పోయింది. అయితే గద్దర్ జీవితం మౌనంగా ముగియలేదు. ఆయన పాటలు ఈ నేలపై ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. వృద్ధుల ఆశల లోనూ, యువత శ్వాసల లోనూ, అణగారిన వరాల ఆశయాల లోనూ, ఆయన గొంతు పదే పదే వినిపిస్తూనే ఉంటుంది. గద్దర్ అనగానే గుర్తుకొచ్చేది పాట కాదు, పోరాటం. గళం కాదు, గుండె ధైర్యం. వేదిక కాదు, విప్లవం. ఆయన జీవితం ఒక యాత్ర కాదు౦ ఒక యుగం. ఆయన లేరు గాని, ఆయన గళం సజీవంగా ఉంది. ఆయన పాట ఒక కాలపు శబ్దమాత్రం కాదు౦ ప్రజల కోసం ఆ శబ్దం శాశ్వతమైంది. జయహెూ గద్దర్! నీ గళం లేకపోయినా – నీ గాథ ప్రజల గుండెల్లో ఉండిపోతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్, జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

# 'సోషల్' విద్వేషం..

## మూడేళ్ల జైలు ఖాయం...

స్మార్ట్ ఫోన్ చేతికి వచ్చాక.. సోషల్ మీడియా పెరిగాక.. ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఏదో ఒక అంశంపై స్పందిస్తున్నారు. మరి కొందరు ఇంకా ముందుకెళ్లి విద్వేషాలు వ్యాపింపజేస్తున్నారు. అవతలివారు గిట్టకుంటే వారిపై తీవ్ర దుష్ప్రచారం చేస్తున్నారు. ఇక రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా అనేది పెద్ద ఆయుధంగా మారింది. ఇందు కోసం ఏకంగా ప్రత్యేక నియామకాలే చేపడుతూ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి అనే విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రోజురోజుకు పెరుగుతున్న విద్వేష పోస్టులకు అడ్డుకట్టేయాల్సింది ప్రభుత్వాలే. ఈ దిశగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. సోషల్ విద్వేష కట్టడికి కొత్త చట్టం తెస్తోంది. దీనిద్వారా సోషల్ మీడియాలో విద్వేషాలు వ్యాప్తి చేస్తే కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీనిపై జిల్లా అధికారులకు మరిన్ని అధికారులు ఇవ్వాలని కన్నడ ప్రభుత్వం భావిస్తోంది. సోషల్ మీడియాలో ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తే నాన్ బెయిలబుల్ కేసులతో పాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఈ చట్టాన్ని 'కర్ణాటక హేట్ స్పీచ్, హేట్ క్రైమ్స్ బిల్లు–2025' పేరుతో తెస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్ ఫాంలను నియంత్రించే అధికారం కలెక్టర్లకు ఇవ్వనున్నారు. ప్రధానంగా విద్వేష ప్రసంగాలు, పోస్టులకు బెయిల్ ఇవ్వకుండా కేసుల నమోదే ఈ బిల్లు ఉద్దేశం. ఇక సోషల్ మీడియా సంస్థలు, టెలికాం కంపెనీలు రెచ్చగొట్టే కంటెంట్ ప్రసారం చేస్తే 3 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశాలు ఉన్నాయి. విద్వేష ప్రసంగాలకు ఆర్థిక సాయం చేసినా.. ఇతర సాయం చేసినా వారూ దోషులే. ఇక మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో కలెక్టర్లు, మేజిస్ట్రేట్లు.. ర్యాలీలు, బహిరంగ సభలు, లౌడ్ స్పీకర్ల వినియోగాన్ని 30 రోజులు నిషేధించే అవకాశం కూడా కొత్త చట్టం ద్వారా రానుంది. పరిస్థితులను బట్టి దీన్ని మరో 30 రోజులు పొడిగించే వీలుంది. కాగా, ఈ చట్టంతో భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలగదని అధికారులు చెబుతున్నారు. ఎవరి అభిప్రాయాలు వారు చెప్పవచ్చని.. అది విద్వేషానికి దారి తీసేలా ఉండకూడదని స్పష్టం చేశారు. ఇక కొత్త చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడానికి అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటిని మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. కాగా, భారత దేశ టెక్ రాజధాని అయిన బెంగళూరు కర్ణాటక రాజధాని. లక్షల మంది ఐటీ నిపుణులు పనిచేసే ఈ రాష్ట్రంలో టెక్నాలజీ కూడా బాగా వినియోగంలో ఉంటుంది. గత బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ కూడా సోషల్ మీడియా ద్వారానే పెద్ద ఉద్యమం నడిపింది.

# "యాచక దశ నుండి తెలంగాణ శాసక దశకు రావాలి"

## ఆగస్టు 6... ప్రొఫెసర్ జయశంకర్ జయంతి – "కొత్తపల్లి జయశంకర్ యాదిలో జీవిత విశేషాలు"



తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ (ఆగస్టు 6, 1934– జూన్ 21, 2011) వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామ శివారు అక్కంపేటలో జన్మించారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్ డీ పట్టా పొంది, ప్రిన్సిపాల్ గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్– ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పేవారు. జయశంకర్ 2011, జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు. 1934, ఆగస్టు 6న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట లో జయశంకర్ జన్మించారు. తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత రావు. ఆయనకు ముగ్గురు అన్న దమ్ములు, ముగ్గురు అక్క చెల్లెళ్లు. జయశంకర్ తల్లిదండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించుకోకుండా, తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి, ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలి పోయారు. బెనారస్, అలీగఢ్ విశ్వ విద్యాలయాల నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్ డీ చేశారు. 1975 నుంచి 1979 వరకు వరంగల్ లోని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేశారు. 1979 నుంచి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్ 1991 నుంచి 1994 వరకు ఆదే యూనివర్శిటీకి ఉప కులపతిగా పని చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1952 లో జయశంకర్ నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకునిగా 1954 లో ఫజల్ అలీ కమిషన్ కు నివేదిక ఇచ్చారు. కె.సి.ఆర్ కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాశారు. తెలంగాణ లోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశారు. జయశంకర్ తన ఆ ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారు. "అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్నా బెర్ మర్ధనా" (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి. తర్వాత మరణించాలి అని అనేవారు. తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా విదేశాల్లో సైతం వ్యాప్తి చేయడంలో ఆయన పాత్ర మరవ లేనిది. ఆచార్య జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారు. 1952 నాన్ ముల్కీ, ఉద్యమం లోకి ఉరికి ఆనాటి నుంచి సమరశీల పాత్రను పోషించాడు. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన అపర మేధావి కొత్తపల్లి జయశంకర్. అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి, ఆచరించిన మహనీయులు. తెలంగాణ డిమాండ్ ను 1969 నుంచి నిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసిన మేధావి ఆయన. తెలంగాణ లోని ప్రతీపల్లె ఆయన మాటతో పోరాట గళాన్ని అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద , విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినింపించిన పోరాట యోధులు. "మా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసక దశకు తెలంగాణ రావాలి! మా తెలంగాణ మాగ్గావాలి..!! యాభై ఏళ్లుగా ఇదే ఆకాంక్ష.. ఇదే శ్వాస.. ఇదే లక్ష్యం... ఇదే జీవితం.. ఇందులోనే మరణం!'' అని ఉద్యమాన్ని శ్వాసించిన మహోపాధ్యాయుడు ప్రొఫెసర్ కొత్త పల్లి జయశంకర్, రెండేళ్లు గొంతు క్యాన్సర్ తో బాధపడ్డారు. మీరు చేయాల్సింది మీరు చేశారు. ఈ సమయంలో నేను ఇక్కడ ఇక ఉండలేను. నేను వరంగల్ కు పోతాను. నన్ను పంపండి' అంటూ ఆయన పుట్టిన గడ్డమీద మమకారంతో వరంగల్ వచ్చారు. ఇంట్లోనే వైద్యులు ఆయనకు అన్నిరకాల వైద్యసేవలు అందించారు. 2011 జూన్ 6 మంగళవారం రోజున తెల్లవారు జాము నుంచి ఆయన పల్స్ రేట్ పడిపోవడంతో ఆక్సిజన్ అందించారు. చివరకు అదేరోజు ఉదయం 11.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాలకు ప్రిన్సిపల్ గా పనిచేశారు. సీకేఎం కళాశాల అంటేనే, జిల్లాలో "విప్లవ విద్యార్థి ఉద్యమానికి" కేంద్రంగా అప్పట్లో పేరుండేంది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమర్జెన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి, ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తు పెట్టుకోవడం సర్వసాధారణమే కానీ, ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని, పేరు పెట్టి పిలవడం, ఒక్క జయశంకర్ సార్ కు సాధ్యం అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రముఖ సాహితివేత్త రామశాస్త్రి చెప్పేవారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశ విదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, ప్రొఫెసర్ కే. సీతా రామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలంగాణ ఏర్పాటులో సుష్మా కీలక పాత్ర

## సుష్మా స్వరాజ్ మద్దతు తోనే తెలంగాణ బిల్లు ఆమోదం - ఆగస్టు 6... సుష్మా స్వరాజ్ వర్ధంతి



తెలంగాణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడంలో సుష్మా స్వరాజ్ కీలకపాత్ర పోషించారు. [illegible] 2014 ఫిబ్రవరి 18న

తేదీ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన రోజు. తెలంగాణ బిల్లుకు సభలో మూడింట రెండొంతుల మెజార్టీ కావాలి. దీనికి ఓటింగ్ కూడా జరపాల్సి ఉంటుంది. దీంతో సెక్రటరీ జనరల్ నిబంధనలు వివరిస్తూ.. సభకు నిరాటంకంగా అంతరాయాలు కలుగుతున్నప్పుడు, అధికార, ప్రతిపక్ష పార్టీలు అంగీకరిస్తే హెడ్ కౌంట్ (ఎంపీలను నిలబెట్టి, లెక్కించడం) సరిపోతుందని చెప్పారు. దీంతో సుష్మా స్వరాజ్ నిర్ణయం కీలకమైంది. ఆమె అంగీకరిస్తేనే స్పీకర్ మీరాకుమార్ ఈ పద్ధతికి ఒప్పుకునేలా కనిపించారు. సుష్మా స్వరాజ్ దానికి అంగీకరించారు. 'మీరు బిల్లు పెట్టండి. నేను లేచి నిలబడి మాట్లాడతాను. తర్వాత హోం మంత్రిని ఒక్కొక్క క్లాజు చదువుకుంటూ వెళ్లమనండి. అలాగే ఓటింగ్ కూడా పెట్టండి' అని సూచించారు. దీనికి అంతా అంగీకరించారు. లోక్‌సభలో తెలంగాణ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకురాలి హోదాలో సుష్మా స్వరాజ్ ప్రసంగించగా, కాంగ్రెస్ పార్టీ తరపున జైపాల్ రెడ్డి ప్రసంగించారు. బిల్లును ప్రవేశపెట్టిన హోం మంత్రి సుశీల్ కుమార్ షిండేతో కలిపి చర్చలో ప్రసంగించింది మొత్తం ముగ్గురు మాత్రమే. ఈ సందర్భంగా ఆ నాడు తెలంగాణ బిల్లపై సుష్మా స్వరాజ్ ప్రసంగం ఇలా ఉంది.. "ధన్యవాదాలు అధ్యక్ష జీ. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ బిల్లును ఆమోదం కోసం ఇప్పుడే హోం మంత్రి ప్రవేశపెట్టారు. మా పార్టీ తరపు నుంచి ఆ బిల్లుకు మద్దతు ఇచ్చేందుకు నేను నిలబడ్డాను. ఈ బిల్లుకు మేం మద్దతు ఇవ్వటమే కాదు. ఇది పాసయ్యేలా ఓట్లు కూడా వేస్తాం. ఎందుకంటే ఇది మా విశ్వసనీయతతో ముడిపడిన విషయం. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటుకు బిల్లును తీసుకొస్తే, బీజేపీ మద్దతు ఇచ్చి దాన్ని ఆమోదించేలా చేస్తుందని పార్లమెంటు బయట, పార్లమెంటు లోపల, తెలంగాణలోను, తెలంగాణ వెలుపల కూడా మేం ఎన్నోసార్లు డిమాండ్ చేశాం. అంతే కాదు, ఒకవేళ కేంద్ర ప్రభుత్వం కనుక బిల్లును తీసుకురాకపోతే, మా ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో తెలంగాణను ఏర్పాటు చేస్తాం అని కూడా హామీ ఇచ్చాం. అధ్యక్ష జీ.. మీరే సాక్షి. మీరు ఇదే స్థానంలో కూర్చున్నారు. నేను ఇక్కడి నుంచే మాట్లాడాను. తెలంగాణ కోసం ఆత్మాహుతి చేసుకుంటున్న పిల్లలకు విజ్ఞప్తి చేస్తూ తెలుగులో చెప్పాను. 'తెలంగాణ కోసం బలిదానం వద్దు. తెలంగాణ చూడటానికి బతకాలి. బతకాలి' అని. ఇప్పుడు ఈ బిల్లు వారి స్వప్నాలను సాకారం చేసేందుకు వచ్చింది. ఇప్పుడు దీన్ని వ్యతిరేకించి ఆ పిల్లల పట్ల విశ్వాస ఘాతుకానికి ఎలా పాల్పడతాం? కాబట్టే, మొత్తం విపక్షాలన్నీ వ్యతిరేకిస్తున్నప్పటికీ మేం నిలబడి ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. ఎందుకంటే తెలంగాణ ఏర్పడాలన్న ఆ పిల్లల స్వప్నం నిజం కావాలని. నేను కొన్ని విషయాలను రికార్డుల్లోకి తీసుకు రావాలను కుంటున్నాను. నా తొలి ఫిర్యాదు కాంగ్రెస్ అధిష్టానంపైన. సోనియా జీ నావైపు చూడటం లేదు. కానీ, ఆమె సభలోనే ఉన్నారు. నా తొలి ఫిర్యాదు మీమీదే సోనియా జీ. తెలంగాణ ఇస్తామని 2004లో మీరు వాగ్దానం చేశారు. 2014 వచ్చింది. మీ ప్రభుత్వం తొలి దఫా (2004–2009)లో ఏమీ చేయలేదు. రెండో దఫా (2009–2014)లో సైతం, 15వ లోక్‌సభ చివరి సమావేశం, చివరి వారంలో మీరు బిల్లును తీసుకొచ్చారు. 21వ తేదీన సమావేశాలు ముగుస్తాయి. ఈరోజు 18. కేవలం మూడు [illegible] మిగిలి ఉన్నాయి. మీరు విషయాన్ని లాగుతూ లాగుతూ ఇక్కడి దాకా తీసుకొచ్చారు. ఎలా తీసుకొచ్చారంటే.. మీ పార్టీ వాళు కూడా దీన్ని అంగీకరించట్లేదు. మీరు మీ పార్టీ వాళ్లనే ఒప్పించలేక పోయారు, మీరు మీ మంత్రులనే ఒప్పించలేక పోయారు, మీరు మీ ముఖ్యమంత్రిని కూడా ఒప్పించలేక పోయారు. అధ్యక్ష జీ, ఏ సభా ఇలాంటి దృశ్యం చూసి ఉండదు. ప్రధానమంత్రి సభలో కూర్చుని ఉన్నారు. ఆయన మంత్రిమండలి లోని సభ్యుడు వెల్‌లో నిలబడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సభలో కూర్చుని ఉన్నారు. అయినా ఫర్వాలేదంటూ ఆ పార్టీ సభ్యులు వెల్‌లోకి వచ్చి నిలబడ్డారు. ఆ పార్టీ ముఖ్యమంత్రి ధర్నాలో కూర్చున్నారు. ప్రధానమంత్రి క్యాబినెట్‌లో బిల్లును ఆమోదిస్తే.. వాళ్ల ముఖ్యమంత్రి దాన్ని వ్యతిరేకించి వెనక్కి పంపించారు. ఇలాంటి దృశ్యాలను ఈ సభలో చూస్తున్నాం. అధ్యక్ష జీ మేం కూడా మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేశాం. అద్వాణీ ఇప్పుడు సభలో లేరు. కానీ, అప్పుడు ఆయన హోం శాఖ మంత్రి. ఆయన హయాంలోనే మూడు రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. ఒక్క రక్తపు చుక్క కూడా చిందలేదు. ఒక్క క్షణం కూడా సభలో అశాంతి లేదు. పూర్తి శాంతి, ఉత్సాహాలతో మూడు రాష్ట్రాల ఏర్పాటు జరిగింది. మూడు రాష్ట్రాలూ ఇప్పుడు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. ఇప్పుడు పార్టీలన్నీ విడిపోయాయి, సీమాంధ్ర, తెలంగాణ నాయకులు ఒకచోట కూర్చోవడం లేదు, నామా నాగేశ్వరరావు ఉన్నారు. ఆయన్ను నేను శాండ్ విచ్ అంటుంటాను. తెలంగాణ ప్రజలతో కలసి వస్తుంటారు. తెలంగాణను వ్యతిరేకించే వారితో కూడా కలసి వస్తుంటారు. కాంగ్రెస్ పార్టీది కూడా ఇదే పరిస్థితి. జగన్ పార్టీ పరిస్థితి కూడా ఇదే. అన్ని పార్టీలూ విడిపోయాయి." "నేను గర్వంగా చెప్పగలను.. ఇప్పుడు కూడా బీజేపీ సీమాంధ్ర, తెలంగాణ నాయకులు మాత్రం కలసికట్టుగా కూర్చుని, సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు. బీజేపీ సీమాంధ్ర నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు.. తెలంగాణ ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ కూడా తెలంగాణకే చెందాలి. కానీ, మాకు కూడా న్యాయం చేయండి' అని. న్యాయం కోసం వాళ్లు ఏం కోరుకుంటున్నారు? హైదరాబాద్‌లో రూ.1500 కోట్ల మిగులు ఆదాయం ఉంటే దాంతో తెలంగాణకు మేలు జరుగుతుంది. మరి కోస్తాంధ్ర, రాయలసీమకు జరిగే నష్టాన్ని ఎవరు పూడ్చుతారు? దాన్ని కేంద్ర ప్రభుత్వమే పూడ్చాలి. హోం మంత్రి హామీతో ఇది నెరవేరదు. నిధులు ఇచ్చే ఏర్పాటు చేయండి. వారి నష్టాన్ని పూడ్చే మాట చెప్పండి. మరోమాట వారు చెబుతున్నారు. హైదరాబాద్‌లో 148 సంస్థలు ఉన్నాయి, పదేళ్లపాటు అది సంయుక్త రాజధాని. కానీ, సీమాంధ్రలో ఏర్పాటు కావాల్సిన సంస్థలకు సూత్రప్రాయంగా ప్రణాళికా సంఘం నుంచి అనుమతి ఇవ్వండి. వాటికి టోకెన్ అమౌంట్‌గా కొంత నిధులు ఇవ్వండి. మధ్యంతర బడ్జెట్ రూపంలో వాటిని నిధులు సమకూర్చండి. వారు చెబుతున్న మూడో మాట.. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అంటున్నారు. దానికోసం మండలాల బదిలీ జరగాల్సి ఉంది. దీనిపై వెంకయ్య నాయుడు సమక్షంలో వారి మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు జైరామ్ రమేశ్ లేఖ మా వద్ద ఉంది. కానీ, దీన్ని క్యాబినెట్‌లో మార్చేశారు. ఒప్పందం ప్రకారం వాటిని బదిలీ చేయండి. అందుకే అధ్యక్ష జీ.. తెలంగాణ ఏర్పాటు కావాలి. హైదరాబాద్ కూడా తెలంగాణలోనే ఉండాలి. అయితే, సీమాంధ్ర వారికి కూడా న్యాయం జరగాలి. అందుకే ఇవన్నీ బిల్లులో ఉండాలి. ఇది నా కోరిక. ఈ బిల్లులో గవర్నర్‌కు అధికారాలను కట్టబెట్టారు. ఇలాంటి శక్తులు ఇవ్వాలంటే రాజ్యాంగాన్ని మార్చాల్సి ఉంటుంది. సాధారణ బిల్లుతో పాటు రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీసుకొస్తే మేం మద్దతు ఇస్తామని ప్రభుత్వానికి చెప్పాం. లోపాల బిల్లు తీసుకురావొద్దు.. అసలైన బిల్లు తీసుకురండి అని చెప్పాం. ఈ బిల్లు ఆమోదం పొందగానే బయటకు వెళ్లి పాటలు పాడతారు. "కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది. సోనియా అమ్మ తెలంగాణ ఇచ్చింది" అంటారు. సోనియా అమ్మను గుర్తుంచుకుంటే.. ఈ చిన్నమ్మను కూడా గుర్తుంచుకోండి. తెలంగాణకు మద్దతు ఇస్తామని మా పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు కాబట్టి, జన చేతన యాత్రలో మా సీనియర్ నాయకుడు అద్వాణీ మాట ఇచ్చారు. కాబట్టి మేం ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. మా విశ్వసనీయత కోసం మద్దతు ఇస్తున్నాం. ఏ రాజకీయ పార్టీకైనా, నాయకుడికైనా విశ్వసనీయతే ముఖ్యం. మనం ఏదైనా చెబితే ఎదుటివాళ్లు దానిపై నమ్మకం ఉంచాలి. అందుకే మేం ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. హోం మంత్రి సమాధానం ఇచ్చేప్పుడు సీమాంధ్రకు న్యాయం చేయాలని నేను చెప్పినవన్నీ ఈ బిల్లులో పెట్టాలని నేను కోరుతున్నాను. అలా సీమాంధ్రులు కూడా సంతోషిస్తారు. ఒకవేళ అలా చేయకుంటే.. రాబోయే ప్రభుత్వం మాదే. మేం న్యాయం చేస్తాం అని నేను ఇక్కడ నిలబడి చెబుతున్నాను. సీమాంధ్రవాళ్లూ.. బాధపడకండి. మీ భద్రతకు మాది పూచీ. ఈ హామీ ఇస్తూ నేను ఈ బిల్లుకు మద్దతు పలుకుతున్నాను. ఈ బిల్లు ఆమోదానికి మద్దతు తెలుపుతున్నాను. ధన్యవాదాలు." బిల్లు ఆమోదం పొందిన తర్వాత పార్లమెంటు భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుష్మా స్వరాజ్ మాట్లాడుతూ, ''బిల్లును సభలో పెట్టాలి. కానీ, అది ఆమోదం పొందకూడదు. దీనికి కారణం బీజేపీనే అని నిందించాలి. బిల్లు పెట్టడం ద్వారా తెలంగాణ వారిని, దాన్ని ఆమోదించకుండా సీమాంధ్ర వారిని సంతృప్తిపర్చాలి'. ఇదే కాంగ్రెస్ ప్లాన్. ఇది మాకు స్పష్టంగా అర్థమయ్యింది. దీంతో సభలో ఆందోళనలు జరుగుతున్నా సరే మేం బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. అందుకే మేం మా వైఖరిని మార్చుకున్నాం. బిల్లుకు మద్దతు ఇచ్చాం' అని చెప్పారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# మిస్టర్ ఆసియా బిరుదు పొందిన తొలి తెలుగు వాడు దండమూడి - ఆగస్టు6...దండమూడి రాజగోపాలరావు వర్ధంతి



దండమూడి రాజగోపాలరావు (అక్టోబరు 16, 1916 – ఆగస్టు 6, 1981) భారత దేశ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు. అసమాన బలశాలి, అసాధారణ శక్తి సంపన్నుడు. వెయిట్ లిఫ్టింగ్‌లో ఆయన 'ఆంధ్రభీమ, ఇండియన్ టార్జాన్', ఇండియన్ హెర్క్యులస్, జాయింట్ ఆఫ్ ఇండియన్ బిరుదులను పొందారు. శరీర సౌష్టవ పోటీలో మిస్టర్ ఆసియా బిరుదును పొందిన తొలి ఆంధ్రుడే కాక తొలి భారతీయుడు. కృష్ణా జిల్లా ఉయ్యూరు సమీపంలోని గండిగుంటలో 1916 అక్టోబర్ 14న రైతు కుటుంబంలో జన్మించిన ఆయన కోడి రామ్మూర్తి నాయుని స్ఫూర్తితో బరువులు ఎత్తడంపై ఆసక్తి కలిగి, పెదపారుపూడి మండలం వాన పాములలో వెయిట్‌లిఫ్టింగ్ సాధన ప్రారంభించారు. 1938లో తొలిసారిగా పోటీల్లో పాల్గొని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ 1940లో మొదటిసారిగా రాష్ట్రస్థాయిలో చాంపియన్‌గా గెలుపొందారు. 1943 లండన్ ఒలింపిక్స్ ఆదిగా ... మూడు పర్యాయాలు దేశం పక్షాన విశ్వ క్రీడలకు ప్రాతినిధ్యం వహించారు. 1945లో జాతీయ స్థాయిలో 320 పౌండ్ల బరువు ఎత్తి విజేతగా నిలిచారు. 1948లో కోల్‌కతా వేదికగా జరిగిన ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని... 'మిస్టర్ ఆసియా'గా గుర్తింపు పొందిన తొలి భారతీయుడు, అదీ తెలుగు వారు కావడం విశేషం. అలా 1948లో జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో పాల్గొన్న తొలి ఆంధ్రుడుగా నిలిచారు. 1945 నుంచి 1958 వరకు 13 ఏళ్లపాటు జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌గా గెలుపొందుతూ వచ్చారు. ఆయన 1951లో ఢిల్లీలో జరిగిన ప్రథమ ఆసియా క్రీడోత్సవాలలో వెయిట్ లిఫ్టింగ్ పురుషుల సూపర్ హెవీ వెయిట్ (ం105 కేజీలు) వర్గములో కాంస్య పతకాన్ని గెలుచు కున్నారు. రాజగోపాలరావు అనేక రాష్ట్రాలు, దేశాలలో ప్రదర్శనలిచ్చారు. తెలుగు రంగస్థల, సినిమా నటుడుగా 1963లో విడుదలైన నర్తనశాల సినిమాలోనూ, 1965లో విడుదలైన వీరాభిమన్యు సినిమాలోనూ, భీముని పాత్ర సమర్థ వంతంగా పోషించారు. రాష్ట్ర ఒలింపిక్ సంఘం వ్యవస్థాపకుడిగా, వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌కు చాలా ఏళ్లపాటు ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. విజయవాడలో సొంతంగా వ్యాయామశాల నెలకొల్పారు. రాష్ట్ర వ్యాప్తంగా జిమ్‌ల ఏర్పాటుకు కృషి చేశారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులో స్థలం విరాళంగా ఇచ్చి... ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కారకులయ్యారు. ఆయన పేరు మీద ఉన్న ఇండోర్ క్రీడా ప్రాంగణానికి "దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియం" అని నామకరణం చేశారు. దాన్ని నాట రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య ప్రారంభించారు. రాజగోపాలరావు 1981, ఆగస్టు 6న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# కోతలు కాదు.. కొలతలు పెరగాలి..!

కొత్తగూడెం: పరిహార అటవీకరణ నిధి నిర్వహణ, ప్రణాళిక ప్రాధికార సంస్థ(కాంపా) నిధులతో చేపడుతున్న పనులు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మిశ్రమ ఫలితాలు ఇస్తున్నాయి. ఒకవైపు అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తుంటే.. మరోవైపు విచ్చలవిడిగా పోడు చేయటంతో లక్ష్యం నీరుగారుతున్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అభివృద్ధి ప్రాజెక్టులు, ఆక్రమణల వల్ల హరించుకుపోతున్న అటవీ భూములకు పరిహారంగా ఉభయ జిల్లాల్లో చేపడుతున్న అటవీకరణ యత్నాలు క్రమంగా పురోగతి సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**క్రమేణా తగ్గుతున్న అటవీ విస్తీర్ణం**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అడవుల విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పారిశ్రామిక ప్రాంతాలు విస్తరించటంతో పాటు పోడు సమస్య అటవీ విస్తీర్ణంపై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2021-23 మధ్యకాలంలో అటవీ విస్తీర్ణం తగ్గిన జిల్లాల జాబితాలో ఆదిలాబాద్(-115.50 చ.కి.మీ) తర్వాత భద్రాద్రి జిల్లా(-95.55 చ.కి.మీ) రెండోస్థానంలో నిలవగా.. ఖమ్మం (-25.76 చ.కి.మీ) ఏడో స్థానంలో ఉంది.

**అరకొరగా కేటాయింపులు..**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు కాంపా నిధుల కేటాయింపుల్లో కోతలే అధికంగా ఉంటున్నాయి. భద్రాద్రి జిల్లా అటవీ అధికారులు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.100.57కోట్లతో ప్రతిపాదనలు పంపిస్తే.. రూ.30.62కోట్లు మంజూరయ్యాయి. ఖమ్మం జిల్లాకు రూ.8.46కోట్లు



కేటాయించగా.. గత మార్చి నాటికి రూ.3.71కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి భద్రాద్రికి రూ.30.47కోట్లు, ఖమ్మం జిల్లాకు 7.73కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు డీఎఫ్ఓలు కిష్టాగౌడ్, సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ 'ఈనాడు'కు తెలిపారు. ఈ ఏడాది నిధుల కేటాయింపు ఏ విధంగా ఉంటుందనేది వచ్చే నెలలో తేలనుంది.

**అడవుల పెంపకంపై ప్రత్యేక దృష్టి**

గతంలో మంజూరైన కాంపా నిధులతో సోలార్ పంప్‌సెట్లు, నీటికుంటలు, సిబ్బందికి క్వార్టర్ల నిర్మాణంతో పాటు బేస్‌క్యాంపు సిబ్బందికి జీతభత్యాలు చెల్లించేవారు. ఈఏడాది కేటాయించే నిధులతో కేవలం ప్లాంటేషన్ల పెంపకం, ఫెన్సింగ్ వంటివి మాత్రమే చేపట్టేలా మార్గదర్శకాలు వెలువడినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. సింగరేణి గనులు, రహదారుల నిర్మాణం, ఇతరత్రా అభివృద్ధి పనుల కోసం ఏమేరకు అటవీ విస్తీర్ణం కోల్పోతే అంతే మొత్తం అడవులను పెంచేలా చర్యలు తీసుకోనున్నారు. నర్సరీలు, ప్లాంటేషన్ల పెంపకంపై జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో పకడ్బందీ పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ ఏడాది కాంపా నిధుల కేటాయింపుల్లో నూతన విధానం అమలు చేస్తున్నారు. గతంలో ఆఫ్‌లైన్‌లో ప్రతిపాదనలు స్వీకరించగా.. ఈసారి ఆన్‌లైన్ ద్వారా ప్రక్రియ చేపట్టారు. ఏటా జూన్-జులైలో నిధులు విడుదలయ్యేవి. ఈసారి ఆలస్యమవుతోంది. ఈఏడాది నర్సరీలు, ప్లాంటేషన్లు పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించనున్నాం. సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీఓ, ఖమ్మం

# బలిపీఠంపై బాల్యం

ఖమ్మం: ఆడుతూ.. పాడుతూ.. చదువుతూ గడపాల్సిన బాల్యం మూడు ముళ్లకు బందీ అవుతోంది. లోకం పోకడ తెలియకముందే పుత్తడి బొమ్మలకు వివాహాలు చేస్తుండటంతో చిన్న వయస్సులోనే తల్లులై మానసికంగా, శారీరకంగా కుంగిపోతున్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నా.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో బాల్యవివాహాలు కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని అడ్డుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది.

అడ్డుకుంటున్నారిలా..బాలబాలికల సంరక్షణకు మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో గ్రామ, మండల, జిల్లా స్థాయి బాలల సంరక్షణ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఛైల్డ్‌లైన్ నంబర్(1098)కు వస్తున్న ఫోన్‌కాల్స్ ద్వారా బాల్యవివాహాలను ఆపుతున్నారు. గతేడాది ఉభయ జిల్లాల్లో 116 (ఖమ్మంలో 66, భద్రాద్రిలో 50) బాల్యవివాహాలను అడ్డుకున్నారు. పదేళ్లలో ఖమ్మం జిల్లాలో 438 మంది, భద్రాద్రి జిల్లాలో 229 మంది చిన్నారి పెళ్లికూతుళ్లు బలిపీఠం ఎక్కకుండా ఆపారు. చిన్నారి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో శారీరక మార్పులు, ఆన్‌లైన్, లైంగిక వేధింపులు, పిల్లల అక్రమ రవాణా, బాల్యవివాహాల అనర్థాలు, మంచి-చెడు స్పర్శ, మాదకద్రవ్యాల ప్రభావంపై అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలల్లో డ్రాపవుట్ అవుతున్న, ఎక్కువ రోజులు గైర్హాజరైన బాలికలను గుర్తించి ఆరా తీస్తున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

**ఖమ్మం జిల్లాలో..**2021లో 28, 2022లో 90, 2023లో 36, 2024లో 66, 2025లో జూన్ వరకు 39 బాల్యవివాహాలను అడ్డుకున్నారు. నిరక్షరాస్యత, ఆర్థికంగా వెనుకబాటు, కుటుంబ సమస్యలు, పేద కుటుంబాల్లో పిల్లల పోషణ భారమవటం, జీవనోపాధికి తల్లిదండ్రులు పట్టణాలకు వలసవెళ్లడం, పెళ్లి చేస్తే బాధ్యత తీరుతుందని భావించటం, ఉన్నత చదువులు చదివించే స్తోమత, ఆసక్తి లేకపోవటం, ఒంటరి తల్లి లేదా తండ్రి కుటుంబాల్లో ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు తదితరాలతో బాల్యవివాహాలు జరుగుతున్నట్లు గుర్తించారు.

**పటిష్ఠ కార్యాచరణ** ప్రయోగాత్మకంగా ఖమ్మం, భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల్లో పదేసి గ్రామాల చొప్పున ఎంపికచేసి బాల్యవివాహ రహిత గ్రామాలుగా మార్చాలని సర్కారు నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలో 2022 నుంచి ఈఏడాది జూన్ వరకు తరచూ బాల్యవివాహాలు జరుగుతున్న గ్రామాలను అధికారులు గుర్తించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు జన్నారం(ఏన్కూరు మండలం)లో 4, ఖమ్మం అర్బన్‌లో 22, సింగరేణి బీసీకాలనీలో 3, శంకిగిరితండా(నేలకొండపల్లి)లో 4, మధిరలో 3, మాటూరు(మధిర)లో 3 వివాహాలను అడ్డుకున్నారు. మరో నాలుగు గ్రామాల్లో తరచూ బాల్యవివాహాలు జరుగుతున్నట్లు ఫోన్లు రావటంతో నిలిపేశారు.

# నడవనివ్వని కాళ్లు.. కాలుతున్న ఒళ్లు..!



నల్గొండ : జిల్లాలో వర్షాలు అనుకున్న స్థాయిలో కురువకపోయినా.. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది ప్రాంతం కాలువలు, కుంటలు నిండటంతో పాటు దోమలు విపరీతంగా స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకే రోడ్లు, కాలువలు చిత్తడిగా మారుతున్నాయి. జిల్లా అంతటా సీజనల్ వ్యాధులు గుప్పుమంటున్నాయి. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రితో పాటు ఏరియా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జనరల్ ఆసుపత్రిలో సాధారణంగా రోజుకు 550 నుంచి 650 వరకు ఉండే ఓపీ నాలుగు రోజుల నుంచి 800కి చేరింది. ఐపీ రోగులు 600 మందికి పైగా ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండని కారణంగా ప్రైవేట్ బాట పడుతున్నారు. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా, చందంపేట, డిండి, మల్లేపల్లి, దామరచర్ల ప్రాంతాల నుంచి జ్వర పీడితులు ఆసుపత్రులో ఎక్కువగా చేరుతున్నారు.

చిట్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానంగా ఒళ్లు, గొంతునొప్పులు, జలుబు, దగ్గు, సాధారణ జ్వరాలకు సంబంధించిన పేషెంట్లు ఎక్కువగా వస్తున్నారని వైద్యుడు సత్యనరేష్ పేర్కొన్నారు. అవసరమైన ఔషధాలు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వనిపాకలలో డెంగీ కేసును గుర్తించారు.

నకిరేకల్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు వస్తున్న రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నిత్యం 280 నుంచి 300 మంది వరకు బయటి రోగులు వస్తున్నారు. మండలంలోని ఓగోడు పీహెచ్‌సీ, గ్రామాల్లో ఉన్న 11 ఉపకేంద్రాల్లో జూన్‌లో 7,177, జులైలో ఇప్పటి వరకు 6,892 మంది ఓపీ సేవలు పొందారు. జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులు, కాళ్లు, కీళ్ల నొప్పులు, అతిసారంతో బాధపడుతున్న వారే అధికంగా ఉంటున్నారని వైద్యులు వివరించారు. నకిరేకల్ ప్రాంతీయ వైద్యశాల, పీహెచ్‌సీ, ఉప కేంద్రాలల్లో మే, జూన్ మాసాలతోపాటు జులైలో మంగళవారం వరకు మొత్తం 42,962 మంది పలు అనారోగ్య సమస్యలతో ఓపీ చికిత్సలు పొందినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

**రెండు రకాలు బయట తీసుకున్నా**

నర్సమ్మ, బొట్టుగూడ

జ్వరంతో పాటు ఒళ్లు నొప్పుల కారణంతో జనరల్ ఆసుపత్రికి వచ్చాను. వైద్యులు పరీక్షించి ఐదు రకాల మాత్రలు, ఇంజక్షన్లు రాశారు. ఇందులో రెండు రకాలు బయటే కొనుగోలు చేశాను. జనరల్ ఆసుపత్రిలో వార్డుల మార్పు వల్ల వైద్యులు ఎక్కడ ఉన్నారో తెలియక ఇబ్బంది పడుతున్నాం.

అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాం

డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి

సీజన్ వ్యాధులకు సంబంధించిన అన్నిరకాల మాత్రలు, ఇంజక్షన్లు, ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు.

# అమ్మృతం..!



చౌటుప్పల్ : తల్లి పాలు శిశువులకు సంజీవని లాంటివి..జన్మించిన గంటలోపు శిశువులకు తల్లిపాలు తాగించడం ప్రారంభించి.. ఆరు నెలల వరకు కొనసాగించాలి. ముర్రు పాలు శిశువుకు, పాలిచ్చే తల్లులకు ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. కొన్నేళ్ల క్రితం నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 నివేదిక ప్రకారం రాష్ట్రంలో సగటున తల్లిపాలు 67.0 శాతం మంది మాత్రమే శిశువు పుట్టిన గంటలోపు తాగిస్తున్నారని గుర్తించారు. ఆరు నెలలపాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇస్తున్న తల్లులు కేవలం 40 శాతం మంది అని నివేదికలో పొందుపర్చారు. ఆరు నెలల నుంచి రెండేళ్ల వయసు వరకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారాన్ని 8.3 శాతం మాత్రమే ఇస్తున్నారని అందులో పేర్కొన్నారు. ఈ వివరాలను జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం పంపారు. 'తల్లిపాలకు ప్రాధాన్యం ఇవ్వండి' అంశంతో నేటి నుంచి ఏడో తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో నిర్వహించేందుకు సన్నద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కార్యక్రమాలు ఇలా..**

ఆగస్టు 1న జిల్లా, ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లకు, ఆశాలకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన. గృహ సందర్శన చేసి గర్భిణులు, రెండేళ్ల లోపు పిల్లల పోషణ, ఆరోగ్య సలహాలిస్తారు. 2న తల్లిపాల ప్రాధాన్యంపై కుటుంబ సభ్యులకు అవగాహన, ప్రసూతి ఆస్పత్రుల సందర్శన, గంటలోపు తల్లిపాలను ప్రారంభించేలా ప్రోత్సాహిస్తారు. పోస్టర్ల ప్రదర్శన, వ్యక్తిగత గౌరవంపై అవగాహన కల్పిస్తారు. 4న అన్నప్రాశన, ఆహారం, రెండేళ్ల వరకు తల్లిపాలు కొనసాగించడంపై అవగాహన. 5న 6-24 నెలల పిల్లల తల్లులకు తల్లిపాల పద్ధతులు, పోషణ లోపాలున్న పిల్లల కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్. 7న స్వయం సహాయక సంఘాల బృందాల మద్దతు కోసం సమావేశాలు.

**ఎన్నో పోషకాలు..**

పసుపు పచ్చటి ముర్రు పాల(కొలస్ట్రం)లో బిడ్డ పెరుగుదలకు కావాల్సిన అన్ని పోషకాలుంటాయి. విటమిన్ ఏ, కే ఎక్కువుంటాయి. ఇవి శిశువుకు మొదటి వ్యాధి నిరోధక టీకాగా పని చేస్తాయి. బిడ్డను కామెర్ల వ్యాధి నుంచి రక్షిస్తాయి. పిల్లల జీర్ణాశయాన్ని శుభ్రపరుస్తాయి. బిడ్డకు ఆర్నెళ్లు నిండే వరకు తల్లిపాలు తప్ప ఏ ఆహార, ద్రవ పదార్థాలు ఇవ్వగూడదు. తల్లి రొమ్ములో మిలియన్ల సంఖ్యలో పాల ఉత్పత్తి గ్రంథులు (ఎల్వియోలై)ఉంటాయి. బిడ్డ ఎంత ఎక్కువగా పాలు తాగగలిగితే అన్ని ఉత్పత్తి అవుతాయి. బిడ్డ పాలు తాగడం ఆపేస్తే ఉత్పత్తి తగ్గుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

**కుటుంబానికి, సమాజానికీ ప్రయోజనం**

శిశు మరణాలు తగ్గుతాయి. ఔషధాలు, సీసాలు, పాలపీకలు లాంటివి కొనే అవసరం లేకుండా కుటుంబంపై ఆర్థిక భారం తగ్గుతుంది. పిల్లల అభివృద్ధికి తోడ్పడుతుంది.

**ఎంతో శ్రేయస్కరం..**

కృష్ణవేణి, జిల్లా సంక్షేమాధికారిణి, నల్గొండ.

చిన్నారులకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం. ప్రతి ఒక్కరికి తల్లిపాల వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన పెంచేందుకే ప్రభుత్వం ఏటా ప్రత్యేకంగా వారోత్సవాలు నిర్వహిస్తుంది. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సెర్ప్, మెప్మా సిబ్బందితో అంగన్‌వాడీ ఉపాధ్యాయునిలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించనున్నారు. తల్లిపాలతో పాటు చిన్నారులకు అందించాల్సిన అనుబంధ ఆహారం, గర్భిణీ స్త్రీలు పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై కూడా అవగాహన కల్పించనున్నాం.


# భద్రత కరవైన బాల్యం

ముస్తాబాద్: జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక రక్షణ కరవైంది. కొన్ని బడులు ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలల ఆవరణలో పశువులు, శునకాలు సంచరిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. విష సర్పాలతో ప్రమాదం పొంచి ఉంది. వీటికితోడు రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ప్రహరీలు లేని కొన్ని పాఠశాలల స్థలాలు ఆక్రమణకు గురయ్యే అవకాశముంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ప్రహరీలేని వాటిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలలు-112, ప్రాథమిక-337, ప్రాథమికోన్నత-38, ఆదర్శ పాఠశాల-7 ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి దాదాపు 39 వేలకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

**కొన్నిచోట్ల తీవ్ర ఇబ్బంది**

ముస్తాబాద్ పరిధిలోని వెంకయ్యకుంట ప్రాథమిక పాఠశాల, మద్దికుంట, బందనకల్ అంబేద్కర్ నగర్, నామాపూర్ చైతన్య నగర్, నామాపూర్ తండా, గన్నెవారిపల్లె, తెర్లుమద్ది లంబాడితండా, చీకోడ్ ఒడ్డెర కాలనీ, గోపాల్‌పల్లె గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. కొన్ని పాఠశాలలు పొలాల పక్కనే ఉన్నాయి. ఆయా పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు ఉండటంతో విష సర్పాలతో ప్రాణభయం ఉందని ఆందోళన చెందుతున్నారు. వీటికి తోడు బడుల సమయం ముగిసిందంటే చాలు



పశువులు, కుక్కలకు అడ్డాగా మారుతున్నాయి. నాటిన మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

**రాజిరెడ్డి, ఎంఈవో ముస్తాబాద్**

మండలంలోని ప్రహరీలేని పాఠశాలలను గుర్తించాం. ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సమస్య పరిష్కారానికి మరోసారి పై అధికారులు దృష్టికి తీసుకువెళ్లాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. కాగానే పనులు ప్రారంభించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించేలా చర్యలు చేపడతాం.

# నీటిపారుదల శాఖకు మంచి రోజులు

అశ్వారావుపేట : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం నీటిపారుదల శాఖలో పెద్దఎత్తున పోస్టులు మంజూరు చేసింది. రాష్ట్రంలో అత్యధికంగా పూర్వ నల్గొండ, ఖమ్మం జిల్లాలకు ఎక్కువ పోస్టులు మంజూరయ్యాయి. ఖమ్మం జిల్లాలో ఎన్నెస్పీ కాలువ, వైరా జలాశయం, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం, పాలేరు రిజర్వాయర్, లంకాసాగర్, కట్టలేరు.. భద్రాద్రి జిల్లాలో పెద్దవాగు ప్రాజెక్టు, అశ్వారావుపేట వెంకమ్మ చెరువు, తాలిపేరు, మూకమామిడి, సీతారామ ఎత్తిపోతల, సీతమ్మ సాగర్, వెంగళరాయ సాగర్ లాంటి ప్రధాన ప్రాజెక్టులున్నాయి. 25 ఏళ్ల కిందట నియమించిన లస్కర్ పోస్టులే కొనసాగుతున్నాయి. అనేకమంది ఉద్యోగ విరమణ చేయడంతో చాలాచోట్ల అధిక సంఖ్యలో ఖాళీలున్నాయి. లస్కర్లు లేకపోవడంతో గత ఏడాది అశ్వారావుపేట మండలం పెద్దవాగు ప్రాజెక్టుకు భారీ గండి పడి పెద్దఎత్తున నష్టం సంభవించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా తెలంగాణలో జలాశయాల వద్ద కీలకంగా వ్యవహరించే లస్కర్ పోస్టుల మంజూరుపై దృష్టి పెట్టింది. భద్రాద్రి జిల్లాకు 115, ఖమ్మం 151 లస్కర్ పోస్టులు మంజూరయ్యాయి. త్వరలోనే పూర్తిస్థాయి నియామక ఉత్తర్వులు రానున్నాయి. అశ్వారావుపేట నియోజకవర్గానికి భద్రాద్రి జిల్లాలో అత్యధికంగా 38 లస్కర్ పోస్టులు, నాలుగు సూపర్‌వైజర్ పోస్టులు



రానున్నాయని తెలుస్తోంది. భద్రాద్రి జిల్లాలో 2,364, ఖమ్మం జిల్లాలో 1061 జలాశయాలున్నాయి. ప్రభుత్వం నీటిపారుదలశాఖ జీఓఆర్‌టీ నెంబరు: 1212 తేదీ: 19.07.2025 ఉత్తర్వులననుసరించి ఉమ్మడి జిల్లాలో మంజూరు చేసిన పోస్టుల వివరాలు ఇవి...

ప్రభుత్వం నియామక ఉత్తర్వులు విడుదల చేయగానే అవసరాన్ని బట్టి నియోజకవర్గాలవారీగా సిబ్బంది కేటాయింపులు జరిపే అవకాశాలున్నాయి. పోస్టుల కేటాయింపుతో చాలావరకూ సిబ్బంది కొరత తీరనుంది.ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ, నీటిపారుదలశాఖ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

# ఇక డుమ్మాలకు చెక్..!

కొత్తగూడెం: సింగరేణిలో ఇప్పటి వరకు బయోమెట్రిక్ విధానం ద్వారా ఉద్యోగులు తమ హాజరును నమోదు చేసుకునేవారు. శుక్రవారం నుంచి ముఖ గుర్తింపు ద్వారా హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు యాజమాన్యం అన్ని ఏరియాల అధికారులను ఆదేశించింది. ఆగస్టు 1 నుంచి గనులు, కార్యాలయాల్లోకి ఉద్యోగులు రావడాన్ని, తిరిగి వెళ్లడాన్ని ఈ యంత్రం ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రధాన కార్యాలయం, ఏరియా జీఎం కార్యాలయాలు, గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ముఖగుర్తింపు యంత్రాల బిగింపు ప్రక్రియ పూర్తికాగా కొన్ని ప్రాంతాల్లో తుది దశకు చేరింది.

**పారదర్శకతకు చర్యలు..:** ముఖ గుర్తింపు ద్వారా హాజరును నమోదుచేసే ప్రక్రియకు కొంతకాలం ముందు నుంచే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని మెస్సర్స్ సెల్ఫీటెక్నాలజీస్



లిమిటెడ్ సంస్థ దీన్ని రూపొందించింది. ముందుగా ఉద్యోగుల ఫొటోలు సేకరించి ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చింది. ఇది నేరుగా సింగరేణిలో ఉద్యోగుల వేతనాలు చెల్లించే యాప్ (శాప్)నకు అనుసంధాన మవుతుంది. ఉద్యోగుల హాజరు ఆధారంగా వేతనాన్ని లెక్కించనున్నారు. సింగరేణి ఉద్యోగుల హాజరులో పారదర్శకత కోసం ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు.

**ఏరియాల వారీగా ఉద్యోగులు..** కొత్తగూడెం (2,622), ఇల్లెందు (668), మణుగూరు (2,547), రామగుండం-1 (5,688), రామగుండం-2 (3,803), రామగుం డం-3 (4,070), భూపాలపల్లి (5,362), బెల్లంపల్లి (1,027), మందమర్రి (4,966), శ్రీరాంపూర్ (9,101), జైపూర్ ఎస్టీపీపీ (138)

# అనారోగ్యం కొని తేచ్చుకోకు..!

పాల్వంచ: రంగు, రుచి చూసి చిన్నారులు చిరుతిళ్లను అమితంగా ఇష్టపడతారు. విపణిలో లభించే చౌక తినుబండారాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. నాణ్యత లేని, తక్కువ ధరకు దొరికే ముడిపదార్థాలతో తయారుచేసే పిజ్జాలు, బర్గర్లు, బేకరీ ఉత్పత్తులు, మసాలా పదార్థాలు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. గతేడాది ఇలాంటి ఘటనలు నారాయణపేట, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాల్లో చోటుచేసుకున్నాయి.

**గతేడాది మార్గదర్శకాలు జారీ**

వసతిగృహాలు, సంక్షేమ గురుకులాలు, కేజీబీవీల్లోని విద్యార్థులకు తల్లిదండ్రులు తినుబండారాలు తెచ్చి అందించకూడదని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది మార్గదర్శకాలు వెలువరించింది. విద్యార్థులు సైతం బయట కొనుక్కొని తీసుకురాకూడదని స్పష్టం చేసింది. కలెక్టర్లు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్న భోజనంతో పాటు వసతిగృహాల్లో కూరగాయలు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. కొన్ని జిల్లాల్లో విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. ఈనేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ వ్యవస్థను మెరుగుపరచాలి. విద్యార్థులు తినుబండారాలను తీసుకురాకుండా పాఠశాల ప్రార్థన సమయంలో రోజువారీగా యాజమాన్యాలు తనిఖీ చేసేలా చొరవ చూపాలి. రాగి బిస్కెట్లు, పల్లి చెక్కీలు వంటివి మహిళా సంఘాలతో తయారుచేయించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అందిస్తే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. 'మార్కెట్‌లో లభ్యమయ్యే ఆహార పదార్థాలను తింటే జీర్ణకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. గ్యాస్, మలబద్ధకం, అజీర్తి, కడుపునొప్పి, పేగుపూతలు, దంత సమస్యలు, ఊబకాయం వంటివి వస్తాయి. జంక్ ఫుడ్‌లో రుచి కోసం వినియోగించే ఉప్పు ఆరోగ్యానికి చేటు చేస్తుంది'వైద్యుడు ముక్కంటేశ్వరరావు తెలిపారు.

## ‘మట్టి’మేలు తలపెడదాం..!

నీలగిరి : యువత, చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా నిర్వహించే ముఖ్య పండగల్లో మొదటిది వినాయక చవితి. ఈ వేడుకకు ఇంకా నెల రోజుల సమయం ఉంది. తొలి పూజలందుకునే వినాయకున్ని మట్టితో తయారు చేసి పూజిస్తే పర్యావరణానికి మేలు జరుగుతుందని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. గణనాథుని విగ్రహం, మండపం, నిత్య పూజలు, ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్లు, నిధుల సమీకరణ గురించి ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నారు.

**యువత ఇవి తెలుసుకోవాలి**

పీవోపీతో తయారు చేసిన విగ్రహాల గురించి యువత తెలుసుకోవాలి. జిప్సం (కాల్షియం సల్ఫేట్ డ్రై హైడ్రైట్) నుంచి పీవోపీని తయారు చేస్తారు. ఇవి నీటిలో కరిగితే కాలుష్యం ఏర్పడి జీవరాసులు చనిపోతాయి. నీటి సహజ గుణాన్ని దెబ్బతీస్తుంది. విగ్రహాలు తయారు చేయడానికి ఉపయోగించే పీవోపీతో పాటు రంగుల్లో పాదరసం, సీసం, క్రోమియం వంటి లోహాలను కలుపుతారు. నీటిలోనే కాదు మట్టిలోకి చేరి అనేక రకాల వ్యాధులకు కారణం అవుతున్నాయి. గాలి, నీరు, భూమి కలుషితం అవుతున్న విగ్రహాలను మార్చకపోతే ముందుతరాలు ఇబ్బందులకు గురికాక తప్పదు.

**పోటీ పడి ఏర్పాటు**

ఉమ్మడి జిల్లాలోని పురపాలికలు, గ్రామాల్లో వేలాదిగా పోటీ పడి మరీ విగ్రహాలను ప్రతిష్ఠించి చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే



అవకాశం ఉన్నందున విగ్రహాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. విగ్రహాల తయారీ విషయంలో ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరించడంతో కాలుష్య కారకాలు పెరగుతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కర్ణాటకలో నిషేధం**

కాలుష్యం వెదజల్లే పీవోపీ విగ్రహాల తయారీని మన పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో నిషేధించారు. మట్టి విగ్రహాలను పూజించాలని అక్కడి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మహారాష్ట్రలోని కొన్ని స్వచ్ఛంద సంస్థలు పీవోపీ విగ్రహాలను రీసైక్లింగ్ చేసి ఇతర వస్తువులు తయారు చేయడానికి ఉపయోగిస్తున్నారు.

**20 ఏళ్లుగా పూజిస్తున్నాం**

నూకల జైపాల్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణకు మావంతుగా 20 ఏళ్లుగా వెంకటేశ్వరకాలనీలోని దేవాలయాల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిస్తున్నాం. శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి ఆలయంలో, పంచముఖ హనుమాన్ ఆలయాల్లో మట్టి విగ్రహాలను అక్కడే నిమజ్జనం చేసి మట్టిని చెట్లు పెంచడానికి ఉపయోగిస్తున్నాం.

## వర్షాకాలం మారిందా అన్నట్లు.. వరుణుడే లేనట్లు..!

నల్గొండ: వరుణుడు ముఖం చాటేయడంతో జిల్లాలో చెరువులు, కుంటల ఎండిపోయి నోర్లు తెరిచాయి. వానాకాలం ప్రారంభమై రెండు నెలలు దాటినా.. జిల్లాలో భారీ వర్షాలు లేక సుమారు 1,180 చెరువుల్లో భూపగుళ్లు పట్టాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోరు బావుల్లో నీటి శాతం పడిపోవడంతో వాటి కింద సేద్యం అగమ్యగోచరంగా మారింది. పెరిగిన నారు నాటేందుకు నీటి కొరత ఉత్పన్నం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతాల్లో మాత్రమే చెరువుల్లోకి కాస్త నీరు చేరాయి.

**మత్స్యకారుల ఆందోళన..!**

చెరువుల్లోకి వరద నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతుండగా.. మరోవైపు మత్స్యకారులు లోటు వర్షపాతంతో చేపల పెంపకంపై మదన పడుతున్నారు. కొన్నాళ్లుగా జిల్లాలో లక్ష్యానికి మంచి చేపల ఉత్పత్తి జరిగింది. కానీ ఈ ఏడాది ఆగస్టు నెల ప్రారంభం



అవుతున్నా.. ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో చేపల పెంపకంపై నీలినీడలు కుమ్ముకున్నాయి. అవకాశం ఉన్న ప్రాంతాల్లో సాగర్ ఎడమ కాల్వ, ఏఎమ్మార్పీ కాల్వల ద్వారా చెరువులను నింపాలని రైతులు, మత్స్యకార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

**జులై 30 నాటికి నీటి నిల్వ వివరాలు ఇలా** జిల్లాలో 1628 చెరువులు ఉండగా అందులో ఇప్పటి వరకు మూసీ పరివాహక ప్రాంతంలో నాలుగు మాత్రమే నిండాయి. 97 చెరువులు సగానికి నిండగా 1108 చోట్ల చుక్క నీరు చేరకపోవడంతో పగుళ్లు పట్టాయి. ప్రధానంగా మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో వరద నీరు చేరకపోవడంతో ఆయా ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఆందోళన పడుతున్నారు.

## స్వచ్ఛత లోపం.. ర్యాంకులు దూరం



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని పుర, నగరపాలికలు పారిశుధ్య నిర్వహణలో వెనుకబడిపోయాయి.. గతంతో పోలిస్తే మార్కులు తగ్గి.. ర్యాంకులు పెరిగాయి.. కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ‘స్వచ్ఛ సర్వేక్షణ్’ 2024-25 ర్యాంకులను ప్రకటించగా ఉమ్మడి జిల్లా పట్టణాలు సత్తా చాటలేకపోయాయి.. పలు లోపాలు ఇందుకు కారణమవుతున్నాయి. ఈ లోపాలు అధిగమించడంపై అధికారులు దృష్టి పెడితేనే మున్ముందు స్వచ్ఛ ర్యాంకుల్లో మెరుగయ్యే అవకాశముంది.

**ఈ లోపాలతో..**

ఇటీవల రహదారుల వెంట ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నా కొద్దిసేపటికే మళ్లీ చెత్త వేస్తున్నారు. డంపింగ్‌యార్డుల్లో చెత్త నిల్వలు పెరిగిపోతున్నాయి. బయోమైనింగ్ సక్రమంగా చేయడం లేదు. తడి చెత్తను తగ్గించేందుకు బయోగ్యాస్ ప్రారంభించడం లేదు. వర్మీ కంపోస్టు ప్రక్రియ నామమాత్రంగా ఉంది. పొడి చెత్త కేంద్రాలకు ఆశించిన స్థాయిలో రావడం లేదు.

జీఎఫ్‌సీ (గార్బేజ్ ఫ్రీ సిటీ)లో రేటింగ్‌లో మార్కులు రావడం లేదు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కీలకం. వీరికి అదనంగా పనులు అప్పగించడంతో వీధుల్లో పర్యవేక్షణ అటకెక్కింది. స్వచ్ఛ ఆటోల వారు దురుసుగా మాట్లాడుతున్నారన్న కోపంతో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాల తనిఖీల సమయంలో నగర, పట్టణ వాసులు నిర్లక్ష్యంగా సమాధానాలు ఇవ్వడంతోనూ మార్కులు తగ్గుతున్నాయి. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ విఫలం కావడంతో మార్కులు తగ్గాయి.

## అసంపూర్తి భవనం.. వైద్యానికేదీ అభయం



మెట్‌పల్లి: మెట్‌పల్లి సామాజిక ప్రభుత్వాసుపత్రి నూతన భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో రోగులు, వైద్యులు అవస్థలు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన పాత భవనంలోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయి. మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలతో పాటు పొరుగు జిల్లాలైన నిజామాబాద్, ఆదిలాబాద్‌లోని పలు మండలాల నుంచి చికిత్స కోసం రోగులు మెట్‌పల్లి ఆసుపత్రికి వస్తుంటారు. పేరుకు 30 పడకల ఆసుపత్రి అయినా ప్రస్తుతం 74 పడకలు నిర్వహిస్తున్నారు. ఏటా సుమారు 50 వేలకు పైగా ఓపీ నమోదవుతోంది. ప్రతి నెలా ఐపీ 500కు పైగా ఉంటుంది. జ్వరాల సీజన్‌లో ప్రతి వార్డు కిక్కిరిసిపోతోంది. ఆసుపత్రిలో సుమారు వెయ్యి వరకు ప్రసవాలు జరుగుతాయి. ఏటా రోగులు పెరుగుతున్నా ఆ మేరకు వసతులు మెరుగుపడటం లేదు.

**70 శాతానికి పైగా పూర్తి**

ఆసుపత్రి భవనం వర్షానికి ఉరవడం, పెచ్చులూడుతుండటంతో నూతన భవన నిర్మాణానికి టీఎస్ఎంఐడీసీ కింద రూ.7.50 కోట్లు మంజూరయ్యాయి. సుమారు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. గుత్తేదారుకు బిల్లులు రాకపోవడంతో ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. మరోవైపు పాత భవనం పెచ్చులూడుతోంది. ఇటీవల ఓ వార్డులో పైకప్పు పెచ్చులూడి పడగా, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే ఆపరేషన్ థియేటర్ సమీపంలోనూ పైకప్పు పెచ్చులూడాయి. వర్షం కురిసినపుడు ఉరుస్తుండటంతో గోడలు తడిగా మారుతున్నాయి. ఎక్స్‌రే గది గోడలు తడిగా మారడంతో యంత్రాలు పాడయ్యే ప్రమాదం ఉంది.

**ఇబ్బందులు ఇలా..**

ఆసుపత్రికి మంజూరైన రక్త నిల్వ కేంద్రానికి గది లేక పరికరాలు వృథాగా ఉన్నాయి.

ఓపీ నమోదు కేంద్రం వద్ద సరిపడా స్థలం లేక రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రెండో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుకు గదుల కొరత సమస్యగా మారింది. గదులు సరిపోక ఇద్దరు, ముగ్గురు వైద్యులు ఒకే గదిలో రోగులను పరీక్షించాల్సి వస్తోంది.

ఐసీటీసీ ల్యాబ్, ఆసుపత్రి ల్యాబ్ ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. కౌన్సెలింగ్ చేయడానికి ప్రత్యేక గది లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

– రామకృష్ణ, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త

ఆసుపత్రి భవన నిర్మాణంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల జరిగిన సమీక్షలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించాం. నూతన భవనం త్వరగా అందుబాటులోకి వచ్చేలా చూడాలని కోరాం.

## ఖాళీ స్థలం.. కనిపిస్తే మాయం



సిరిసిల్ల: ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు ఇలా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. కబ్జాదారులు ఆక్రమించేస్తున్నారు. సిరిసిల్ల పురపాలిక పరిధిలోని విలీన గ్రామాల్లో సాగుతున్న ఆక్రమణలే ఇందుకు నిదర్శనం. చిన్నబోనాలలో ప్రభుత్వ స్థలంలో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రెవెన్యూ శాఖ హద్దులు చూపిస్తే.. ఆ స్థలంలో పంట సాగు చేశారు.

**అయిదు గుంటల ఆక్రమణ**

పురపాలికలో విలీనమైన చిన్న బోనాలలో రెండు సర్వే నంబర్లలో అయిదెకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలోంచి రెండు ఎకరాలను పురపాలికలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు కేటాయించారు. మరికొంత భూమిలో రైతు వేదిక నిర్మించారు. దీని పక్కనే ఉన్న అయిదు గుంటల విస్తీర్ణంలో పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి కేటాయించారు. గత జూన్‌లో ఆసుపత్రి నిర్మాణానికి రెవెన్యూ అధికారులు హద్దులు చూపి.. భూమి పూజ కూడా చేశారు. అయితే ఇటీవల గుత్తేదారు వచ్చి పనులు ప్రారంభించేలోగా.. ఆ స్థలం పొలంగా మారిపోయింది.

**వరద కాలువ స్వాహా** సదరు ఆరోగ్య కేంద్రం స్థలం పక్కనే భూములుండగా.. వీటికి సాగు నీరు చిన్న బోనాల కొత్త చెరువు, పెద్ద చెరువు, భామణికుంట, ఈదులచెరువు, సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువులను కలుపుతూ పది కిలోమీటర్ల మేర వరద కాలువ ఉంది. ఏడాది కిత్రం చిన్న బోనాలలోని కొత్త చెరువుకు గండి పడటంతో ఈ కాలువ ద్వారా వచ్చిన నీరు సిరిసిల్ల పట్టణాన్ని ముంచెత్తింది. అయిదు మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన కాలువ.. ఆక్రమణలతో రెండు మీటర్లకు కుంచించుకుపోయింది.

సిరిసిల్ల–కామారెడ్డి బాహ్యవలయ రహదారి పక్కనే చిన్నబోనాల ఉంది. ఇక్కడ గజం బహిరంగ మార్కెట్‌లో రూ.10 లక్షలు పలుకుతుందని సమాచారం. ప్రస్తుతం ఆక్రమణకు గురైన స్థలం కోట్ల రూపాయల విలువ చేస్తుంది.

**ధరణికి ముందే ఆక్రమణలు**

చిన్న బోనాలలో ప్రభుత్వ స్థలాలు భూ దస్త్రాల ప్రక్షాళన సమయంలో అప్పటి రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై చాలావరకు ప్రభుత్వ స్థలాలు ఎలాంటి ఆధారాలు లేకుండా ధరణిలోకి ఎక్కించారు. వాటిలో సిరిసిల్ల పురపాలిక పరిధిలో చిన్న బోనాల, పెద్ద బోనాల, పెద్దూరులోనివే ఎక్కువున్నాయి. ఇటీవల భూభారతి గ్రామ సభల్లో ప్రభుత్వ సర్వే నంబర్లలో జరిగిన అక్రమాలు వెలుగు చూశాయి.

## అప్రమత్తతే... ఊపిరి..!

మిర్యాలగూడ : శరీరానికి ప్రాణ వాయువును అందించి మనిషిని కాపాడటంలో కీలక పాత్ర పోషించే ఊపిరితిత్తుల ఆరోగ్యం పట్ల అనేక మంది అశ్రద్ధ వహిస్తున్నారు. వాతావరణ కాలుష్యం, విష వాయువులు, ధూమపానం తదితర కారణాల వల్ల పలువురు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడి జీవితాలను కోల్పోతున్నారు. వ్యాధిపై సరైన అవగాహన పెంచుకోవడంతో పాటు..నివారణ మార్గాలను అనుసరిస్తే వ్యాధి దరి చేరకుండా కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌ల స్మాల్‌సెల్ లంగ్ క్యాన్సర్, నాన్ స్మాల్‌సెల్ లంగ్ క్యాన్సర్ అని రెండు రకాలు ఉంటాయి. స్మాల్‌సెల్ లంగ్ క్యాన్సర్ అనేది ఎక్కువగా పొగ తాగేవారిలో కనిపిస్తుంది. మొత్తం ఊపిరితిత్తుల క్యాన్సర్లలో సుమారు 14 శాతం ఇవే ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇక 85 శాతం మందిలో నాన్ స్మాల్‌సెల్ లంగ్ క్యాన్సర్ కనిపిస్తుంది. పొలుసుల కణ క్యాన్సర్, పెద్ద సెల్ కార్సినోమా వల్ల ఈ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో పదుల రకాల క్యాన్సర్ల బాధితులు సుమారు 3 వేల మందికి పైగా ఉన్నారు. వీరిలో అత్యధికంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు మహిళలను ఇబ్బంది పెడుతుండగా. .పురుషుల్లో పెద్ద పేగు క్యాన్సర్‌తో పాటు..ఊపిరితిత్తుల క్యాన్సర్



అధికంగా వ్యాప్తి చెందుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం సుమారు 20 మందికి పైగా ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితులు ఉండగా.. అనధికారింగా వంద మందికి పైగానే బాధితులు ఉంటారని అంచనా.

**ముందుగా గుర్తిస్తే చికిత్సతో నయం**

డాక్టర్ కంచర్ల హరీష్, క్యాన్సర్ వైద్య నిపుణుడు

ఇటీవల కాలంలో క్యాన్సర్ బాధితులు అధికంగా పెరుగుతున్నారు. పురుషుల్లో అధికంగా పెద్దపేగు క్యాన్సర్‌తో పాటు ఊపిరితిత్తుల క్యాన్సర్ సైతం అధికంగా విస్తరిస్తోంది. దీనిలో ప్రధానంగా పొగతాగడం కారణంగా స్మాల్ సెల్ ఊపిరితిత్తుల క్యాన్సర్ ఇటీవల కాలంలో క్రమేపీ విస్తరిస్తుంది. ప్రస్తుతం నమోదవుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితుల్లో 95శాతం మంది పొగ తాగేవారు, పొగ తాగే వారి వెంట ఉండే వారు ఉన్నారు. వాహనాల కాలుష్యం, డీజిల్ ఉద్గారాలు, రాడార్ గ్యాస్ వంటివి సైతం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు కారణం కావొచ్చు. ముందస్తుగా గుర్తించి తగిన చికిత్స అందించడం వల్ల క్యాన్సర్ మరణాలను తగ్గించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

## సన్నకారు.. బేజారు

రాజపేట : రైతులకు పెట్టుబడి తడిసి మోపెడవుతోంది. మరోవైపు సకాలంలో పంట రుణాలు దొరకడం లేదు. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులు పంటలేయాలంటే పెరిగిన ఖర్చుల కారణంగా భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నారుమళ్లు సిద్ధమై నెల గడిచినా ఆలస్యంగా కురిసిన ఓ మోస్తరు ముసురు కారణంగా కొందరు ఇంకా నాట్లేసే దశలోనే ఉన్నారు. ఇంకొందరు యంత్రాల కోసం యజమానుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు కూలీల కోసం ఎదురు చూస్తున్నారు. అటు వరుణుడు, ఇటు కూలీల కొరత, మరోపక్క పెరుగుతున్న ఖర్చులు రైతన్నను కుంగదీస్తున్నాయి.

**వేధిస్తున్న కూలీల కొరత**

జిల్లా వ్యాప్తంగా సుమారు 80 శాతం మంది కూలీలపైనే ఆధారపడి సాగుకు ఉపక్రమిస్తారు. పెద్ద రైతులకు సొంత యంత్రాలున్నాయి. సన్నకారు రైతులు అద్దెను చెల్లించి సాగు చేపట్టాల్సిన పరిస్థితి. ఒక్కో ఎకరానికి రూ.20 వేలకు పైగా పెట్టుబడి అవుతుంది. అప్పోసప్పో చేసి నాట్లు వేద్దామని ముందుకొచ్చినా కూలీల కొరత వేధిస్తోంది. రోజుకు మహిళలకు రూ.500, పురుషులకు రూ.600 ఇస్తామన్నా పనులకు రావడం లేదని పలువురు రైతులు అంటున్నారు. ఇంకొందరు పొరుగు రాష్ట్రాల కూలీలతో వరినాట్లకు పూనుకున్నారు.

**ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి..**

శాంతినిర్మల, ఏడీఏ, యాదగిరిగుట్ట

నూతన పద్ధతుల ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. కూలీలపైన



ఆధారపడకుండా చిన్నపాటి యంత్రాల వినియోగం పెరగాలి. సాధ్యమైన మేరలో సొంతంగా పనులు చేసుకుంటే ఖర్చులు చాలా తగ్గుతాయి. సాగుకు అనుబంధంగా పాడి పరిశ్రమ, కూరగాయల పెంపకం లాంటివి చేపడితే ప్రయోజనం ఉంటుంది.

**జిల్లాలో పంటల సాగు వివరాలు (ఎకరాల్లో)**

సాగు యోగ్యమైన భూమి: 4,50,757

రైతుల సంఖ్య : 2,27,156

వానాకాలంలో వరిసాగు అంచనా: 2,95,000

ఆయా పంటలు సాగు చేసింది: 42 శాతం

పత్తి సాగు అంచనా: 1,15,000

వేసిన పత్తి: 52,176

**ఎకరానికి పెట్టుబడి ఇలా.. (సుమారుగా)**

| | |
|---|---|
| తొలి దుక్కికి ట్రాక్టర్ గంటకు : | రూ.1200 |
| మొత్తం చదును చేసేందుకు : (మూడుగంటలకు) | 3,600 |
| పొలం గట్లు తీసేందుకు : | రూ.2,200 |
| రసాయన ఎరువులకు : | రూ.2,300 |
| కలుపు మందుకు : | రూ,2,650 |
| నాట్లు వేసే కూలీల ఖర్చు : | రూ.6000 |
| పురుగు మందుకు : | రూ.2,000 |

# జల్లు పడితే ఒళ్లు ఝల్లు

హైదరాబాద్: వానాకాలం ప్రారంభమైంది. డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. నిమోనియా, అస్తమా, డయేరియా, హెపటైటీస్, టైఫాయిడ్ వంటివీ విజృంభిస్తుంటాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలకు వెళ్లే పిల్లలు, ఇంటి వద్ద ఉంటే చిన్నారుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతం నిలోఫర్‌కు నిత్యం జలుబు, దగ్గుతోపాటు ఒకరిద్దరు డెంగీతో చికిత్స కోసం వస్తున్నారు. గతేడాది రాష్ట్రంలో 10 వేలకు పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి.

**పగలు కుట్టే దోమతో...**

డెంగీకి కారణమయ్యే టైగర్ దోమ పగటి పూట ఎక్కువగా కుడుతుంది. పాఠశాలల చుట్టూ నీరు నిల్వ ఉండటం, కొబ్బరి చిప్పలు ఇతర చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల ఈ దోమలు ఎక్కువగా ఉంటాయి. దోమ కుట్టిన వారం రోజుల్లో తీవ్ర జ్వరం ప్రారంభమై 4-5 రోజులపాటు కొనసాగుతుంది. తగ్గిన తర్వాత 72 గంటలు చాలా



కీలకం. ప్లేట్‌లెట్లు తగ్గుతుంటాయి. రక్తంలోని ప్లాస్మా లీకేజీ అత్యంత ప్రమాదకరం. రక్తపోటు తగ్గిపోయి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. ముఖం, కాళ్లు, పొట్ట ఉబ్బడం, తీవ్రమైన నీరసం, కాళ్లు, చేతులు చల్లబడటం తదితర లక్షణాలు ప్లాస్మా లీకేజీగా గుర్తించాలి. జలుబు, దగ్గు లేకుండా వచ్చిన తీవ్రమైన జ్వరాన్ని డెంగీగానే అనుమానించాలని వైద్యులు చెబుతున్నారు.

**ఆ సమయంలో పాఠశాలకు పంపొద్దు**

వానాకాలంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే తగ్గేవరకు పాఠశాలకు పంపొద్దు. ఇతర వ్యాధులు సోకే అవకాశం ఉంటుంది. బయట ఆహారం కాకుండా ఇంట్లో వేడిగా తయారు చేసి పెట్టాలి. 4-5 రోజులైనా తగ్గని జ్వరం, నీరసం, కడుపులో నొప్పి, వాంతులు, వీరేచనాలు వంటి లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి. కాచి, చల్లార్చిన నీటినే తాగించాలి. కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు ధరింపచేయాలి. ఉషారాణి, చిన్నపిల్లల వైద్యులు, నిలోఫర్ ఆసుపత్రి

# తాగునీటికి తడబడి

భువనగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సరఫరా ప్రధాన సమస్యగా మారింది. శుద్ధజలం అందించాలని ప్రభుత్వం యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. మిషన్ భగీరథ పథకం ద్వారా అన్ని పాఠశాలలకు ప్రత్యేకంగా పైపులైన్ వేసి నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న పాఠశాలల్లో సరఫరాకు ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. చౌటుప్పల్‌లోని దివీస్ సంస్థ జిల్లాలో 565 పాఠశాలలకు నీటి శుద్ధి ఫిల్టర్లను సమకూర్చింది. మరమ్మతులు లేక 125 పనిచేయడం లేవని విద్యాశాఖ అధికారుల లెక్క. జిల్లాలో 100కు పైగా సర్కారు బడుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

చౌటుప్పల్ పట్టణం బంగారుగడ్డలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కృష్ణా నీటి కోసం భగీరథ ట్యాంకు నిర్మించారు. నీటిని నింపడం



లేదు. పాఠశాల వెనుకభాగంలో మరో ట్యాంకులోకి కృష్ణానీటిని నింపుతున్నారు. ఆ నీళ్లను దివీస్ లేబొరేటరీస్ సరఫరా చేసిన ఫిల్టర్‌లో శుద్ధి చేసి వంటకు ఉపయోగిస్తున్నారు. విద్యార్థులు ఇంటి నుంచి సీసాలు తెచ్చుకుంటున్నారు. ఆలేరు మండలం కొలనుపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో 306 మంది విద్యార్థులున్నారు. భగీరథ నీటిసరఫరా ఉన్నా విద్యార్థులు వాటిని తాగేందుకు ఇష్టపడటం లేదు. గతంలో 'దివీస్' ఇచ్చిన రెండు వాటర్ ఫిల్టర్లలో ఒకటి పనిచేయడం లేదు. మోత్కూరు పురపాలికలోని ప్రభుత్వ పాఠశాలల్లో దివీస్ ఫిల్టర్ల నుంచి వచ్చిన నీరే విద్యార్థుల దాహం తీరుస్తోంది.

యాదగిరిగుట్ట మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో ఎక్కువ శాతం విద్యార్థులు ప్లాస్టిక్ సీసాలనే వినియోగిస్తున్నారు. నీటి ట్యాంకులు కడగక, మూతలు పగిలి, గాలికి లేచిపోయి, కోతులు వాటిని తొలగించడం వల్ల నీరు కలుషితంగా మారుతున్నాయి.

ఆత్మకూరు(ఎం) మండలం పల్లెపహాడ్ ఉన్నత పాఠశాలకు గ్రామ మిషన్ భగీరథ ట్యాంకు దూరంగా ఉండటంతో నీరు సరఫరా కావడం లేదు. పంచాయతీ ట్యాంకర్‌తో సంపు నింపుతున్నారు. దివీస్ ఆర్వో వాటర్ ఫిల్టర్ దెబ్బతింది. గ్రామ పంచాయతీ నీటిశుద్ధి కేంద్రం నుంచి పాఠశాల అటెండర్ నిత్యం మూడు నీటి క్యాన్లను తెస్తున్నారు.

**స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నాం**

-సత్యనారాయణ, డీఈవో, యాదాద్రి భువనగిరి

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నీటి సదుపాయం కల్పించాం. కొన్ని పాఠశాలల్లో దివీస్ సంస్థ సమకూర్చిన ఫిల్టర్లు పనిచేయడం లేదు. పాఠశాలలు తెరవడానికి ముందే ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించాం. అన్ని చోట్ల పైకప్పులు ఏర్పాటు చేస్తున్నాం.

# విదేశాలకు పార్సిల్ పంపాలా? తపాలా ఉందిగా!

హైదరాబాద్: ఇంటి నుంచి ఏ వస్తువునైనా వేరే దేశానికి పంపించడానికి కేంద్ర ప్రభుత్వం 'పోస్టాఫీసు డాక్ నిర్యత్ కేంద్రం' ద్వారా సేవలు అందిస్తోంది. ఈ కేంద్రాల ద్వారా ఉత్పత్తులను ఎయిర్ పార్శిల్, స్పీడ్‌పోస్ట్, ఐటీపీఎస్ ద్వారా తక్కువ ఖర్చుతో ఎగుమతి చేయవచ్చు. నగరంలోని జనరల్ పోస్టాఫీస్ (జీపీవో)లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు.

**ప్రత్యేకతలు ఇవి..**

ఉత్పత్తి నమూనాలు తీసుకురావాల్సిన అవసరం లేదు.

ఎగుమతి పోస్టల్ బిల్లు నేరుగా దాఖలు చేయక్కర్లేదు. వెబ్సైట్‌లో పోస్టల్ బిల్ ఆఫ్ ఎక్స్‌పోర్ట్ (పీబీఈ)లో అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది.

కస్టమ్ హౌస్ ఏజెంట్, కస్టమ్ అధికారిని కలవాల్సిన అవసరం ఉండదు.

కస్టమ్ తనిఖీ తర్వాత పీబీఈని పోర్టల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఏవైనా విచారణలు, అభ్యర్థించిన పత్రాలకు నోటిఫికేషన్లు పోర్టల్‌లో అందుతాయి. వాటికి కావాల్సిన పత్రాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు.

ఈ-పోర్టల్ ద్వారా వస్తువు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు.

జీపీవోలో డాక్ నిర్యత్ కేంద్రం ద్వారా సేవలు

అంతర్జాతీయ స్పీడ్‌పోస్ట్ పార్శిల్ (ఈఎంఎస్): ఒక్కో పార్శిల్ 35 కేజీల వరకు, తక్కువ ఖర్చుతో 106దేశాలకు పంపించవచ్చు.

అంతర్జాతీయ ట్రాక్ చేయబడిన ప్యాకెట్ సర్వీస్(ఐటీపీఎస్): రెండు కిలోల వరకు పార్సిళ్లను ఆసియా పసిఫిక్ రీజియన్, యూఎస్‌ఏ పరిధిలోని 39 దేశాలకు చాలా తక్కువ ధరకు పంపించే వీలుంది.

ఎగుమతులకు సులభ మార్గం జీఎస్టీ నంబరు ఉన్న వారు ఇతర దేశాలకు ఏవైనా వస్తువులు సులభంగా ఎగుమతి చేసుకోవడానికి ఈ డీఎన్‌కేలు ఉపయోగపడతాయి.

ప్రసాద్, ఛీఫ్ పోస్ట్‌మాస్టర్, హైదరాబాద్ జీపీవో

**రిజిస్ట్రేషన్ ఇలా..**

ఎగుమతిదారు %https://dnk.cept.gov.in/customers.web%/ పోర్టల్ ఓపెన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాక ఒక ఐడీ వస్తుంది. ఆ కోడ్ ద్వారా పాన్ / జీఎస్టీ నంబరు, అవసరమైన ఇతర పత్రాలు పూర్తి చేయాలి. తరవాత పంపించే వస్తువుల వివరాలను పోర్టల్‌లోని పీబీఈలో ఎంటర్ చేస్తే పీబీఈ నంబర్ వస్తుంది. ఆయా వస్తువులను దగ్గరలోని డీఎన్‌కేకి తీసుకెళ్తే ఓ లేబుల్(సీఎన్22, సీఎన్23 కస్టమ్స్ డిక్లరేషన్)తో ఉంచి విదేశీ పోస్టాఫీస్‌కు పంపిస్తారు. అక్కడ పరీక్షించి అవసరమైన పత్రాలను అడుగుతారు. అన్నీ అయిన తర్వాత వస్తువు ఎగుమతికి లెట్ ఎక్స్‌పోర్టు ఆర్డర్‌ను ఇస్తుంది. దాన్ని పీబీఈ కస్టమర్ ఐడీలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# ముం'చెత్త'తోంది



హైదరాబాద్: ప్లాస్టిక్ వ్యర్థాలు నగరాన్ని ముంచేస్తున్నాయి. నాలాల్లో వరద ప్రవాహం సాఫీగా సాగట్లేదు. దీంతో వందలాది కాలనీలు, రహదారులను ముంచెత్తుతోంది. చిన్న వానకే వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. కల్వర్టులు, మ్యాన్‌హోళ్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు, గృహోపకరణలు పేరుకుపోవడంతో వరదంతా ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ప్రజల నిర్లక్ష్యం.. బల్దియా పర్యవేక్షణ లేకపోవడంతో ప్లాస్టిక్ ప్రమాదాన్ని తెచ్చిపెడుతోంది.

**40శాతం ప్లాస్టిక్, గృహోపకరణాలే..:** ఏటా వేల టన్నుల కొద్దీ పూడిక తీస్తుంటారు. అందులో 40శాతం ప్లాస్టిక్, గృహోపకరణాల వ్యర్థాల లెక్క తేలుతున్నాయి. రోజువారీ చెత్తలోనూ దాదాపు 20శాతం ప్లాస్టిక్ వ్యర్థాలుంటున్నాయి. వాటిలో పీపీ(పాలిథిలీన్), పీఈ(పాలిప్రొపెలిన్), సాధారణ కవర్లు, ఎక్కువ మందం ప్లాస్టిక్ వస్తువులు(హెచ్‌డీపీఈ), తక్కువ మందం ప్లాస్టిక్ వస్తువులు(ఎల్‌డీపీఈ), వ్యర్థాలు ఉంటున్నాయి.

**పూడికతీతలో అవినీతి..:** పూడికతీత పనుల్లో అవినీతి పేరుకుపోయింది. పనిచేయకుండా గుత్తేదారులు, ఇంజినీర్లు నిధులు పంచుకుంటున్నారు. దాంతో.. సగానికిపైగా మ్యాన్‌హోళ్లు, భూగర్భ వరద కాలువలు, కల్వర్టులు పూడిపోతున్నాయి.

ఎక్కడ తవ్వినా అవే : హైడ్రా ఆధ్వర్యంలో నాలాలు, మ్యాన్‌హోళ్లలోని వ్యర్థాల తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఏ మ్యాన్‌హోల్ తెరిచినా పైపులైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయి.

**అమలవ్వని నిషేధాజ్ఞలు..**

రాష్ట్ర వ్యాప్తంగా 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై నిషేధం ఉంది. జీహెచ్ఎంసీ నిషేదాజ్ఞలను అమలు చేయకపోవడంతో వందలాది ప్లాస్టిక్ కవర్ల తయారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. బల్దియా కార్యాలయాల్లో, అధికారుల నివాసాల్లోనూ ప్లాస్టిక్ వినియోగం కొనసాగుతోంది. రోజుకు ఉత్పత్తయ్యే చెత్త 8 వేల టన్నులు. అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా..

పీపీ 1.24%

పీఈ 0.84%

కవర్లు 11.53%

హెచ్‌డీపీఈ 0.83%

ఎల్‌డీపీఈ 0.80%

ఇతర 1.66%

# అమృత్ పనులు జోరందుకునేనా?



పెద్దపల్లి: పెద్దపల్లిలో ఏడాదిన్నరగా సాగుతున్న అమృత్ భారత్ పనులు ముందుకు సాగడం లేదు. జిల్లా కేంద్రంలో సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ ప్రతిపాదనలకు మోక్షం దక్కలేదు. రామగుండంలో చేపట్టిన అమృత్‌స్టేషన్ పనులు కొలిక్కి రావడం లేదు. ఈ క్రమంలో ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించిన సందీప్ మాథుర్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రామగుండం స్టేషన్, ఆర్‌వోహెచ్ డిపోను పరిశీలిస్తారు. 2.10 గంటలకు పెద్దపల్లిలో జరుగుతున్న అమృత్‌భారత్ పనుల పురోగతిని తెలుసుకుంటారు. అనంతరం కాజీపేటకు వెళ్తారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో నెలకొన్న రైల్వే సమస్యలపై కథనం.

**ముందుకు సాగక..**

పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో రూ.26.49 కోట్లతో చేపట్టిన అమృత్ భారత్ అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. రెండుసార్లు స్టేషన్ నమూనాను మార్చారు. కొత్త భవన నిర్మాణం కోసం పాత భవనం కూల్చివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండో ప్లాట్‌ఫాంపై శౌచాలయం లేదు. టికెట్ బుకింగ్ కోసం నిర్మించిన తాత్కాలిక షెడ్డు నుంచి ప్లాట్‌ఫాం మీదకు వెళ్లేందుకు కవరింగ్ షెడ్లు, దీపాలు లేకపోవడంతో రాత్రిళ్లు, వర్షాలు కురిసిన సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. రామగుండంలో చేపట్టిన అమృత్‌భారత్ పనులు 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి స్టేషన్‌లో క్రమంగా రైళ్ల హాల్టింగ్‌లు ఎత్తివేయడంతో ఈ ప్రాంతంలోని పది గ్రామాల ప్రజలకు రైలు సౌకర్యం లేకుండా పోయింది.

**నత్తనడకన ఆర్వోబీ నిర్మాణాలు**

పెద్దపల్లిలోని కూనారం ఆర్వోబీ పనులు 2022లో మొదలవగా భూసేకరణ జరగకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి వద్ద చేపట్టిన ఆర్వోబీ పనులు నత్తతో పోటీపడుతున్నాయి. పెద్దపల్లి స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు నిర్మించిన బైపాస్ రైల్వే లైన్ నిర్మాణం జరిగినప్పటికీ కమిషనింగ్(ట్రయల్ రన్) జరగకపోవడంతో వినియోగంలోకి రాలేదు. బైపాస్ లైన్‌లో టౌన్ రైల్వేస్టేషన్ నిర్మాణంపై స్పష్టత లేకుండా పోయింది.

**హాల్టింగ్‌లకు మోక్షం కలిగేనా!**

పెద్దపల్లి నుంచి కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు కనెక్టివిటీ లేకుండా పోయింది. తమిళనాడులోని చెన్నై మినహా ఇతర ప్రాంతాలకు డైలీ కనెక్టివిటీ లేదు. వారానికి ఒకసారి నడిచే మన్నార్‌గుడి, కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్, కేఎస్సార్ బెంగళూర్ ఎక్స్‌ప్రెస్‌లు మినహా ప్రత్యామ్నాయం లేదు. పెద్దపల్లిలో కాశీ తమిళ సంఘం ఎక్స్‌ప్రెస్, పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్, జోద్‌పూర్, వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్, ఏపీ సంపర్క్‌క్రాంతి, కేరళ ఎక్స్‌ప్రెస్‌లు, రామగుండంలో తమిళనాడు, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్‌లు కల్పించాలనే ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు.

# ఆయిల్‌పామ్‌లోకి తెచ్చేందుకు..!

నకిరేకల్: ఆయిల్‌పామ్ సాగులో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. సాగులో వేగాన్ని పెంచేందుకు కసరత్తులు చేస్తున్నారు. మంత్రి సూచనలతో ఉద్యాన శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని సంయుక్త సంచాలకుల(జేడీ)కు ఒక్కొక్కరికి ఐదు జిల్లాల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. నల్గొండ జిల్లా ఉద్యాన పంటల సాగు, పథకాల అమలు అధికారి జేడీ బి.బాబు.. తాజాగా నల్గొండలో ఉమ్మడి జిల్లా స్థాయి ఉద్యాన అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయిల్‌పామ్‌తో పాటు ఉద్యాన పంటల సాగుపై సమీక్ష నిర్వహించారు. పది రోజుల్లో పురోగతి సాధించాలని లక్ష్యాలు విధించారు.

**జిల్లాలో ఇలా..** నల్గొండ జిల్లాలోని 33 మండలాల్లో ఇప్పటి వరకు 10,827.10 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగవుతున్నాయి. 2025-26 సంవత్సరానికి మరో 6,500 ఎకరాల్లో ఈ సాగును ప్రోత్సహించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. నెలవారీగా ఎన్ని ఎకరాల్లో మొక్కల ప్లాంటేషన్ పూర్తి చేయాలో కూడా సూచించింది. జూన్‌లో దాదాపు వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటించాల్సి ఉంది. ఇప్పటి వరకు 650 ఎకరాలను గత నెలలో సాగులోకి తీసుకొచ్చారు. వర్షాలు ఆలస్యం కావడం, వాతావరణంలో వేడి, రైతులు ఇతర సాగుపనుల్లో నిమగ్నం కావడం వంటి అంశాలు జూన్‌నెల ఆయిల్‌పామ్ మొక్కల ప్లాంటేషన్ లక్ష్యాలపై కొంత ప్రభావం చూపాయని అధికారులు అంటున్నారు.

# టెండర్ నిర్వహణ.. ఒప్పందం విస్మరణ

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పలు ప్రాంతాల్లో రూ.50 కోట్ల మేర పనులు చేసేందుకు సాధారణ నిధులతో టెండర్లు పిలిచారు. డివిజన్లలో నిలిచిపోయిన రోడ్లు, మురుగుకాలువలకు సంబంధించిన పనులు చేసుకోవడానికి గత పాలకవర్గ సభ్యులు తీర్మానం కూడా చేశారు. ఆ పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకొస్తుండగా.. ఒప్పందం చేసేందుకు కొందరు ఇంజినీరింగ్ అధికారులు మాత్రం జాప్యం చేస్తున్నారు.

**గుత్తేదారులు డీడీలు చెల్లించినా..**

అభివృద్ధి పనులు చేసేందుకు గుత్తేదారులు డీడీలు కూడా చెల్లించారు.



ఆ మొత్తం బల్దియా ఖజానాలో జమ అయినప్పటికీ ఒప్పందం చేసే ఇంజినీరింగ్ అధికారులు మాత్రం జాప్యం చేస్తున్నారు. అలా ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కాక గుత్తేదారులు అయోమయంలో పడుతున్నారు. కొన్ని చోట్ల పనులు కూడా ప్రారంభించగా ఒప్పందం చేసుకోకుండా ఎలా చేస్తారని బెదిరింపులకు గురి చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

**అధికారుల వద్దే దస్త్రాలు**

టెండర్ నిర్వహించి ఒప్పందం చేసుకోవాల్సిన దస్త్రాలు ఇంజినీరింగ్ అధికారుల వద్దే ఉన్నాయి. ఓ వైపు రహదారులు మురుగుకాలువల పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, కొందరు ఇంజినీర్లు మాత్రం మోకాలడ్డు పెట్టడం వివాదాస్పదంగా మారుతోంది. పనులు చేయకుండా ఆపడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న మాజీ పాలకవర్గ సభ్యులు మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు.

**కమిషనర్ ఆదేశాలతో..**

ప్రాధాన్యం ప్రకారం పనులు చేయాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. సాధారణ నిధులతో గతంలో చేపట్టిన పనులకే రూ.కోట్లు నిధులు చెల్లించాల్సి ఉంది. సంజయ్‌కుమార్, ఈఈ, నగరపాలిక

# సంపుతున్నయ్ జాగ్రత్త

సిరిసిల్ల : కుళాయి నీటిని ఒడిసిపట్టేందుకు ఇళ్ల ఆవరణలో సంపులు నిర్మిస్తుంటారు. ఈ మధ్య ప్రతి ఇంటికి ఇవి తప్పనిసరిగా మారాయి. తొట్టిల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, నీటితో ఆడుకునేందుకు ఇష్టపడే చిన్నారుల పాలిట మృత్యువుగా మారుతున్నాయి. ఎద్దడిలో నీటి నిల్వకు ఏర్పాటు చేసుకున్న తొట్లు ప్రాణాలను హరిస్తున్నాయి. భవన నిర్మాణ ప్రదేశాల్లో నీటితొట్టిలు, సెప్టిక్ ట్యాంకులపై పైకప్పు వేసేలా సంబంధిత పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అధికారులు పర్యవేక్షణ చేయాలని.. నిర్లక్ష్యం చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**తల్లిదండ్రులూ.. తస్మాత్ జాగ్రత్త**

బాల్యంలో చిన్నారులు నీటితో ఆడుకునేందుకు ఇష్ట పడుతుంటారు. అదే భావనతో తెరిచి ఉన్న నీటి సంపుల వద్దకు వెళ్లి ఆడుకునే క్రమంలో అందులో పడిపోతున్నారు. సంపుకు దూరంగా ఉండేలా చిన్నారులకు భయం చెప్పాలి. పెద్ద పిల్లలయితే అందులో పడితే జరిగే ప్రమాదంపై అవగాహన కల్పించాలి. జ్ఞానం రాని చిన్నారులపై నిత్యం తల్లితండ్రులు పర్యవేక్షణ ఉంచాలి.

పిల్లల ముందు సంపులను శుభ్రపరిచే పని పెట్టుకోకపోవడం మంచిది. అనుకరించి తర్వాత అందులో పడే ఆస్కారం ఉంటుంది.

సంపులను కడిగే క్రమంలో, నీటి నిల్వలు పరిశీలించిన పిదప తప్పనిసరిగా మూతను పెట్టాలి. ఆ విషయంలో ఏమరపాటు వద్దు. అవసరమైతే సంపులపై ఇనుప కంచె ఏర్పాటు చేయాలి. పైన ఏర్పాటు చేసిన సిమెంటు పలకలు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలి. భవన నిర్మాణ పనులు చేపట్టే చోట సంపులు, సెప్టిక్ ట్యాంకులపై పైకప్పు వేయకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. పనిచేసే వారితోపాటు తోడుగా తెచ్చుకున్న పిల్లలు ఆడుకుంటూ పడిపోయే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు చిన్నారులు ఆడుకునే సమయంలో పొంచి ఉన్న



ప్రమాదాలను పసిగట్టాలి. బయట ఆడుకునేటప్పుడు ఎలాంటి పనులపై నిమగ్నం కాకుండా నిత్యం పర్యవేక్షించాలి.

మచ్చుకుకొన్ని ఘటనలు

వేములవాడ మండలం చింతల్ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన ఆరేళ్ల బాలుడు రుషి శనివారం స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. ఆడుకునే సమయంలో పొరపాటున నీటి సంపులో పడిపోయాడు. తనతో వచ్చిన పిల్లలు పరిగెత్తి ఇంట్లో వారిని తీసుకొచ్చేలోపే ప్రాణాలు కోల్పోయాడు. గతేడాది డిసెంబరు నెలలో గంభీరావుపేట మండలం నర్మాలలో 18 నెలల చిన్నారి ఇంటి బయట ఆడుకుంటోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయి మృతి చెందింది. గత సంవత్సరం జులైలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ అనుబంధ గ్రామం గాజులపల్లిలో శ్వేహాన్ (3) ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. చేతిలో ఉన్న పలక మూత లేని నీటి తొట్టిలో పడింది. అది మృత్యు కుహరం అని తెలియక బాలుడు పలకను తీసే యత్నంలో అందులో పడ్డాడు. బాలుడి కోసం వెతికిన చూసిన తల్లికి సంపులో శవమై కనిపించాడు.

చురకలు



# పల్లె జనం.. అందని శుద్ధజలం

కర్నూలు : వానాకాలం మొదలైంది... కొత్త నీరు రావడం.. తాగునీరు కలుషితం కావడం వల్ల రోగాలు ప్రబలుతున్నాయి. పల్లెల్లో తాగునీటి ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండటం వల్ల అతిసారం ప్రబలుతోంది. క్షేత్రస్థాయిలో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్యశాఖలు ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

**ఇదీ పరిస్థితి..** ఆస్పరి మండలం కైరుప్పల, తంగరడోణ గ్రామాల్లో సుమారు ఆరువేలకు పైగా జనాభా ఉంది. ఈ గ్రామాల్లో నీటి ట్యాంకులు శుభ్రం చేయడం లేదు. నీరు కలుషితమై ప్రజలు అతిసారం బారిన పడే ప్రమాదం ఉంది. ఆదోని మండలంలోని హనువాలు, ఢణాపురం గ్రామాల్లోని నీటి ట్యాంకులు శుభ్రం చేయక సుమారు రెండు నెలల పైనే అయింది. ఈ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శి అక్కడ పనిచేసే ఏఎన్ఎం, ఆ మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి.

మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో గతంలో తాగునీరు కలుషితం కావడం వల్ల అతిసారం ప్రబలి 30మంది అనారోగ్యం పాలయ్యారు. ఈ గ్రామంలో సుమారు వారం రోజుల పాటు వైద్యశిబిరం నిర్వహించారు. అత్యవసర పరిస్థితిలో దినేష్, అభిరామ్‌ను



సర్వజన వైద్యశాలకు తరలించి పిడియాట్రిక్ విభాగంలో చికిత్సలు అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

జులై 21న ఓర్వకల్లు మండలంలోని కన్నమడకల గ్రామంలో ఒకేరోజు పది మంది అతిసారం బారిన పడ్డారు. బీసీ కాలనీలోని నీటి ట్యాంకు కలుషితం కావడంతో వారు అస్వస్థతకు గురయ్యారు.

**తాగునీటితోనే ముప్పు**

జిల్లాలో నేటికీ చాలా గ్రామాల్లో శుద్ధజలం అందడం లేదు. మంత్రాలయం మండలం సుంకేశ్వరి, కన్నమడకల గ్రామాల్లో అతిసారం ప్రబలడానికి నీటి ట్యాంకుల నుంచి సరఫరా అయిన తాగునీరే కారణమని వైద్యఆరోగ్యశాఖాధికారులే నివేదికలు సమర్పించారు. వైద్యశిబిరాలు నిర్వహించి చేతులు దులుపుకొన్నారు. ఇకనైనా ట్యాంకుల శుభ్రం, నీటి పరీక్షల తదితరాలపై పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్యశాఖ అధికారులు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.

**శుభ్రత తేదీల్లేనే..**

జిల్లా వ్యాప్తంగా 740 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో తాగునీటి ట్యాంకును గ్రామ కార్యదర్శి అక్కడున్న సిబ్బందితో 15 రోజులకోసారి శుభ్రం చేయించాలి. నీటిని క్లోరినేషన్ చేయాలి. శుభ్రం చేసిన తేదీ, భవిష్యత్తులో చేయాల్సిన తేదీలు ట్యాంకుపై నమోదు చేయాలి. నెలలో రెండు సార్లు శుభ్రం చేయాలి. సరఫరా చేస్తున్న నీరు తాగేందుకు పనికి వస్తుందా? లేదా కలుషితం అయిందా? అని అక్కడ ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్య కార్యకర్త నీటి నమూనాలను తరుచూ పరీక్షలకు పంపాలి. అందుకు భిన్నంగా జిల్లాలోని చాలా గ్రామాల్లో రెండు, మూడు నెలలకోసారి మొక్కుబడిగా శుభ్రం చేయడం తప్ప నిబంధనల ప్రకారం చేసిన దాఖలాలు లేవు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తాగునీటి పరీక్షలపై దృష్టిసారించడం లేదు.

# శిథిలావస్థలో ఆయుర్వేద వైద్యశాల

బేస్తవారపేట: మండలంలోని పిటికాయగుళ్లలోని ఆయుర్వేద వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వైద్య సిబ్బందితో పాటు వైద్యం కోసం వచ్చే రోగులు సైతం బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ కనీస సౌకర్యాలు సైతం కరవైపోవడంతో అరకొర వసతుల నడుమనే రోగులకు సేవలందించేందుకు వైద్య సిబ్బంది నానా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. సుమారు 30 ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో కిటికీలు ఊడిపోయి ఉన్నాయి. తలుపులు నెట్టితే పడిపోయేలా కనిపిస్తున్నాయి. మరుగుదొడ్లు మరమ్మతులకు గురై వినియోగించేందుకు వీలు లేకుండా పోవడంతో కాలకృత్యాలకు సిబ్బంది అవస్థలు పడుతున్నారు.



వైద్యశాలలో నేటికి విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో లైట్లు, ఫ్యాన్లు ఉన్నప్పటికీ అవి పనిచేయని పరిస్థితి. వైద్యశాల ఆవరణంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. నీటి వసతి లేదు. కూర్చునేందుకు బెంచీలు, కుర్చీలు లేకపోవడంతో వచ్చిన రోగులు నేలపైనే నడుము వాల్చాల్సిన పరిస్థితి నెలకొంది.

**వైద్యుడు లేక ...తగ్గిన ఓపీ**

వైద్యశాలకు మెడికల్ ఆఫీసర్, ఎంఎన్‌వో, కంపౌండర్ తదితర మూడు పోస్టులు కేటాయించాల్సి ఉండగా అక్కడ కేవలం మెడికల్ ఆఫీసర్ పోస్టును మాత్రమే భర్తీ చేశారు. ఇటీవలే ఆయన పదవీవిరమణ పొందగా ఆయన స్థానంలో మరో వైద్యుడు వచ్చి కొన్నాళ్లకే మళ్లీ టంగుటూరుకు బదిలీపై వెళ్లారు. దీంతో ప్రస్తుతం అక్కడ ఎంఎన్‌వో (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ) సిబ్బంది ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉంచారు. కొన్నాళ్లుగా మందుల కొరత సైతం వేధిస్తోంది. ఒకరిద్దరు వచ్చినా సరిపడినన్నీ మందుల రకాలు లేక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

**నిధులు మంజూరైతేనే...** గతంలో ఆయుష్మాన్‌భారత్ కింద పలు వైద్యశాలల మరమ్మతుల కోసం ఒక్కో వైద్యశాలకు రూ.3.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాగా ఆసమయంలో ఈ వైద్యశాల ఎంపిక కాలేదు.రెండో దశలోనైనా ఎంపికైతే వైద్యశాలకు మరమ్మతులతో పాటు పలు సౌకర్యాల కల్పనకు వీలుంటుంది. గురువారెడ్డి, ఎంఎన్‌వో, ఆయుర్వేద వైద్యశాల, పిటికాయగుళ్ల

# ఆక్రమణలు అంతేనా.. తొలగింపు ఓ తంతేనా!!



కుప్పం : నగరంలో అత్యంత విలువైన పార్కులు, ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆపరేషన్ లంగ్స్ (లైఫ్ టు అర్బన్ (గ్రీన్ స్పేసెస్) పేరిట జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు నాలుగు రోజుల క్రితం వాటి పరిరక్షణకు చర్యలు ఆరంభించారు. అయితే... ఆ తరువాత ప్రక్రియ నెమ్మదించింది. మిగిలి ఉన్న ఆక్రమణల జోలికి వెళ్లకపోవడంతో వాటిని వదిలేస్తారా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. మొత్తం 48 పార్కులు, ఖాళీ స్థలాల్లో ఆక్రమణలున్నాయని పట్టణ ప్రణాళికాధికారులు గుర్తించారు. కేవలం 15 చోట్లే తొలగించారు. న్యాయస్థానాల్లో వివాదాలున్నవి మినహా.. మిగిలినవి స్వాధీనం చేసుకోవడంతోపాటు పరిరక్షణకు ప్రహరీలు నిర్మించాల్సి ఉంది. చాలా చోట్ల ప్రభుత్వ స్థలాలకు నకిలీ పత్రాలు సృష్టించి... తరువాత పన్నులు కట్టి అది తమదేనని నమ్మించి నిర్మాణాలకు ప్లాన్‌లతో దరఖాస్తు చేస్తున్నారు. నగరంలోని అత్యంత విలువైన లాసన్స్‌బే కాలనీలోని సర్వే నెంబరు 17లో 726 గజాల స్థలం (విలువ దాదాపు రూ. రూ. 14.52 కోట్లు)ను ప్రయివేటు వ్యక్తి తన స్వాధీనంలోకి తీసుకున్నా పట్టణ ప్రణాళికాధికారులు పట్టించుకోలేదు. ఇక్కడ కలెక్టర్ పేరిట గతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా లెక్కచేయలేదు. స్థలాన్ని చదును చేసి కాంక్రీట్‌తో నేలను గట్టిగా చేశారు. అనంతరం రేకుల షెడ్డు నిర్మించి, అక్కడ పశువులను కట్టి వ్యాపారం చేశారు. దీనిపై అనేక ఫిర్యాదులు వచ్చినా పట్టణ ప్రణాళికాధికారులు పట్టించుకోలేదు. ఇటీవలే ఈ స్థలానికి వెళ్లే రహదారిని కొత్తగా నిర్మించడం గమనార్హం. గెడ్డకు ఆనుకుని ఈ స్థలం ఉన్నా... ఎలాంటి ఇబ్బంది లేకుండా గెడ్డ ఆధునికీకరణ పనులు పూర్తికావడంతో రక్షణ గోడ కూడా సమకూరినట్లయింది. అధికారుల తీరుపై విమర్శలు రావడంతో రంగంలోకి దిగారు. ఈ స్థలం వ్యవహారంపై న్యాయస్థానంలో కేసు ఉందని అక్కడ రాసి ఉన్నా..అందులో జీవీఎంసీ పార్టీ కాకపోవడంతో పట్టణ ప్రణాళికాధికారులు సునాయాసంగా తొలగించగలిగారు. దీనిపై జోన్–3 సహాయ ప్రణాళికాధికారి మధుసూదనరావును వివరణ కోరగా.. గెడ్డ, పోరంబోకు స్థలం కావడంతో ఆక్రమణలు తొలగించామని, మరోసారి కబ్జాకు గురికాకుండా కాపాడతామని పేర్కొన్నారు.

# ఉమ్మడి ఎల్‌పీఎం కష్టాలకు పరిష్కారం




చిత్తూరు : గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సమగ్ర భూముల రీసర్వేతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వే నంబర్ల స్థానంలో అప్పటి ప్రభుత్వం ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)ను అమల్లోకి తీసుకొచ్చింది. ఐదారుగురు రైతులకు కలిపి ఉమ్మడి ఈ సంఖ్య కేటాయించారు. దాని ఆధారంగా భూహక్కు పత్రాలు అందజేశారు. అప్పట్నుంచి రైతుల కష్టాలు మొదలయ్యాయి. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఉమ్మడి ఎల్‌పీఎంల విభజనకు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అవకాశం కల్పించింది. గడు వు ముగిసినా ఇంకా పెద్ద సంఖ్యలో రైతులు మిగిలిపోవడంతో దరఖాస్తు గడువును డిసెంబరు 31 వరకు పొడిగించింది. జిల్లాలో 319 గ్రామాల్లో రీసర్వే జరగగా, 34,877 ఎల్‌పీఎం ఖాతాలు ఉన్నట్లు గుర్తించారు.

**సమస్యలిలా..**

భూవివరాలు సర్వే నంబర్లు, వాటి సబ్ డివిజన్ల వారీగా ఉండేవి. రీసర్వే జరిగిన గ్రామాల్లో కొత్తగా ఎల్‌పీఎం సంఖ్య విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో ఆ సంఖ్య కింద ఉన్న భూమి ఆ రైతులందరికీ చెందినదిగా ఆన్‌లైన్ చూపిస్తుండటంతో సమస్యలు మొదలయ్యాయి. ఫలితంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ పథకాలకు సంయుక్త ఎల్‌పీఎంలు ప్రతిబంధకాలుగా మారాయి. ఇద్దరు, ముగ్గురు రైతులకు చెందిన భూములు ఉండటంతో వారంతా విస్తీర్ణం ఎక్కువగా ఉందని అనర్హులుగా మారారు. బ్యాంకుల నుంచి రుణాలు కూడా రాని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ సదస్సుల్లోనూ పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి.

**పరిశీలన ఇలా..**

జాయింట్ ఎల్‌పీఎం ఉన్నవారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరో సంఖ్య కేటాయిస్తారు. గతంలో విభజనకు రూ.500 రుసుం కాగా, రైతుల సౌకర్యార్థం రూ.50కి తగ్గించారు. గతంలో అవకాశం కల్పించినా గ్రామస్థాయిలో అవగాహన లేక రైతులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ప్రభుత్వం రెండోసారి అవకాశం కల్పించిన నేపథ్యంలో సర్వేయర్లు, వీఆర్వోలు రైతులకు సమాచారాన్ని చేరవేసి ఉమ్మడి ఎల్‌పీఎం సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

**క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతుంది**

– జయరాజ్, ఏడీ సర్వే శాఖ

రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత గ్రామ సర్వేయర్‌కి చేర్చి ప్రాథమిక సర్వే చేయిస్తున్నాం. ఇప్పటికీ 1086 ఎల్‌పీఎంలను పరిష్కరించాం. పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం చేస్తాం.

# రోగులకు నావ.. ఎన్టీఆర్ వైద్యసేవ




తిరుపతి : ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు (ఆరోగ్యశ్రీ) సేవలు రోగులకు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలోని నెట్వర్క్ ఆస్పత్రుల ద్వారా 3,257 రకాల వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయి. పేదలే కాదు కార్డులున్న ఉన్నతస్థాయి వర్గాల వారూ సేవలు పొందుతున్నారు. కార్డు లేని అర్హులకు కూడా వైద్యసేవలకు సీఎంవో అనుమతులు ఇప్పిస్తున్నారు.

**కార్డు లేకుంటే ఎవరిని సంప్రదించాలి?:** ఆరోగ్యశ్రీ కార్డు లేని అర్హులు అనారోగ్యానికి గురైై నెట్వర్క్ ఆస్పత్రులకు వెళ్లి ఆరోగ్యమిత్రలను సంప్రదించాలి. వారు జిల్లా సమన్వయకర్త కార్యాలయానికి వివరాలు తెలియజేస్తారు. అర్హతను పరిశీలించి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి అధికారికంగా అనుమతులు తీసుకుని వైద్యసేవలు అందేలా చర్యలు చేపడతారు. జిల్లాలో ప్రతి రోజూ 20–30 మందికి అనుమతులిస్తున్నారు. ప్రధానమంత్రి జన ఆరో గ్య యోజన్ కార్డుదారులు జిల్లాలో 6.61 లక్షల మంది ఉన్నారు. వీరు దేశంలో ఎక్కడైనా ఒప్పందం చేసుకున్న ఆస్పత్రుల్లో వైద్యం పొందొచ్చు.

**వీరంతా అర్హులే:** 'ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు ఉన్న కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు అందుతాయి. చెవుడు, మూగ సమస్యలతో పుట్టిన వారు రూ.12 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. క్యాన్సర్ రోగులకు అపరిమిత వైద్యం అందించే ఏర్పాట్లున్నాయి. రూ.వెయ్యి దాటితే ఈహెచ్ఎస్‌లో 836.. ఆరోగ్యశ్రీలో 3,257 రోగాలకు ఉచిత వైద్యం వర్తిస్తోంది. వార్షిక ఆదాయం రూ.5లక్షలు అంతకన్నా తక్కువ ఉండే వారంతా అర్హులు. 12 ఎకరాల్లోపు మాగాణి, 35 ఎకరాల్లోపు మెట్ట, మాగాణి – మెట్ట కలిపి 35 ఎకరాల్లోపు ఉన్న రైతులు అర్హులు. శాశ్వత ఉద్యోగి లేదా పింఛనుదారులు మినహా రూ.5 లక్షల వార్షిక ఆదాయం కలిగిన ఇతర ఉద్యోగులంతా ఈ పథకంలో చేరవచ్చు. కుటుంబం అంతటికీ ఒక కారున్నా ఇబ్బంది లేదు. పురపాలిక పరిధిలో 3వేల చదరపు అడుగులు అంతకన్నా తక్కువ ఆస్తి పన్ను చెల్లించిన వారూ పేర్లు నమోదు చేసుకోవచ్చు' అని ట్రస్టు సమన్వయకర్త డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి పేర్కొంటున్నారు.

**ఆరోగ్య మిత్రల వ్యవస్థ:** ట్రస్టు పరిధిలోని ఆసుపత్రిలో ఆరోగ్యమిత్రల వ్యవస్థ ఉంది. పూర్తి ఉచితంగా సేవలు అందించి డిశ్చార్జ్ తర్వాత రవాణాఛార్జీలు అందజేస్తారు. ఐవీఆర్ఎస్ ద్వారా రోగుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. అదనంగా డబ్బులు తీసుకుంటే 104, 14400 టోల్‌ఫ్రీ నంబర్లు, పీజీఆర్ఎస్, ఆరోగ్యమిత్రలకు ఫిర్యాదు చేయవచ్చు.

ట్రస్టు పరిధిలోని ఆస్పత్రులు ప్రైవేట్ – 38 ప్రభుత్వ జిల్లా – 2 ప్రాంతీయ – 2 పీహెచ్‌సీలు – 57 సీహెచ్‌సీలు – 10తితిదే – 3 రోజూ జరిగే శస్త్రచికిత్సలు – 70 నుంచి 90

# గుట్టలు తవ్వుతూ.. గుట్టుగా తరలిస్తూ..!

కుప్పం : వర్షాలు లేక చెరువులన్నీ ఇంకిపోయాయి. తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్న తరుణం.. చెరువులు ఖాళీ కావడంతో అక్రమార్కులు మట్టిని తవ్వి కృత్రిమ ఇసుక కేంద్రాలకు తరలిస్తున్నారు. ఆపై ఇసుకగా మార్చి తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్జనకు తెర తీస్తున్నారు. కుప్పం పురపాలిక పరిధిలో పలు చెరువులు, గుట్టలు, ప్రభుత్వ భూముల్లో వైకాపా పాలనలో భారీ ఎత్తున తవ్వకాలు జరిపారు. ప్రస్తుతం మళ్లీ తవ్వకాలు ప్రారంభమైనా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండట విమర్శలకు తావిస్తోంది. కుప్పం పురపాలికతోపాటు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లోని ప్రభుత్వ భూములు, బండలున్న ప్రాంతాల్లో మట్టిని ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. దీంతో భారీ ఎత్తున గుంతలు పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పురపాలిక పరిధిలోని కుప్పం చెరువు, దళవాయికొత్తపల్లె, గెర్సిబాయి, లక్ష్మీపురం, శీగలపల్లె, పరమ సముద్రం తదితర చెరువుల్లో నిత్యం మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి.**కృత్రిమ ఇసుక కేంద్రాలకు..**ఐదేళ్ల వైకాపా పాలనలో కృత్రిమ ఇసుక తయారీ కేంద్రాలు భారీ ఎత్తున వెలిశాయి. అప్పుడు నిర్వహిస్తున్న వారే ఇప్పటికీ కృత్రిమ ఇసుక కేంద్రాలు కొనసాగిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు చిట్టిబాబును వివరణ కోరగా.. అనుమతి లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని, తవ్వకాలు జరిగే స్థలాలను పరిశీలిస్తామన్నారు.

# మిర్చి.. ఏమార్చి!

ఒంగోలు : జిల్లాలో పొగాకు తరువాత మిర్చి పంట పెద్దఎత్తున సాగవుతోంది. మొక్క దశ నుంచే మిరప రైతులకు కష్టాలు ఎదురవుతున్నాయి. నర్సరీల నుంచి నారు తెచ్చి నాటేస్తున్నారు. వాటి నాణ్యత ఎంత...దిగుబడులు ఎలాగనేది చెప్పేవారు లేక నిలువునా మోసపోతున్నారు. పర్యవేక్షించాల్సిన వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు దస్త్రాల పరిశీలనకే పరిమితమవుతున్నారు.

జిల్లాలో త్రిపురాంతకం, కుంట, గిద్దలూరు ప్రాంతాల్లో 400కుపైగా నర్సరీలు ఉన్నాయి. నిర్వహణలో లోటుపాట్లను ఉద్యానశాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. నర్సరీ రిజిస్ట్రేషన్, నవీకరణ, దస్త్రాల పరిశీలన చేపడుతుంటారు. అరకొర సిబ్బంది, ఇతర వ్యాపకాల్లో మునిగిపోవడంతో నర్సరీల్లో నిర్వహణ ఎలా ఉందన్నదానిపై అధికారులు అలక్ష్యం వహిస్తున్నారు. ధ్రువీకరించిన విత్తనాలు వాడుతున్నారా.. లేదా..అనేది పరిశీలించడంలేదు. ప్రస్తుతం మిరప నారు కొద్దిచోట్ల



ఇప్పటికే వేయగా, మరికొన్నిచోట్ల ప్రారంభించారు. ఈ సమయంలోనే వాడుతున్న విత్తనాలపై ఆరా తీస్తే రైతులకు మేలు జరుగుతుంది. గత అనుభవాలు చూస్తే రైతులు నష్టపోయిన సందర్భాలున్నాయి. గతంలో త్రిపురాంతకం, మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంతాల్లోనూ రైతులు నకిలీ మిర్చి విత్తనాలు నాటి నష్టపోయారు. ఈ ఏడాదైనా ముందుగా దృష్టిసారిస్తే నకిలీ విత్తనాలు అరికట్టి నాణ్యమైన నారు అందించవచ్చు.

**అవగాహన కల్పించాం:** విత్తనాలకు సంబంధించి రసీదు, లాట్ నంబరు తప్పనిసరిగా ఉండాలని చెబుతున్నాం. విత్తన శుద్ధి, చీడపీడల నివారణ.. నారు పెంపకంలో జాగ్రత్తలపై శాస్త్రవేత్తలతో నర్సరీ యజమానులకు అవగాహన కల్పించాం. ధ్రువీకరించబడిన విత్తనాలు నాటేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం.

వై.గోపీచంద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

# కాన్పుకొస్తే కోతే!

మార్కాపురం : పశ్చిమ ప్రకాశం ప్రాంతంలోని మార్కాపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు సుఖ ప్రసవాల కంటే శస్త్రచికిత్సలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సుఖ ప్రసవాలు చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వైద్యశాలకు మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల మండలాలు, నంద్యాల జిల్లా శ్రీశైలం, సున్నిపెంట, ఆత్మకూరు ప్రాంతాల నుంచి ఎక్కువమంది గర్భిణులు కాన్పుల నిమిత్తం వస్తుంటారు. బయట ప్రైవేటు వైద్యశాలల్లో రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుందని అధిక శాతం మంది పేదలు ఇక్కడకు తరలివస్తుంటారు.

మార్కాపురం డివిజన్ పరిధిలో గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెం, దోర్నాల, ప్రాంతాల్లోని వైద్యశాలల్లో ఎక్కువ శాతం కాన్పులు జరగడంలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అయితే నెలకు ఒక్కటి



మాత్రమే జరుగు తోంది. అది కూడా కాన్పు అత్యవసరమైతే తప్పా, ఆ కేసును కూడా మార్కాపురం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ఆయా వైద్యశాలల్లో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సుఖ ప్రసవాలు జరగడంలేదు. ఆసుపత్రిలో రోజుకు అన్ని రకాల ఓపీలు కలిపి 450 నుంచి 500 వరకు నమోదవుతోంది. వైద్యశాలలో గర్భిణుల శస్త్రచికిత్స కాన్పులు నెలకు సగటున 120 వరకు జరుగుతుండడం, సుఖ ప్రసవాలు 50కు మించకపోవడం గమనార్హం. సాధ్యమైనంత వరకు సుఖ ప్రసవాలు చేసి తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలని రాష్ట్ర మంత్రుల నుంచి రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల వరకు ఆదేశాలు జారీ చేస్తున్నా ఇక్కడ అమలు కావడంలేదు. ఇక్కడ వైద్యులు ఎక్కువగా శస్త్రచికిత్సల ద్వారా బిడ్డలను బయటకు తీయడానికి ఆసక్తి చూపిస్తున్నట్లు కాన్పుల గణాంకాలు చూస్తే అర్థమవుతోంది,.. గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది జూన్ వరకు 1,594 శస్త్రచికిత్సలు చేసి కాన్పులు చేశారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు సుఖ ప్రసవాలకే ప్రాధాన్యమిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లోనే శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తోందని తెలిపారు.

# రైతులను కా'పాడి'కోవాలని!

ఒంగోలు : గ్రామాల్లో వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాడి పరిశ్రమకు మరింత చేయూతనిచ్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరం తరహాలోనే ప్రస్తుత ఏడాది కూడా ఉపాధిహామీ పథకం నిధులతో పాడి రైతులకు మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయి. దీంతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. పశుపోషకులకు 90 శాతంబీ జీవాలు, కోళ్ల పెంపకం దారులకు 70 శాతం మేర రాయితీ ఇవ్వనున్నారు. పశువుల షెడ్డు నిర్మాణ నిమిత్తం యూనిట్ వ్యయాన్ని రూ.1.15 లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకు కేటాయించారు. జిల్లాలో మొత్తం 729 గ్రామ పంచాయతీలుండగాబీ 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రతి పంచాయతీకి రెండు చొప్పున మొత్తం 1,458 యూనిట్లు కేటాయించారు. ఈ మేరకు తాజాగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆసక్తి ఉన్న పాడి రైతుల నుంచి స్థానిక పశు వైద్యాధికారులు లేదా ఉపాధిహామీ ఏపీవోలు దరఖాస్తులు స్వీకరించి మంజూరుకు ప్రతిపాదించనున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సొంత స్థలం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు తొలి ప్రాధాన్యమివ్వనున్నారు.

గతేడాది 843 పూర్తి : 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మినీ గోకులం పథకం కింద జిల్లాకు మొత్తం 1,075 షెడ్లు మంజూరు చేశారు. ఇందుకు మూడింతలు అర్జీలొచ్చాయి. ఒక్కో యూనిట్‌కు సరాసరిన ముగ్గురికిపైగా పోటీ పడటంతో స్థానిక ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అందులో ఇప్పటివరకు 843 పూర్తికాగాబీ మరో 181 షెడ్లు పలు దశల్లో పురోగతిలో ఉన్నాయి. లబ్ధిదారులకు కూడా ఇటీవల బిల్లులు జమ కావడంతో ఈ ఏడాది ఎక్కువ మంది షెడ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపనున్నారు. షెడ్ల నిర్మాణానికి అవసరమైన సొంత స్థలం రైతులు కలిగి ఉండాలి.

# పాలన సాగక.. పర్యవేక్షణ మరచి

చిత్తూరు : విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నా పాఠశాలల పర్యవేక్షణకు రెగ్యులర్ అధికారులు లేక విద్యావ్యవస్థ గాడితప్పుతోంది. మండల స్థాయిలో పర్యవేక్షణకు ఎంఈవోలు, డివిజన్ స్థాయిలో డీవైఈవోలు పనిచేయాలి. అయితే వివిధ కారణాలతో చాలా మండలాల్లో ఇన్‌ఛార్జుల పాలనే కొనసాగుతుంది. గ్రేడ్–2 హెచ్ఎంలకు ఎంఈవో–1 బాధ్యతలు అప్పగించడంతో వారు.. రెండు వైపులా న్యాయం చేయలేపోతున్నారనే వాదనలు ఉన్నాయి. మరోవైపు డీవైఈవోలంతా తాత్కాలికంగా సర్దుబాటులో వచ్చిన వారే.

**మండల కేంద్రాలకే పరిమితం**

సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలోని శాంతిపురం ఎంఈవో–1 పోస్టు ఏడేళ్లకు పైగా ఖాళీగా ఉంది. ఇటీవల ఆ స్థానాన్ని ఇన్‌ఛార్జితోనే భర్తీ చేశారు. ఇలాంటి మండలాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 22కు పైగా ఉన్నట్లు విద్యాశాఖ చెబుతుండగా.. ఆ సంఖ్య మరింత అధికంగా ఉందని విద్యా నిపుణులు చెబుతున్నారు. మండల విద్యాశాఖాధికారుల పోస్టులను పక్క మండలాల ఎంఈవోలకు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వారు ద్విపాత్రాభినయం చేస్తూ పాలన, పర్యవేక్షణకు న్యాయం చేయలేక మండల కేంద్రాలకే పరిమితమవుతున్నారు. వివిధ కార్యక్రమాలు, యాప్‌ల్లో సమాచారం నమోదు, విద్యార్థుల అడ్మిషన్లు, సర్వేపల్లె రాధాకృష్ణన్ విద్యా మిత్ర అమలులోనే నిమగ్నమైపోతున్నారు.

**ఏళ్ల తరబడి లేక..**

దశాబ్ద కాలం ఉప విద్యాశాఖాధికారుల పోస్టులు ఇన్‌ఛార్జులతోనే గడిచిపోతుంది. ఉమ్మడి జిల్లాలో చిత్తూరు, తిరుపతి, మదనపల్లి,




పుత్తూరులో ఈ పోస్టులు ఉండేవి. గత కొన్నేళ్లుగా వాటిల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో తనిఖీలు అంతంతమాత్రంగా ఉన్నాయి. జిల్లాల విభజన తర్వాత చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నాలుగు చొప్పున డీవైఈవో పోస్టులు ఏర్పడ్డాయి. పాత డివిజన్లలోనే రెగ్యులర్ డీవైఈవోలు లేరు.. ఇక కొత్త డివిజన్లలో ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

**తొమ్మిదేళ్లుగా నిలిచిన బదిలీలు**

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాల్సిన అధికారులు పనిభారంతో సతమతమవుతున్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలల ప్రవేశాలు, బోధనలో నాణ్యతపై దృష్టి సారించలేని పరిస్థితి. ఫలితంగా విద్యార్థుల ప్రవేశాలు తగ్గుముఖం పడుతున్నాయి. దాదాపు తొమ్మిదేళ్లుగా ఎంఈవోలకు బదిలీలు జరగలేదు. అలాగే కొందరు ఉద్యోగ విరమణ పొందడం, మరికొందరు అనారోగ్య సమస్యలతో సెలవులో ఉన్నారు. 2017, 2021, 2023, 2025లో ఉపాధ్యాయుల బదిలీలు జరిగినా ఎంఈవోలు బదిలీలు మాత్రం జరగలేదు. తాజాగా ఖాళీలు గుర్తించిన విద్యాశాఖ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సరిపడా హెచ్ఎంలు లేకపోవడంతో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను ఎంఈవో–1గా నియమించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

# అద్దె గదుల్లో అక్రమాల పద్దు

ఆదోని : ఉమ్మడి జిల్లాలో నగరపాలక, పురపాలికల్లో వాణిజ్య సముదాయాలు అక్రమార్కులకు ఆదాయ మార్గాలుగా మారాయి. పురపాలికలకు సొంత నిధుల సమీకరణలో భాగంగా వాణిజ్య సముదాయాలు నిర్మించి అద్దెకిచ్చారు. ఇవన్నీ ప్రధాన మార్కెట్ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో పలువురు కన్నేశారు. గడువు ముగిసినప్పటికీ బహిరంగ వేలాలు నిర్వహించకుండా లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నారు. తక్కువ అద్దెలు చెల్లిస్తూ దుకాణాలను మరికొందరికి భారీ అద్దెకు ఇస్తు లబ్ధి పొందుతున్నారు.

**పాతవారికే కట్టబెడుతున్నారు**

పుర దుకాణాల అద్దెలను పరిశీలిస్తే కనిష్ఠంగా రూ.4 వేల నుంచి గరిష్ఠంగా రూ.18–20 వేలు లోపే ఉన్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో రూ.25 వేల వరకు ఉంటున్నాయి. అదే



ప్రాంతంలో ప్రైవేటు దుకాణాల అద్దెలు రూ.30–40 వేలు ఉండటం గమనార్హం. మూడేళ్లకోసారి అద్దెపై 33 శాతం పెంచి పాతవారినే కొనసాగిస్తున్నారు. మరోవైపు అద్దె బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**30 శాతం బినామీల చేతిలో..**

కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 18 సముదాయాల్లో 436 దుకాణాలున్నాయి. ఏటా రూ.కోటికి పైగా ఆదాయం సమకూరుతోంది. ఇక్కడ 30 శాతం దుకాణాలు బినామీల చేతుల్లోనే ఉన్నాయి. తక్కువ ధరకు అద్దెకు తీసుకొని.. అధిక ధరకు ఇతరులకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు.

**ఎక్కడ ఎలా ఉందంటే**

ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలోని 272 దుకాణాలకు ఏటా రూ.3 కోట్ల ఆదాయం వస్తోంది. రెండేళ్ల కిందట వైకాపా హయాంలో గడువు తీరిన 35 దుకాణాలకు వేలం పేరుతో కొంత మొత్తం పెంచి పాతవారికే కట్టబెట్టారు. 50 దుకాణాల్లో బినామీలు తిష్ఠేశారు. సుమారు రూ.40 లక్షల వరకు అద్దె బకాయిలు ఉన్నాయి.

ఆదోని పురపాలక సంఘం పరిధిలో ఐదు సముదాయాల్లో 160 దుకాణాలున్నాయి. ఏడాదికి రూ.కోటి ఆదాయం సమకూరుతోంది. ఆరు సముదాయాల్లో పాతికేళ్లు గడువు తీరిన 37 దుకాణాలకు ఈ ఏడాది జూన్‌లో వేలం నిర్వహించారు. పాలకులు ముడుపులు తీసుకుని పాతవారికే కట్టబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిలో మరో పది దుకాణాలు మిగిలాయి. వీటికి వేలాల నిర్వహణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. అద్దె బకాయిలు రూ.30 లక్షలకుపైగా పేరుకుపోవడం గమనార్హం.

# సర్కారు భూమి కబ్జా



బుక్కరాయసముద్రం : ఆ ప్రభుత్వ భూమి విలువ రూ.కోట్లలో ఉంటుంది. సెంట్రల్ యూనివర్సిటీ సమీపాన ఉండటంతో కన్నుపడింది. భూమిని రక్షించాల్సిన రెవెన్యూ ఉద్యోగి భక్షకుడిగా మారాడు. పేదలకు ఇచ్చిన భూమిని రద్దు చేసి ఆక్రమించాడు. దర్జాగా రాళ్లు పాతించాడు. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని జంతులూరు రెవెన్యూ గ్రామ శివారులో సెంట్రల్ యూనివర్సిటీ ఉంది. దీనికి దగ్గర్లో సర్వే నంబరు 276–1, 276–4లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి సమీపం నుంచి జాతీయ రహదారి వెళుతుంది. 2017లో అప్పటి రెవెన్యూ అధికారులు ఐదు ఎకరాల భూమిని దళితులు నాగేశ్వరమ్మ, కృష్ణవేణిలకు 2.5 ఎకరాల చొప్పున ఆన్‌లైన్‌లో ఎక్కించి పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చారు. 2023లో జంతులూరులో ఇల్లులేని పేదలకు సదరు భూమిలో పట్టాలు ఇవ్వాలని నిర్ణయించారు. పట్టాదారులకు పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో జంతులూరు వీఆర్‌వోగా పనిచేసిన వ్యక్తి విలువైన భూమిని కాపాడాల్సిందిపోయి.. కబ్జా చేయడానికి కన్నేశాడు. ప్రస్తుతం అక్కడ ఎకరం భూమి ధర రూ.4 కోట్లకు పైగా పలుకుతోంది. ఐదు ఎకరాల విలువ రూ.20 కోట్లకు పైగానే ఉంటుంది.

**హెచ్చరిక బోర్డు తొలగించి..**

కొంతకాలం క్రితం విలువైన భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించేశారు. తాజాగా భూమి చదునుచేసి సరిహద్దు రాళ్లు పాతడం గమనార్హం. అప్పట్లో వీఆర్‌వోగా ఉన్న సదరు వ్యక్తి.. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లాలోని రెవెన్యూశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా కొనసాగుతున్నాడు. విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటే రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారని స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రద్దు చేయించి..**

పేదలకు పట్టాలు ఇస్తామంటూ అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో నాగేశ్వరమ్మ పేరుతో ఉన్న 2.5 ఎకరాల భూమిని వీఆర్‌వో రద్దు చేయించాడు. తనతోపాటు భార్య పేరిట మార్పించుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడు. అప్పట్లో సదరు భూమిలో పేదలకు పట్టాలు ఇవ్వలేకపోయారు. ఎవరైనా భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అప్పటి అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

**తగిన చర్యలు తీసుకుంటాం**

శ్రీధర్‌మూర్తి, తహసీల్దార్, బుక్కరాయసముద్రం

అది ప్రభుత్వ భూమి. అందులో పాతిన రాళ్లను తొలగిస్తాం. ఆక్రమించిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటాం.

# అమృత తుల్యం.. సంపూర్ణ పోషకం..!



మద్దిలపాలెం : తల్లిపాలు అమృతంతో సమానం అంటారు. శిశువుకు ఆరు నెలల వయసు వచ్చే వరకు తల్లిపాలు పట్టడం చాలా మంచిదని వైద్య నిపుణులు చెబుతుంటారు. అయితే పలు కారణాలతో ఆరు నెలల ముందే శిశువులు తల్లిపాలకు దూరం అవుతున్నారు. ఇది పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. తల్లిపాలపై నెలకొన్న అపోహలను తొలగించడానికి ప్రపంచ లయన్స్ క్లబ్ ఫర్ బ్రెస్టు ఫీడింగ్ యాక్షన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్ సంయుక్తంగా ప్రతి ఏడాది ఆగస్టు మొదటి వారంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో నుంచి 273 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ కె.నీలిమ తెలిపారు.

**బిడ్డకు కలిగే ప్రయోజనాలు ఇవీ..:** 'తల్లిపాలతో శిశువు మెదడు ఎదుగుదల బాగుంటుంది. ఎముకలు దృఢంగా మారుతాయి. వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్స్ రాకుండా కాపాడుతుంది. తల్లిపాలతో పోలిస్తే డబ్బాపాలు తాగే పిల్లలు విరోచనాలు , న్యూమోనియా బారిన పడే అవకాశాలు కనీసం ఐదురెట్లు ఎక్కువగా ఉంటాయి. శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే రెండేళ్లపాటు తల్లిపాలు ఇవ్వాల'ని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**నిల్వచేసి ఇవ్వవొచ్చు:** తల్లిపాలు నిల్వ చేసి బిడ్డకు ఆరు గుంటల తరువాత కూడా ఇవ్వవచ్చు. పాలు ఫ్రిజ్‌లో పెట్టి నిల్వ చేస్తే ముందుగా వేడి నీటిలో ఒక బౌల్‌లో తల్లిపాలు ఉంచి.. కాస్త వేడి అయిన తరువాత బిడ్డకు ఇవ్వాలి.

రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్సుల్లో బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రాలు: ఉద్యోగాలు చేసే మహిళలు బిడ్డలకు తగిన స్థాయిలో పాలు ఇవ్వలేని పరిస్థితి. రెండు, మూడు నెలలు దాటక ముందే డబ్బాపాలు తాగించాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించడానికి ఇప్పటికే కార్యాలయాల్లో, స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రులు బ్రెస్ట్ ఫీడింగ్ గదులు వంటివి ఏర్పాటు చేస్తున్నాయి. ద్వారకానగర్, మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్సులు, రైల్వేస్టేషన్‌లో ఈ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

**అనుబంధం పెరుగుతుంది..:** 'బిడ్డకు పాలు పట్టడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది. కొంతమంది తల్లుల్లో పాలు తక్కువగా ఉంటాయి. అటువంటివారు ఆవు, గెదే పాలు తాగాలి. తెల్ల ఉల్లి, బీరకాయల్లో తల్లిపాలు పెంచే పోషకాలు ఉంటాయి. ఆహారంలో వాటిని అధికంగా తీసుకోవాలి'అని ఆరిలోవ ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్.అనిత తెలిపారు.

# ఉపాధికి చోదక శక్తి!



చిత్తూరు : ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లే కీలక భూమిక పోషిస్తాయి. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే రెండు జిల్లాల్లో మొదటి దశలో చేపట్టే రెండు పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు అడుగులు పడ్డాయి. రెండో విడతలోని పార్కులకు త్వరగా భూమిని గుర్తిస్తే చకచకా పనులు మొదలవుతాయి.

చిత్తూరు జిల్లాలో తొలి విడతలో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. గుడుపల్లె మండలం పొగురుపల్లెలో 38.57 ఎకరాలు సేకరించారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ, నీరు, విద్యుత్తు వంటి సదుపాయాలు సమకూర్చడానికి రూ.17.75 కోట్లతో పనులు జరుగుతున్నాయి. పలమనేరు పురపాలిక నాగమంగళం సమీపంలో 3.28 ఎకరాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయం (ఎఫ్ఎఫ్‌సీ) నిర్మించనున్నారు. రూ.15.27 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. పనులు చేసేందుకు త్వరలోనే గుత్తేదారుతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరిలో 1.04 ఎకరాలు ఉంది. ఇక్కడ కూడా ఎఫ్ఎఫ్‌సీ ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో సదుపాయాలు కల్పిస్తారు. జీ ప్లస్ 2 విధానంలో గదులు అందుబాటులోకి తెచ్చి ఔత్సాహికులకు నిర్ణీత మొత్తానికి ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ అసెంబ్లింగ్, సర్వీసింగ్ వంటి యూనిట్లు నెలకొల్పుకోవచ్చు.

**జిల్లాలోనే కొంత సమస్య**

రెండో విడత ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు.. త్వరలో శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే చిత్తూరు జిల్లాలో భూసేకరణ చేస్తున్నారు. మిగతా ఐదు నియోజకవర్గాల్లో పెద్దగా సమస్యలు లేవు. గంగాధరనెల్లూరులో గతంలో లిడ్క్యాప్‌నకు కేటాయించిన 400 ఎకరాల్లో 90 ఎకరాలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. పూతలపట్టుకు సంబంధించి పి.కొత్తకోట వద్ద 89 ఎకరాలు, చిత్తూరులో 5.వెంకటాపురం, నగరిలో మాంగాడు, పుంగనూరులో చదళ్ల వద్ద భూమిని గుర్తించారు. తిరుపతి జిల్లాలోనే కొంతవరకు సమస్య ఉంది. చంద్రగిరి మండలం ఐతేపల్లి వద్ద ప్రాథమికంగా స్థలం ఇవ్వాలని భావిస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో వరదయ్యపాళెం వద్ద భూమి ఉంది. తిరుపతి నగరంలో ఎఫ్ఎఫ్‌సీ నెలకొల్పాలన్నా స్థలం దొరకడం లేదు.

**త్వరలోనే రెండో విడతలోనూ..**

– సుమిత్‌కుమార్, కలెక్టర్

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. తొలి విడతలో గుర్తించిన ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. అభివృద్ధి చేసిన తర్వాత ధర నిర్ణయించి ఔత్సాహికులకు ప్లాట్లు కేటాయిస్తాం. రెండో విడతకు సంబంధించి భూసేకరణ వేగంగా చేయాలని ఆదేశించాం.

# పర్యాటకం.. కాగితాలకే పరిమితం

గుంతకల్లు : "గుత్తి దుర్గంతోపాటు కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం, బుగ్గసంగమేశ్వరాలయ ప్రాంతాలను పర్యాటక స్థలాలుగా అభివృద్ధి చేస్తాం. ఇందుకు రూ.20 కోట్లు కేటాయించినట్లు 2017 ఏప్రిల్ 20న తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పామిడిలో జరిగిన బహిరంగ సభలో చెప్పారు. ఇందుకు సంబంధించి అధికారులు ప్రణాళికలు కూడా రూపొందించారు. ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిధులను దారి మళ్లించింది. దాంతో పనులు పట్టాలెక్కలేదు. ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తే వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది



**చూశారు.. వెళ్లారు**

ఆరేళ్ల కిందట పర్యాటకశాఖ అధికారులు మూడు ప్రదేశాలను పరిశీలించారు. పర్యాటకులు గుత్తి కోటకు నడిచి వెళ్లడం కష్టమని, రోప్‌వే ఏర్పాటు చేస్తామని చెప్పారు. హోటళ్లు, విశ్రాంతి గదులు, పార్కులు నిర్మిస్తామన్నారు. బుగ్గసంగాల గ్రామ సమీపంలోని సంగమేశ్వరాలయం వద్ద కూడా పర్యాటకుల కోసం విశ్రాంతి గదులు, హోటళ్లు, అధునాతన స్నానాల గదులు, మరుగుదొడ్లను నిర్మిస్తామని తెలిపారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గుట్టను పరిశీలించి అక్కడ నిర్మాణాలు చేపడతామని అప్పట్లో ప్రకటించారు. ఇక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పర్యాటకులు ఆశపడ్డారు. ఆతరువాత అధికారులు రాకపోవడంతో ప్రణాళికలు కాగితాలకు పరిమితమయ్యాయి. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు నిధులు కేటాయించాలని పర్యాటకులు కోరుతున్నారు.

# భళా.. సర్కారు కళాశాల

కర్నూలు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో చేపట్టిన మార్పులు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అసౌకర్యాలు, అధ్యాపకుల కొరత వేధించేది. సరైన బోధన లేక పిల్లల్ని చేర్చేందుకు తల్లిదండ్రులు వెనకాడేవారు. పేదలు సైతం అప్పులు చేసి పిల్లల్ని ప్రైవేటు కళాశాలల్లో చేర్చేవారు. ఈ పరిస్థితిని మార్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతంలో కంటే ఈ ఏడాది ప్రవేశాలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

కర్నూలు జిల్లాలో 23, నంద్యాల జిల్లాలో 24 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఊహించిన దానికన్నా ఎక్కువమంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. 2025– 26 విద్యా సంవత్సరానికి గాను జులై నెలాఖరు వరకు కర్నూలు జిల్లాలో 10,358, నంద్యాల జిల్లాలో 3,423 మంది విద్యార్థులు ఇంటర్‌లో చేరారు. అధ్యాపకులు గ్రామాలు, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు.



పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకెళ్లి తల్లిదండ్రులను కలిసి.. సర్కారు కళాశాలల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పించిందని, అనుభవం ఉన్న అధ్యాపకులతో బోధిస్తామని, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా, పోటీ పరీక్షల్లో రాణించేలా సన్నద్ధం చేస్తామని చెప్పి ఒప్పించి పెద్ద సంఖ్యలో విద్యార్థులను చేర్చుకున్నారు. ప్రభుత్వ సంస్కరణలకు తోడు తమ ప్రచారం ఫలించడంతోనే కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని అధ్యాపకులు పేర్కొంటున్నారు.

**ఫలించిన పథకాలు**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనం అందించేందుకు డొక్కా సీతమ్మ పథకాన్ని అమలు చేస్తోంది. కళాశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేసింది. ఇంటర్ విద్యార్థులకు కూడా తల్లికి వందనం పథకం వర్తింపచేసింది. ఇంటర్ విద్య తర్వాత వైద్య విద్య, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కోర్సుల్లో రాణించేందుకు ఇంటర్ పాఠ్యాంశాలతో పాటు నీట్, జేఈఈకి సంబంధించిన పుస్తకాలు కూడా సరఫరా చేసింది. ఇది ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు దోహదపడ్డాయి.

# నది నిండింది.. ఇసుక నిండుకుంది

కర్నూలు : శ్రావణమాసంలో మంచి రోజులని.. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చాలామంది ముందుకొస్తున్నారు. భవన నిర్మాణ ఊపందుకుంటున్న తరుణంలో ఇసుక కొరత వేధిస్తోంది. తుంగభద్ర ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఓపెన్ ఇసుక రీచ్‌లు మునిగిపోయాయి. డీసిల్టింగ్ పాయింట్లలో ఇసుక తవ్వకాలు ఆగిపో యాయి. జిల్లాలో గత వారం రోజులుగా తవ్వకాలు నిలిచిపోయాయి. జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో విఫలమవడం తో కొరత ఏర్పడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయం లో దళారులు అనుమతిలేని ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు సాగిస్తూ.. మొత్తానికి ఇసుక విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**ఒక్క ట్రాక్టర్ కూడా లేదు**

వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా గనుల శాఖ అధికారులు గత వేసవిలో సి.బెళగల్ మండలంలోని ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో 7 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉంచుకోవాల్సి ఉండగా.. 2.20 లక్షల టన్నులే పెట్టారు. ఇందులో జూన్, జులై మాసాల్లో నంద్యాల జిల్లాకు 80 వేలు, అనంతపురం జిల్లాకు 10 వేల టన్నులు సరఫరా చేశారు. జిల్లాలోని పత్తికొండ, గార్గేయపురం తదితర ప్రాంతాల్లో హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులతో పాటు జిల్లా అవసరాలకు కలిపి 1.30 లక్షల టన్నుల వినియోగం జరిగింది. దీంతో ప్రస్తుతం ఇసుక నిల్వలు నిండుకున్నాయి. ఒక ట్రాక్టర్ ఇసుక కూడా లేదు. సి.బెళగల్ మండలంలోని ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో 2.30 లక్షల టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతులున్నాయి. తుంగభద్రకు వరద తగ్గితేగాని ఇక్కడ తవ్వకాలు చేపట్టలేని పరిస్థితి.

# సయోధ్య కుదరక.. రోడ్డున పడింది

నాయుడుపేట : జిల్లాలో ఆరు మండలాలు, మూడు నియోజకవర్గాలను కలిపే కొనేటి రాజుపాళెం–కొణతనేరి ర.భ. శాఖ రోడ్డు రెండు శాఖల సమన్వయం లోపంతో చివరకు వివాదాస్పదంగా మారింది. నాయుడుపేట మండలంలోని కొనేటిరాజుపాళెం నుంచి మేనకూరు పారిశ్రామికవాడ మీదుగా శ్రీకాళహస్తి వరకు 15 కి.మీ. ర.భ. శాఖ రోడ్డు ఉంది. గతంలో వెంకటగిరి, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోల పరిధిలో ఈ మార్గంలో అధిక సంఖ్యలో బస్సులు నడిపేవాళు ౹. కల్వర్టులు అధ్వానంగా ఉండడం, పాలచ్చూరు నుంచి రహదారి మరమ్మతులు లేకపోవడంతో ఒకటి రెండు బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. దీంతో పాలచ్చూరు నుంచి కొనేటిరాజుపాళెం మధ్య భూములను ఏపీఐఐసీ ఇటీవల ఆదిత్య బిర్లా పరిశ్రమకు కేటాయించింది.



భూముల మధ్య ఉన్న రోడ్డు కేటాయించడంతో ఇటీవల పనులు ప్రారంభించిన పరిశ్రమ యాజమాన్యం రోడ్డుకు అడ్డుగా ప్రహరీ నిర్మించేందుకు యత్నించడంతో పాలచ్చూరు గ్రామస్థులు ఆందోళన చేశారు. ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏపీఐఐసీ అధికారులు చూపకపోవడం, మరోవైపు ర.భ.శాఖ రోడ్డు మార్గం వెంబడి ఆదిత్య బిర్లా పరిశ్రమ నిర్మాణం చేపడుతుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు సమస్య పరిష్కారానికి ర.భ.శాఖ, ఏపీఐఐసీ అధికారులు చొరవ చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జనగళం వినిపించాలి.. జలకష్టం తీర్చాలి

కర్నూలు : జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తి.. పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంది. కర్నూలు కలెక్టరేట్‌లో నీటి పారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశాన్ని మొక్కుబడిగా కాకుండా సాగునీటి కష్టాలు తీర్చేలా అర్థవంతంగా నిర్వహించాలని రైతులు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యేలు హాజరై వివిధ అంశాలపై స్పష్టంగా చర్చించి.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**గేట్లు బిగించి చేతులు దులిపేసుకున్నారు**

గాజులదిన్నె జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 4.500 టీఎంసీలు కాగా 5.500 టీఎంసీలకు పెంచేందుకు గత ప్రభుత్వం రూ.137 కోట్ల నిధులు విడుదల చేసింది. ఒక టీఎంసీ నీటిని అదనంగా నిల్వ చేసేందుకు 410 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఒక్క సెంటు కూడా సేకరించలేదు. జీడీపీ అధికారులు రూ.51 కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. గేట్లు బిగించి మిగతా పనులు చేయకుండా చేతులు దులిపేసుకున్నారని రైతులు విమర్శిస్తున్నారు.



**గుండ్రేవుల కల సాకారమవ్వాలి**

తుంగభద్ర జలాలను నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడవంతో ఏటా వందల టీఎంసీల నీటిని సుంకేసుల ద్వారా దిగువకు విడుదల చేయాల్సి వస్తోంది. గుండ్రేవుల జలాశయాన్ని నిర్మిస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. దీనిపై సమగ్రంగా చర్చించాలి.

గాజులదిన్నె ప్రాజెక్టులో ఈ ఏడాది 3 టీఎంసీల నీరు నిల్వ చేయకపోతే వచ్చే వేసవిలో మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. హంద్రీనీవా కాల్వకు నీటిని విడుదల చేసినప్పటి నుంచే రోజుకు 250– 300 క్యూసెక్కుల వరకు విడుదల చేసి ఈ ప్రాజెక్టులో నిల్వ చేయాలి.హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలో కర్నూలు జిల్లాలో 60 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేయాల్సి ఉంది. పందికోన జలాశయం కింద 46 వేల ఎకరాల ఆయకట్టుకు నీటి విడుదల నిలిచిపోయింది. ఈ అంశాలపై చర్చించాలి. హంద్రీనీవా కాల్వ నుంచి 68 చెరువులు నింపే ప్రాజెక్టు నిర్వహణ రూ.1.60 కోట్లు విడుదల చేయాలి.

# దారి చూపితేనే.. ప్రగతి పరుగు..!

జంగారెడ్డిగూడెం : గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి వెంబడి ఉన్న పొలాలకు సరైన కల్వర్టులు, దారులు ఇవ్వకపోవడంతో వందలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జంగారెడ్డిగూడెం మండలంలోని పుట్లగట్లగూడెం, లక్కవరం, పేరంపేట, పంగిడిగూడెం, దేవులపల్లి తదితర గ్రామాల్లో పొలాల మధ్య నుంచి జాతీయ రహదారి వెళ్లడంతో ఆయా పొలాలు రెండుగా చీలిపోయాయి. దీంతో పంట సాగు విషయంలో నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని కర్షకులు వాపోతున్నారు.

**బాట లేక.. కల్వర్టులు చాలక..**

ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద దిగువకు వెళ్లే వీలు లేక తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయని చిన్న, సన్నకారు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పొలాలకు అనుకుని పంట బోదెలు ఉండటంతో వచ్చిన వర్షపు నీరు దిగువకు వెళ్లిపోయేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. హైవేకు ఇరువైపులా పంట పొలాలకు వెళ్లేందుకు దారి నిర్మిస్తామని చెప్పి తమ భూములను తీసుకున్నారని.. నేడు హైవే పనులు పూర్తి కావస్తుండటంతో ఆ ఊసే లేదని రైతులు చెబుతున్నారు. కలెక్టర్‌తో పాటు హైవే అధికారులకు తమ సమస్యలపై పలుమార్లు వినతులు సమర్పించినా.. ఫలితం లేదని గగ్గోలు పెడుతున్నారు.

**25 కిలోమీటర్ల తిరిగి వెళ్తున్నా..**

'నా పొలంలో హైవే నిర్మాణానికి రెండెకరాలు ఇచ్చా. హైవే రాక మునుపు ఇంటి నుంచి పొలం వెళ్లాలంటే కిలోమీటరు ఉండేది. ఇప్పుడు సర్వీసు దారి ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి జంగారెడ్డిగూడెం, సీతంపేట, తిరుమలాపురం మీదుగా 25 కి.మీ. తిరిగి పొలానికి వెళ్లాల్సి వస్తోంది.'

వందనపు సాయిబాబు, పంగిడిగూడెం

**కూలీలు రావడం లేదు..**

'పంట చేలకు రావాలంటే దారి లేకపోవడంతో కూలీలు వ్యవసాయ పనులకు సరిగా రావడం లేదు. పంట ఉత్పత్తులు ట్రాక్టర్లలో తరలించాలంటే యాతన పడుతున్నాం.'

గోలి నర్సిరెడ్డి, పేరంపేట

# సొమ్ము సామాన్యులది.. సోకు దళారులది..!



విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థలో దళారుల హవా కొనసాగుతోంది. రోడ్ల విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వకుండా తిప్పించుకుంటున్న అధికారులు, స్థలాలతో సంబంధంలేని దళారులకు మాత్రం వెంటనే మంజూరు చేస్తున్నారు. వారిచ్చే కమీషన్ల కోసమే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నగరంపాలెం, రేవళ్లపాలెం పరిధిలో కొన్నేళ్ల కిందట రహదారులు నిర్మించినప్పటికీ ఇప్పుడు టీడీఆర్‌లు మంజూరు చేయిస్తుండటం గమనార్హం. మరికొన్నింటికి రోడ్ల విస్తరణలో తక్కువ పరిహారం ఇచ్చారని, తాజా నిబంధనల ప్రకారం పెంచి ఇవ్వాలంటూ దళారులు స్థలాల హక్కు పత్రాలతో నిత్యం ప్రధాన కార్యాలయంలో దర్శనమిస్తున్నారు.

**అమాయకులను బెదిరించి ఒప్పందం:** 'మీ స్థలం రోడ్డు విస్తరణలో పోతుంది. టీడీఆర్ కోసం మీరు తిరగలేరు. ఇదంతా పెద్ద తతంగం' అని స్థలం యజమానిని దళారులు భయపెడుతున్నారు. తాము ఆ పని చేసిపెడతామని ఒప్పందం చేసుకుంటున్నారు. అధికారులకు లంచాలని, తమకు కమీషన్ అని.. రూపాయి విలువ ఉన్న టీడీఆర్‌కు కేవలం రూ.25పైసలు ఇచ్చేలా ముందస్తుగా అడ్వాన్సు చెల్లిస్తున్నారు. తర్వాత కార్యాలయాల్లో అధికారులను కలిసి బేరం కుదుర్చుకుంటున్నారు. బాండ్లు మంజూరు కాగానే టీడీఆర్ రైట్స్ సైతం దళారుల పేరుపై మార్చుకుంటున్నారు. వాటిని ఎక్కువ మొత్తానికి గుత్తేదారులు, బిల్డర్లకు అమ్మేసుకుంటున్నారు.

**ఆఫ్‌లైన్‌లో అక్రమాలకు తెగింపు**

ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో జీవీఎంసీ టీడీఆర్‌లు మంజూరు చేస్తోంది. దీంతో బాధితులకు తెలియకుండా వారి స్థలాల సర్వే నెంబర్లను దళారులను సేకరిస్తున్నారు. వాటికి తమ ఆధార్, ఫోన్ నెంబరుతో వాలిడేషన్ చేయించి టీడీఆర్‌లు కొట్టేస్తున్నారు. అసలైన యజమానులు తమ ఫోన్, ఆధార నెంబర్లను వాలిడేషన్ చేయించడానికి వెళితే అప్పటికే టీడీఆర్ ఇచ్చేశారని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. 'మా టీడీఆర్ మాకివ్వండి.. మీరు ఎవరికిచ్చారో మాకు తెలియదు' అంటూ కార్యాలయం చుట్టూ బాధితులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

**230 టీడీఆర్‌లకు 4రెట్లు అదనం..:** ఇప్పటి వరకు జీవీఎంసీ పరిధిలో ఐదు మురికివాడలకు టీడీఆర్‌లు మంజూరు చేశారు. నిబంధనల ప్రకారం మురికివాడలకు 1:1 నిష్పత్తిలో టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉండగా, దళారులు పైరవీలు చేసి నాలుగు రెట్లు అదనంగా మంజూరు చేయించుకున్నారు. ఇటీవల ఓ దేవస్థానికి ప్రత్యామ్నాయ స్థలం జీవీఎంసీ ఇచ్చినప్పటికీ, వాటికి ఆక్రమణదారుల పేరిట మళ్లీ టీడీఆర్ బాండ్లు ఇవ్వడం వివాదాస్పదమైంది. మొత్తం 230 టీడీఆర్‌లను నాలుగు రెట్ల ఎక్కువకు కట్టబెట్టిన విషయం బయటకు రావడంతో హోల్డ్‌లో పెట్టారు. ప్రస్తుతం వాటిని తిరిగి దక్కించుకోవడానికి దళారులు పావులు కదుపుతున్నారు. జీవీఎంసీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కేతన్‌గార్గ్ దళారులకు అడ్డుకట్ట వేసి అర్హులకు టీడీఆర్‌లు దక్కేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పదేళ్లలో జారీ చేసిన టీడీఆర్ బాండ్లు: 1035 (2024 డిసెంబరు నాటికి)

వాటి విలువ: రూ.2500కోట్లపైగా

గత వైకాపా హయాంలో ఇచ్చినవి: 700పైగా

వాటి విలువ రూ.1600కోట్లపైగా

# ద్రవిడ.. కష్టాలు గట్టెక్కేదెలా?



కుప్పం : ద్రావిడ భాషలపై విస్తృత పరిశోధనలు జరిపి ద్రవిడ సంస్కృతి.. సంప్రదాయాలను పరిరక్షించాలనే లక్ష్యంతో కుప్పంలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. ఆ దిశగా అడుగులు ముందుకేస్తున్న వర్సిటీ కొందరు పాలకుల ఇష్టారాజ్యంతో కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. ఆర్థిక వనరులు లేక కనీసం అక్కడ పనిచేసే పొరుగు సేవల ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి. వారికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తెప్పించి జీతాలు చెల్లించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. కొత్తగా రాబోయే వీసీ ద్రవిడ కష్టాలను ఏ విధంగా అధిగమిస్తారో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఏడాది తర్వాత..**

కుప్పం ద్రవిడ వర్సిటీలో వైకాపా హయాంలో వీసీగా నియమితులైన ఆచార్య మధుజ్యోతి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతేడాది జులై 18న రాజీనామా చేశారు. గ్రంథాలయశాఖాధిపతిగా విధులు నిర్వహిస్తున్న ఆచార్య దొరస్వామిని ఇన్‌ఛార్జి వీసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎట్టకేలకు ఏడాది తర్వాత కూటమి ప్రభుత్వం ద్రవిడ వీసీ నియామకానికి సెర్చ్ కమిటీని నియమించింది.

**పోస్టుల నియామకంలోనూ జాప్యం**

ద్రవిడలో 79 టీచింగ్ పోస్టులు ఉండగా.. ప్రస్తుతం 56 మంది ఉన్నారు. 55 నాన్ టీచింగ్ పోస్టులుండగా.. 43 మంది పని చేస్తున్నారు.

**నిధులు ఖాళీ..** విశ్వవిద్యాలయంలో 28 మంది పొరుగు సేవల ఉద్యోగుల నియామకాలకు సంబంధించి మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉంది. అయినా.. గత పాలకులు 254 మందిని పొరుగు సేవల కింద నియమించుకున్నారు. వీరందరికీ దూరవిద్య ద్వారా వచ్చే నిధుల నుంచి వర్సిటీ జీతాలను చెల్లించుకుంటూ వచ్చింది. ఈ విభాగాన్ని యూజీసీ రద్దు చేయడంతో ఉన్న నిధులు ఖాళీ అయ్యాయి. నాలుగేళ్లుగా జీతాల కోసం ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. జీతాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ ద్వారా ఆరాతీసి నివేదికను అందించినా.. దానిపై ఇన్‌ఛార్జి వీసీ నిర్ణయం తీసుకోలేకపోయారు. ఈ విషయమై కొత్త వీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది.

# పంచాయతీల్లో.. పన్ను దొంగలు

పుత్తూరు : తిరుచానూరు మేజరు పంచాయతీలో బిల్లు కలెక్టర్ రమేష్ నాయుడు ఏకంగా రూ.22 లక్షల వరకు పన్ను మొత్తం పక్కదారి పట్టించి ఇటీవల అడ్డంగా దొరికిపోయారు. సదరు బిల్‌కలెక్టర్ గతంలోనూ ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడి వేటుకు గురైనా తీరు మార్చుకోలేదు. ఈ పంచాయతీలో ఏటా రూ.2 కోట్ల వరకు పన్ను వసూళ్లు ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖాతాకు జమచేయాల్సి ఉన్నా చేయలేదు. కార్యదర్శి సైతం పట్టించుకోకపోవడంపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

చిత్తూరు జిల్లా వి.కోట మేజర్ పంచాయతీలో గతంలో రూ.20 లక్షల వరకు బిల్లు కలెక్టర్లు స్వాహా చేశారు. నిధులు వాడుకున్నట్లు రుజువు కావడంతో ఇద్దరిపైనా వేటు వేశారు.

పంచాయతీల్లో పన్ను వసూళ్లు పెద్దఎత్తున పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు సాంకేతిక మార్పులు తీసుకొస్తున్నా అక్రమాలకు తెరపడటం లేదు. మేజరు పంచాయతీల్లో ఈతంతు మరీ ఎక్కువగా ఉంటోంది. కొన్నిచోట్ల కార్యదర్శులు, బిల్లు కలెక్టర్లు మిలాఖత్ కావడంతో అక్రమాలు బయటకు పొక్కడం లేదు. మరికొన్నిచోట్ల ఉన్నతాధికారులకు తెలిసినా సర్దుబాటు చేయడం, నోటీసులతో సరిపెట్టడం వంటివి కొనసాగుతుండటంతో అక్రమాల పర్వం కొనసాగుతున్నట్లు విమర్శలు వ్యక్తమవున్నాయి.

**'మేజర్'.. పాళ్లు ఇక్కడే..**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మేజర్ పంచాయతీలు 30 వరకు ఉన్నాయి. కాణిపాకం, తిరుచానూరు, సత్యవేడు, నాగలాపురం, నారాయణవనం, చంద్రగిరి, కార్వేటినగరం, జీడీనెల్లూరు, బంగారుపాళ్యెం, రేణిగుంట తదితర వాటిలో రూ.కోట్లలో ఆదాయం ఉంటోంది. ఇక్కడ గ్రేడ్–1 కార్యదర్శులను నియమించాల్సి ఉన్నా రాజకీయ పలుకుబడితో ఏళ్లతరబడి ఇన్‌ఛార్జులు కొనసాగడంతో అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

**సొంత సిబ్బందితో..**

అధిక ఆదాయం వచ్చే పలు పంచాయతీల్లో సర్పంచులను కీలుబొమ్మలుగా మార్చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ కింద పన్ను వసూలు సిబ్బందిని నియమించుకునే అవకాశం గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులకు ఉంటుంది. ఈ నేపథ్యంలో సొంత అనుచర గణంతో ఆ విభాగాన్ని నింపేసి మన్ని మదింపు నుంచి వసూళ్ల వరకు చేతివాటానికి పాల్పడుతున్నారు. రెగ్యులర్ బిల్లు కలెక్టర్లు వారికి దారులు చూపుతున్నారు. చివరకు ఎవరూ గుర్తించకపోతే దొంగ బిల్లులతో లెక్కా పద్దులు సరిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.




**పర్యవేక్షణ లేకనే..**

ప్రధానంగా మేజర్ పంచాయతీలపై ఈవోఆర్డీలు, డీఎల్‌పీవోలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం, పన్ను వసూళ్లు వంటి వాటిపై దృష్టి సారించడం చేపట్టాలి. అయితే ఆదిశగా దృష్టి సారించకపోవడం, ఇక్కడి ఆదాయాలపైనే అందరి కళ్లు ఉండటంతో అక్రమాలకు తెరపడటం లేదన్న ఆరోపణలున్నాయి.

**పకడ్బందీ చర్యలతో ముందుకు**

తిరుచానూరు పంచాయతీలో జరిగిన అక్రమాలపై ఇటీవలే విచారణ పూర్తయింది. వాస్తవాలు నిర్ధారించుకుని బిల్లు కలెక్టర్‌ను సస్పెండ్ చేశాం. ఇకపై తరచూ మేజర్ పంచాయతీల్లో తనిఖీ చేపట్టి ఇలాంటి అక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతాం.సుశీలాదేవి, జిల్లా పంచాయతీ అధికారిణి, తిరుపతి

**2024–25లో వసూళ్లు ఇలా..**

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు : 1471

పన్ను డిమాండు : రూ.54 కోట్లు

వసూళ్లు : రూ.48.75 కోట్లు

బకాయిలు : రూ.5.25 కోట్లు

# ఇదే మెనూ.. పెట్టిందే తిను

నంద్యాల : ఉమ్మడి జిల్లాలోని బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన మెనూ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అధికారుల పర్యవేక్షణ లేక ఆహారంలో నాణ్యత కరవవుతోంది. ఆదివారం మధ్యాహ్న భోజనంలో, మంగళ, శుక్రవారాల్లో రాత్రి వేళల్లో చికెన్ ఇవ్వాలి. ప్రతి విద్యార్థికి 100 గ్రాములు పెట్టాలి. కానీ కొన్ని ప్రాంతాల్లో సగటున ఒక్కో విద్యార్థికి 70 నుంచి 80 గ్రాముల మధ్యే ఇస్తున్నారు.

**నాణ్యత అంతంతే**

చాలా వసతిగృహాల్లో చికెన్ బిర్యానీకి బదులు కర్రీతోనే సరిపెడుతున్నారు. ఎక్కడా చికెన్ బిర్యానీ ఇవ్వడం లేదు. బిర్యానీకి తగ్గట్టు ఆహార పదార్థాల సరఫరా లేకపోవడంతో చికెన్, పలావ్ అన్నంతో సరిపెడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా వడ్డిస్తూ 'ఆదా' చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చికెన్ బిర్యానీతోపాటు రైతా ఇవ్వడం లేదు. కేవలం గోంగూర చట్నీతో మమ అనిపించేస్తున్నారు.

**కానరాని పరిశుభ్రత**

వసతి గృహాల్లోని వంట గదుల్లో శుచి శుభ్రత కానరావడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం వండుతున్నారు. నంద్యాలలోని బీసీ బాలుర వసతిగృహంలో భవనాలు ఇప్పటికే శిథిలావస్థకు చేరుకోగా



ఇక్కడే భోజనాలు తయారవుతున్నాయి. దుమ్ము కొట్టుకుపోయిన గదుల్లో ఆహారం సిద్ధం చేస్తున్నారు. వంట గదుల్లో పరిశుభ్రత కానరావడం లేదు. అద్దె భవనాల్లోని వసతి గృహాల్లో పరిస్థితులు మరింత అధ్వానంగా ఉంటున్నాయి.

**కేవలం 26 మందే..**

డోన్ పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహంలో 396 మంది ఉంటున్నారు. హాస్టల్‌ను ఆదివారం పరిశీలించగా 28 మంది విద్యార్థినులు కనిపించారు. 26 మంది బాలికలు భోజనం చేశారు. 30 మంది హాజరైనట్లు వసతిగృహం ఇన్‌ఛార్జి సంరక్షకురాలు తెలిపారు. చికెన్ బాగానే ఉన్నా అన్నం కాస్త మెత్తగా ఉండటంతో పిల్లలు సరిగా తినలేని పరిస్థితి నెలకొంది.

**గదుల కొరతతో ఇబ్బందులు**

వసతిగృహంలో గదుల కొరత తీవ్రంగా ఉంది. కనీసం సామగ్రి పెట్టుకునేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రాంగణంలో గతంలో నిర్మించిన 12 మరుగుదొడ్ల సమూహం నిరుపయోగంగా ఉంది. వాటిని కూల్చేసి కొత్తవి నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థినుల సంఖ్యకు తగ్గట్టు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. డోన్ పట్టణం

# రూ.కోట్లు ఖర్చు.. నీళ్లిస్తే ఒట్టు

డోన్ : డోన్ నియోజకవర్గ పరిధిలోని 131 గ్రామాలతో పాటు వెల్దుర్తి మండలంలో 4, బనగానపల్లి.. 2 గ్రామాలు, పాణ్యం మండల పరిధిలో ఒక గ్రామానికి గోరకల్లు జలాశయం ద్వారా తాగునీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్ పథకాన్ని రూపొందించారు. 2021లో పనులకు శ్రీకారం చుట్టారు. రూ.351 కోట్లతో పైపులైను పనులు చేపట్టగా రూ.230 కోట్ల మేర నిధులు ఖర్చు చేశారు. నిబంధనల ప్రకారం ఈ ఏడాది నవంబరు చివరి నాటికి గుత్తేదారుడు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఆలస్యంగా జరుగుతుండటంతో వచ్చే వేసవి నాటికైనా పూర్తవుతాయా అన్నది సందేహంగా మారింది. సుమారు 591 కిలోమీటర్ల మేర పైపులైను వేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 410 కి.మీ.ల వరకు వేశారు. ఇంకనూ 181 కి.మీల. మేర పూర్తి చేయాల్సి ఉంది.

**అటవీ అనుమతులు రాక..**



డోన్ మండలంలోని పలు ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకుగాను పైపులు సరఫరా వేశారు. రహదారి పక్కనే అలానే ఉంచేశారు. డోన్ సమీపంలోని నగరవనం, డోన్ కొండతోపాటు పలుచోట్ల అటవీ అనుమతులు రాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం బేతంచెర్ల మండలంలోని బేతంచెర్ల పట్టణంతో పాటు పలు గ్రామాలకు మాత్రమే గోరకల్లు నీరు సరఫరా అవుతోంది. సిద్ధనగట్టు, గార్లదిన్నె, ఏనుగుమర్రి తదితర ప్రాంతాల్లో ట్యాంకుల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. 2023లోనే పనులు పూర్తి చేసి తాగునీరు అందించాల్సి ఉండగా ఇంకనూ సాగుతూనే ఉండటం గమనార్హం.

**గడువు పెంచుకుంటూ..**

పట్టణ ప్రాంతంలో ఒక్కొక్కరికి 135 లీటర్లు, గ్రామాల్లో 100 లీటర్ల మేర తాగునీరు ఇవ్వాల్సి ఉంది. గోరకల్లు జలాశయం నుంచి 0.50 టీఎంసీని తీసుకునేలా ప్రణాళికలు రూపొందించారు. వాస్తవానికి పనులు ఎప్పుడో పూర్తవ్వాల్సి ఉండగా.. గడువు పెంచుకుంటూనే వెళుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

చరకలు



## మహిళా సంఘాల్లో.. మొబైల్ బుక్‌కీపింగ్ అమలు!

అనంతపురం : లెక్కల్లో పారదర్శకత, రుణాల చెల్లింపుల్లో కచ్చితత్వం ఉండాలనే ఉద్దేశంతో మహిళా సంఘాల్లో మొబైల్ బుక్ కీపింగ్ విధానం అమలు చేసే యోచనలో ఉన్నారు. గతంలో బుక్ కీపర్లు సక్రమంగా వివరాలు నమోదు చేయకపోవడంతో పొదుపు సొమ్ము, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ సొమ్ము స్వాహా చేయడంతో సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. అనంతపురం జిల్లాలో ప్రయోగాత్మకంగా మొదట ఐదు గ్రామైక్య సంఘాలకు మొబైల్ బుక్‌కీపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ విధానం కొనసాగించే అంశం, లోటుపాట్లు తదితర అంశాలను చర్చించడానికి సెర్ప్ ఆధ్వర్యంలో ఈ నెలలో తిరుపతిలో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.



**యాప్‌లో అనుసంధానం**

యాప్‌లో సంఘానికి సంబంధించి లావాదేవీలు అన్నీ అనుసంధానం చేయడంతో ప్రతి పైసా గురించి సభ్యులు అందరికి తెలుస్తుంది. తన చరవాణిలోనే ఎంత చెల్లించింది ఇంకా ఎంత అప్పు ఉన్నదో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. **పారదర్శకతకు అవకాశం ఉంటుంది.** సంఘం ప్రతి నెలా ఎక్కడ కూర్చొని సమావేశాలు నిర్వహిస్తారో అందుకు సంబంధించిన లొకేషన్, ఫేసియల్ రికగ్నేషన్ సమాచారం తెలుసుకోవచ్చు. తీసుకున్న రుణం, చెల్లింపులు, కొత్త రుణం వివరాలన్నీ చరవాణిలోనే చూసుకోవచ్చు. గతంలో మహిళా సంఘాల రుణాలు స్వాహా చేస్తే ఆలస్యంగా వెలుగులోకి వచ్చి పూడ్చుకోలేని నష్టం జరిగేది. ఈ విధానం వల్ల ఏదైనా లోటుపాట్లు, తప్పిదాలు, సొమ్ము అతిక్రమణల వివరాలన్నీ అధికారులు వేగంగా పరిశీలించి రికవరీ చేయవచ్చు.

## దిమ్మెలు తొలగించేదెన్నడు?

అనంతపురం : రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు మారడానికి పాతవంతెన స్థానంలో నూతన వంతెనను ఏర్పాటు చేశారు. ఈ వంతెన ఏడాది క్రితమే ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. గతంలో ఉన్న పాత వంతెనను ఇటీవల కొంతమేర తొలగించారు. పాత వంతెన కోసం ఏర్పాటు చేసిన ఇనుప దిమ్మెలను ఇప్పటికీ తొలగించలేదు. ఈ దిమ్మెలు నాలుగు, మూడు ప్లాట్‌ఫారంపై అధిక స్థలాన్ని ఆక్రమించాయి. దీనికి తోడు పాత వంతెన దిమ్మెలు అడ్డుగా ఉండటంతో నూతనంగా ఏర్పాటు చేసిన వంతెన కూడా సరిగా కనిపించడం లేదు. కొత్తగా వచ్చిన ప్రయాణికులు వంతెన ఎక్కడుందో వెతుక్కోవాల్సిన



పరిస్థితి నెలకొంది. పాత వంతెన దిమ్మెలను తొలగించాలని పలుమార్లు పర్యటనల్లో భాగంగా డివిజన్ స్థాయి అధికారులు ఇంజినీర్లకు ఆదేశించారు. ఆరు మాసాలు గడుస్తున్నా ఇప్పటికీ వీటిని తొలగించలేదు. స్టేషన్‌లో పాత వంతెన దిమ్మెలు దిష్టి బొమ్మల్లా కనిపిస్తున్నాయి. వీటిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## కృష్ణమ్మకు.. మరింత ఒరవడి

చిత్తూరు : కరవు ప్రాంతాలను సస్యశ్యామలం చేసే దిశగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీ–నీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్ఎస్ఎస్) పెండింగ్ పనులపై ప్రధానంగా దృష్టి సారించింది. మొదటి ఏడాదిలో పుంగనూరు, కుప్పం కాలువలకు నిధుల వరద పారించింది. ఇప్పుడు ప్రధాన, నీవా కాలువల్లోని అసంపూర్తి నిర్మాణాలతోపాటు లైనింగ్‌కు పచ్చజెండా ఊపింది.
తెలుగుదేశం హయాంలో 2014–19 మధ్య హంద్రీ– నీవా ప్రధాన కాలువ



185.32 కి.మీ. మేర తవ్వించి 90 శాతం పూర్తిచేసింది. అప్పట్లో 500 మీటర్లు మాత్రమే పెండింగ్ పనులున్నాయి. వాటిలో అన్నమయ్య జిల్లా చిన్నమండ్యం మండలం పడమటికోన వద్ద 200, కలకడ దగ్గర 300 మీటర్లు మాత్రమే తవ్వాలి. కలకడ మండలం దొడ్డిపల్లి సమీపంలో మూడు కాంక్రీట్ నిర్మాణాలు, మరికొన్ని స్ట్రక్చర్లు, అక్విడక్టుల నిర్మాణం చేపట్టాలి. ఇవి పూర్తి చేసేందుకు ఆరునెలల సమయం సరిపోతుంది. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న 60 నెలలూ వీటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. **బకాయిలు, పనులకు రూ.156 కోట్లు**

ప్రధాన కాలువ కింద గతంలో చేసిన పనులకుగాను రూ.61.06 కోట్ల బిల్లులు చెల్లించాలి. పెండింగ్ నిర్మాణాలకు మరో రూ.45.59 కోట్లు అవసరం. శ్రీసత్యసాయి జిల్లాలోనూ బకాయిలు, అసంపూర్తి పనులకు రూ.50 కోట్లు కావాలి. మొత్తంగా రూ.156 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల కావాలి. ఇప్పటికే హెచ్‌ఎన్ఎస్ఎస్ అధికారులు ఈ విషయమై ప్రభుత్వానికి నివేదించారు. నీవా బ్రాంచి కాలువకు మరో రూ.65 కోట్ల వ్యయమవుతుంది. ఇవి పూర్తయితే పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో దాదాపు 97 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. చిత్తూరు నగర ప్రజల తాగునీటి ఇక్కట్లు తీరుతాయి.

**రెండేళ్లలో జలాలు వచ్చేలా**

హంద్రీ– నీవా ప్రధాన కాలువ, నీవా బ్రాంచి కాలువ లైనింగ్ అంచనా లు రూపొందించి ప్రభుత్వానికి పంపితే ఇప్పటికే సూత్రప్రాయంగా ఆమోదించి నందున వెంటనే అనుమతులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండేళ్లలో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# నకిలీ మకిలీ



ఎలమంచిలి : ఉమ్మడి విశాఖ జిల్లాలో నకిలీ మద్యం, సిగరెట్ల తయారీ యథేచ్ఛగా నడుస్తోంది. కంపెనీ బ్రాండ్లను తలపించేలా తయారు చేస్తున్నారు. ఎవరూ గుర్తించలేనంతగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం అధికారులను విస్మయానికి గురిచేస్తోంది. హైదరాబాద్ నుంచి స్పిరిట్ తదితర మత్తు పదార్థాలను దిగుమతి చేసుకుని పరవాడలో నకిలీ మద్యం తయారు చేసి అచ్యుతాపురం మండలంలో విక్రయిస్తున్నారు.
ఒడిశా నుంచి ముడి సరకు తెచ్చి విశాఖలో నకిలీ సిగరెట్లను ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. రూ.280 విలువ చేసే గోల్డ్‌ఫ్లాక్ ఫిల్టర్ సిగరెట్ ప్యాకెట్ దుకాణదారులకు రూ.80కే విక్రయిస్తున్నారు. ఈ విషయాన్ని ఐటీసీ ప్రతినిధులు గుర్తించి దుకాణాలపై దాడులు చేసి నకిలీ సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ రాకెట్ నడుపుతున్న వ్యక్తులను పీఎం పాలెం పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాలకు నకిలీ సిగరెట్లు సరఫరా అవుతున్నట్లు సమాచారం. అచ్యుతాపురం పారిశ్రామికవాడను లక్ష్యంగా చేసుకుని అక్రమ మద్యం తయారీ ముఠాలు పనిచేస్తున్నాయి. గొలుసు దుకాణాల్లో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఏది అసలు మద్యం, ఏది నకిలీ అనేది తెలుసుకోలేనంతగా మార్కెట్‌ను ముంచెత్తుతున్నారు. అనకాపల్లి జిల్లాలో ఏసీ ప్రీమియం బ్లాక్ ఎక్కువ వినియోగంలో ఉంది. దీన్ని గమనించిన ముఠా ఈ బ్రాండ్ పేరుతో నకిలీ మద్యం తయారు చేసి విక్రయించడం ప్రారంభించారు. ఇద్దరు వ్యక్తులు పెద్ద ఎత్తున మద్యం రాకెట్ నడుపుతున్నారంటే వీరి వెనుక పెద్ద తలకాయలే ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గొలుసు దుకాణాలకు అచ్యుతాపురంలోని లైసెన్స్‌దుకాణాల నుంచే మద్యం సరఫరా అవుతోంది. వీరి కనుసన్నల్లోనే వ్యాపారం జరుగుతోంది. బయట నుంచి మద్యం వచ్చిందని తెలిస్తే వీరే దాడులు చేయిస్తారు. అలాంటిది లైసెన్స్ దుకాణాల యజమానులు నకిలీ మద్యం విషయంలో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.
అచ్యుతాపురంలో గతంలో నకిలీ మద్యం తయారు చేస్తూ దొరికిపోయిన వారున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పరవాడ కేంద్రంగా తయారీ ప్రారంభించి ఇక్కడ అమ్మకాలు చేపట్టారు. గతంలో ఇక్కడ చీప్ లిక్కర్‌ను ఖరీదైన లిక్కర్‌లో కలిపి మోసం చేసేవారు. ఇప్పుడు ఏకంగా తయారీనే ప్రారంభించారు. తాజాగా పట్టుబడిన నిందితుల్లో ఒకరు నకిలీ మద్యం అమ్మకాల కేసులో పాత నేరస్థుడిగా అధికారులు గుర్తించారు. వీరి వెనుక ఎవరున్నారన్న దానిపై పోలీసులు కూపీలాగుతున్నారు. పరవాడ, అచ్యుతాపురంలలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. ఈ రెండు మండలాల్లో రికార్డు స్థాయిలో కార్మికులు పనిచేస్తున్నారు. అమెరికాను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మోసాలకు అచ్యుతాపురం వేదికగా మారింది. ఈ కేసు మరిచిపోక ముందే నకిలీ మద్యం కేసు తెరపైకి వచ్చింది. ఈ కేసులో ఎలమంచిలి ఎక్సైజ్ పోలీసులు రెండు రోజుల కిందట ఇద్దరి నిందితులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

# అరికడతారా.. వెలకడతారా..!



అనకాపల్లి: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కాలం చెల్లిన వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. క్వారీ రాళ్లు, కంకర, మట్టి అధిక లోడుతో రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు హెచ్చరికలకే పరిమితమవుతున్నారు. అడపాదడపా జరిమానాలు విధిస్తూ సరిపెడుతున్నారు. బడాబాబుల కనుసన్నల్లో మైనింగ్ జరుగుతుండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. లారీల్లోంచి బండరాళ్లు జారి పడుతుండటంతో వెనుక వచ్చే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ రాత్రి రాంబిల్లి శివారు ప్రాంతానికి చెందిన ఈరుగుల కృష్ణ అచ్యుతాపురం వైపు వెళ్తుండగా.. జంగాలపాలెం వద్ద బండరాళ్ల లోడు లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆయన కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. అనకాపల్లి, రావికమతం, రోలుగుంట మండలాల్లో రాతి క్వారీలు అధికంగా ఉన్నాయి. వాటి నుంచి పరిమితికి మించిన లోడుతో బండరాళ్లను లారీల్లో తరలిస్తున్నారు. ఒక టిప్పరు 25 టన్నుల రాళ్లనే తీసుకెళ్లాలి. ఇందుకు భిన్నంగా అధిక బరువుతో రేయింబవళ్లు వందల సంఖ్యలో లారీలు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో అధిక శాతం లారీలు పొరుగు జిల్లాలు నుంచి వచ్చేవే ఉంటున్నాయి. వాటిని ఒక్కసారీ ఆపి అధికారులు తనిఖీలు చేయడం లేదు. అచ్యుతాపురం పరిసరాల్లో రాత్రయితే రిజిస్ట్రేషన్ నంబర్లు లేని లారీల్లో మట్టిని తరలిస్తున్నారు. రాంబిల్లి పరిసరాల్లో చీకటి పడితే కొంత మంది ముఠాగా ఏర్పడి సమీపంలోని కొండలను, చెరువుల నుంచి ప్రైవేటు లేఅవుట్లకు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రవాణా శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా క్వారీ రాళ్లు, మట్టి తరలిస్తున్న వాహనాలపై ఈ ఏడాది 293 కేసులు నమోదు చేశారు. లారీలు, ట్రాక్టర్ల యజమానుల నుంచి జరిమానా వసూలు చేసి వదిలేశారు. నిబంధనల ప్రకారం రెండుసార్లకు మించి పట్టుబడినా, కాలం చెల్లిన వాహనాలు రోడ్డెక్కినా వాటిని శాశ్వతంగా సీజ్ చేయవచ్చు. ఇప్పటివరకు ఒక్క వాహనాన్నీ అలా సీజ్ చేయలేదు. వాహనం పట్టుబడితే నిమిషాల్లో నేతల నుంచి ఫోన్లు వస్తుండటంతో.. కంటితుడుపుగా జరిమానా వేసి వదిలేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్‌ను సంప్రదించగా.. 'అధిక లోడ్‌తో రాకపోకలు సాగించే లారీలపై కేసులు నమోదు చేస్తున్నాం. జరిమానా విధిస్తున్నాం. కాలం తీరిన వాహనాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తా'మని చెప్పారు.

# కొండంత సమస్యలు..!



బోయకొండ : భక్తుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన చోట మరుగుదొడ్లు, కొండ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని రోజుకో సేవ నిర్వహించి కొండపై ఆధ్యాత్మికతను పెంచి భక్తులను ఆకట్టుకోవాలని ఇటీవల దేవాదాయ శాఖ కమిషనరు ఆలయాన్ని సందర్శించిన సందర్భంలో ఆలయాధికారులకు సూచించారు. అయితే కమిషనరు వచ్చి రోజులు గడుస్తున్నా ఆ దిశగా అడుగులు వేయలేదు. మరో వైపు ఆషాఢమాసం మొదటి ఆదివారం గడిచిపోయింది. సమస్యలు మాత్రం యథాతథంగా ఉన్నాయి.
రాష్ట్రంలోని శక్తిక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన దేవస్థానం బోయకొండ గంగమ్మ ఆలయం. కొండకు సాధారణ సమయంలో కంటే ఈ ఆషాఢ మాసంలోనే ఎక్కువగా వస్తారు. అదే స్థాయిలో ఆదాయం సమకూరుతుంది. అయితే కొండపై కనీస వసతుల కల్పనలో అధికారులు విఫలమవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**సమస్యలివే..**

కొండ కింద రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణ లోపం కారణంగా వినియోగానికి దూరంగా ఉన్నాయి. తగినన్ని మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గాలిగోపురానికి సమీపంలోని మరుగుదొడ్లు ఉన్నా వాటికి ఎప్పుడు తాళం వేసి ఉండటం గమనార్హం. అలాగే దేవస్థాన వసతి గృహాల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉంటోంది. కల్యాణ కట్ట, రణబేరి గంగమ్మ ఆలయం పక్కన, పుష్కరిణి, దేవస్థానానికి దక్షిణ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి.

**పార్కింగ్ స్థలం కొరత**

అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు తమ వాహనాలను నేరుగా కొండపైకి తీసుకెళ్తారు. అక్కడ స్థలం కొరత ఉండటంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. టోల్ గేటు చెల్లిస్తున్నా వాహనాలు నిలుపుకోవడానికి స్థలం కొరత తీవ్రంగా ఉంది. ఫలితంగా భక్తులు తిరగడానికి ప్రధాన మెట్లు మినహా ఏ దారి లేదు.

**ఉన్న స్థలం నిరుపయోగం**

అటవీశాఖ నుంచి పార్కింగ్ స్థలానికి సేకరించిన స్థలం నిరుపయోగంగా ఉంది. ఆలయ అధికారులు, పోలీసులు సమన్వయం లేకపోవడంతో వచ్చిన వాహనాలను ఈ స్థలానికి మళ్లించడం లేదు. ఇష్టారీతిన వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.
**చర్యలు తీసుకుంటాం..** కొండపై నెలకొన్న సమస్యలు వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. ఏకాంబరం, ఈవో, బోయకొండ

## బడి బాగుచేసుకోండి..

చిత్తూరు : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. విద్యాసంవత్సరం పునఃప్రారంభమైన 15 రోజులకే నిధులు కేటాయించింది. పాఠశాలల్లో మరమ్మతులు, చాక్‌పీస్‌లు, డస్టర్లు, తదితరాల కొనుగోలు, విద్యుత్తు బకాయిలు తదితరాలకు ఈ నిధులు వినియోగించుకోవచ్చు. నిర్వహణ నిధులు విద్యా సంవత్సరంలో రెండు విడతలుగా విడుదల చేస్తారు. గత వైకాపా పాలనలో ఈ నిధులు విడుదల కాలేదు. దీంతో పాఠశాలల్లో ఏ చిన్న పనికైనా ప్రధానోపాధ్యాయులు సొంత నగదు ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ నిధులు పునరుద్ధరించి గత విద్యా సంవత్సరం నుంచే మంజూరు చేస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మొదటి విడతగా జిల్లాలోని 2,444 పాఠశాలలకు రూ.2.86 కోట్లు విడుదల చేసింది. పాఠశాలల బ్యాంకు ఖాతాలో నిధులు జమయ్యాయి. జిల్లాకు



మొత్తం రూ.5.16 కోట్లు అందులో మొదటి విడతలో పై మొత్తం విడుదలయ్యాయి.

**విద్యార్థుల సంఖ్య ఆధారంగా..**

నిర్వహణ నిధులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఒకటి నుంచి 30 మందికి రూ.10 వేలు, 31 నుంచి 100 మందికి రూ.25వేలు, 101 నుంచి 250 మందికి రూ.50వేలు, 251నుంచి వెయ్యి మంది వరకు రూ.75 వేలు ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే రూ.లక్ష వరకు నిధులు ఇస్తారు.

## ఆర్పీలకు ఉద్యోగ భద్రత!

అనంతపురం : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లోని రిసోర్స్ పర్సన్లకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రిసోర్స్ పర్సన్లు (ఆర్‌పీలు) మూడు సంవత్సరాలు మాత్రమే విధుల్లో ఉండాలనే నిబంధనలు విధించారు. దాంతో ఎప్పుడు తొలగిస్తారో అన్న భయం ఆర్పీలను వెంటాడేది. వైకాపా నేతలకు భయపడి వారు చెప్పినట్లే ఆయా సంఘాలకు పని చేసే దయనీయ పరిస్థితి ఉండేది. ఎన్నికల సందర్భంగా ఆర్పీల బాధకు ఉపశమనం కల్పిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో మూడేళ్ల కాలపరిమితి నిబంధనను తాజాగా తొలగిస్తూ ఉత్తర్వు జారీ చేశారు.



ఉద్యోగ భద్రతతో పాటు భవిష్యత్తుకు భరోసా కల్పించడంతో ఆర్పీల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

**మహిళా సంఘాల సమన్వయంలో ప్రధాన భూమిక**

ఆర్పీలు ఆయా నగర, పురపాలికల్లోని స్వయం సహాయక సంఘాలకు సంధానకర్తగా పని చేస్తారు. మహిళలను సంఘటితం చేయడంతో పాటు ఆదాయం పెంచడంలో సంఘాలను సమన్వయం చేస్తారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, ఒనగూరే ప్రయోజనాలను ఒక్కో ఆర్పీ కనీసం 25 నుంచి 30 సంఘాల్లోని సభ్యులకు వివరిస్తారు. మెప్మా ద్వారా రూ.8 వేలు, సంఘాలు పొందిన ఆదాయం నుంచి రూ.2 వేలు ప్రతి నెలా గౌరవ వేతనం అందజేస్తారు.

## పల్లెకు పండగొచ్చింది.. ఉపాధి బిల్లు విడుదలైంది

చిత్తూరు : ఉపాధి హామీ పథకం కింద పల్లెల్లో సీసీరోడ్లు, కాలువలు, మినీ గోకులాలు తదితర నిర్మాణ పనులు చేపట్టిన వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది.. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పల్లె పం డుగ పనుల బిల్లులు సుమారు ఎనిమిది నెలల నుంచి పెండింగులో ఉన్నాయి.. ఆ పనుల తాలూకా బిల్లులు నిధులు రూ.45 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేశాయి.. పాడి రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో చెల్లింపులు జరుగుతున్నాయి.

**పాత బకాయిలు..**

నిధుల విడుదలతో గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు వేగం పుంజుకోనున్నాయి. 2014–19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో చేసిన పనుల తాలూకా బిల్లులను వైకాపా ప్రభుత్వం చెల్లించకుండా నిలిపివేసి తీవ్ర ఇబ్బందులు పెట్టింది. చిత్తూరులో రూ.1,81,84,376, తిరుపతిలో రూ.2,42,11,799



బిల్లులు చెల్లించలేదు. ఆ బకాయిలు ఇప్పుడు విడుదల చేయడంతో అప్పట్లో పనులు చేసిన వారు ఊపిరి పీల్చుకున్నారు.

**చెల్లింపులు జరుగుతున్నాయి..**

పాడి పోషణ ప్రోత్సహించేలా గోకులం షెడ్ల నిర్మాణాల్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. 90 శాతం రాయితీ, 10 శాతం రైతుల వాటాతో షెడ్లు నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన లక్ష్యానికి చేరువయ్యారు. వాటికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో రూ.20.76 కోట్లు బిల్లుల చెల్లింపులకు వివరాలు అప్‌లోడ్ చేశారు. అందులో ఇప్పటి వరకూ రూ.6 కోట్ల మేర లబ్ధిదారులైన రైతుల ఖాతాల్లో జమ కాగా, త్వరలో మిగిలిన వారికీ జమవుతుందని అధికారులు అంటున్నారు.

**బకాయిలు జమవుతున్నాయి..**

చిత్తూరు జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన సీసీరోడ్లు, బీటీ దారులు, గోకులం షెడ్లు తాలూకు బిల్లులు రూ.57 కోట్లు అప్‌లోడ్ చేశాం. అందులో 50 శాతం ఇప్పటి వరకూ లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యింది. మిగిలిన మొత్తం త్వరలో జమవుతుంది. రవికుమార్, పీడీ, డ్వామా

## నిజమైన అందాల నిధిని చూడండి

సవ్యసాచి, మిస్టర్ మజ్ను సినిమాలతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నిధి అగర్వాల్. పేరుకు తగ్గట్లుగానే అందాల నిధి ఈ అమ్మడు అనిపించే విధంగా చాలా అందంగా ఉంటుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోల కారణంగా ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 30 మిలియన్‌లకు పైగా ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు ఇండస్ట్రీలో మాత్రం పెద్దగా సినిమాల్లో కనిపించడం లేదు. 2019లో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో ఈ అమ్మడు సక్సెస్ దక్కించుకున్నాడు. ఆ తర్వాత వరుస సినిమాలు వస్తాయని ఆశించినా కూడా అదృష్టం ఈ అమ్మడికి కలిసి రాలేదు. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో కెరీర్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. వచ్చే నెలలో ఈ అమ్మడు నటించిన హరి హర వీరమల్లు సినిమా విడుదల కాబోతుంది. పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందిన ఈ సినిమాకు క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించారు. ఏ ఎం రత్నం ఈ సినిమాను



నిర్మించారు. ఈ సినిమాపై చాలా అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో నిధి అగర్వాల్ పాత్రకు మంచి స్పందన వస్తుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. అంతే కాకుండా ఈ అమ్మడు ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజాసాబ్ సినిమాలో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. ఆ సినిమా కూడా ఇదే ఏడాది చివరి వరకు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ ఏడాదిలో ఈ అమ్మడికి అతి పెద్ద రిలీజ్‌లు ఉన్నాయి. ఈ రెండు సినిమాలతో టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా నిధి అగర్వాల్ మారడం ఖాయం అనే నమ్మకంను పలువురు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమె ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటాయి. ఆ ఫోటోలు ఈమె స్థాయిని మరింత పెంచుతున్నాయి. తాజాగా అందమైన తన ఫోటోలను షేర్ చేయడం ద్వారా మరోసారి నిధి అగర్వాల్ వైరల్ అవుతోంది. నిజంగా అందాల నిధి ఈ అమ్మడు అంటూ ప్రతి ఒక్కరూ కితాబిచ్చే విధంగా ఈ అమ్మడి ఫోటోలు ఉన్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఇంతటి అందాల నిధికి ఎందుకు ఇన్నాళ్లు సరైన బ్రేక్ పడలేదు అంటూ కొందరు కామెంట్ చేస్తూ ఉంటే, మరికొందరు మాత్రం ఈ ఏడాది ఈమెకు టర్న్ కావడం ఖాయం అంటున్నారు. ఇండస్ట్రీలో ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోలు, వీడియోలు చర్చనీయాంశం అవుతూ ఉంటాయి. అందాల నిధి అగర్వాల్‌కి ఇకపై గుడ్ టైం షురూ అంటూ కామెంట్స్ చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం. ఎన్నో విధాలుగా అందాల నిధికి స్టార్ హీరోయిన్ అయ్యేందుకు అర్హతలు ఉన్నాయి. కానీ అదృష్టం మాత్రం ఈమెకు కలిసి రాలేదు. అయినా కూడా ఈ అమ్మడు ఇండస్ట్రీలో తన ప్రయత్నాలు చేస్తూ వస్తుంది. ముందు ముందు అయినా ఈ అమ్మడు ఇండస్ట్రీలో ముఖ్యంగా టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ కావాలని అభిమానులు కోరుకుంటున్నారు. మరి అది సాధ్యమేనా చూడాలి.

## తగ్గింది రెమ్యూనరేషనే.. ఛాన్సులు కాదు

ఇండస్ట్రీలో ఒక్కోసారి ఒక్కొక్కరి టైమ్ నడుస్తూ ఉంటుంది. కొన్నిసార్లు కొందరు లైమ్ లైట్ లో ఉంటే, ఇంకొన్ని సార్లు వేరే కొందరు లైమ్ లైట్ లో ఉంటారు. ప్రస్తుతం నేషనల్ క్రష్ రష్మిక అలాంటి లైమ్ లైట్ లోనే ఉంది. భాషతో సంబంధం లేకుండా ప్రతీ ఇండస్ట్రీలోనూ సినిమాలు చేస్తూ కెరీర్ ను ముందుకు తీసుకెళ్తూ వార్తల్లో నిలుస్తూ ఉంది రష్మిక . అయితే రష్మిక కేవలం తన సినిమాల విషయాల్లోనే కాదు, మరికొన్ని విషయాల్లో కూడా వార్తల్లో నిలుస్తోంది. మరీ ముఖ్యంగా ఈ మధ్య రష్మిక రెమ్యూనరేషన్ గురించి సోషల్ మీడియాలో ఎక్కువ వార్తలు వినిపిస్తున్నాయి. పుష్ప2 సినిమా కోసం రూ.10 కోట్లు ఛార్జ్ చేసిన రష్మిక రీసెంట్ గా చేస్తున్న సినిమాలకు తన పారితోషికాన్ని చాలా తక్కువ చేసింది. ఛావా సినిమా కోసం రష్మిక రూ.4 కోట్లు తీసుకుంటే, తర్వాత సల్మాన్ ఖాన్ తో కలిసి చేసిన సికందర్ సినిమాకు రూ.5 కోట్లు ఛార్జ్ చేసింది. ఇక తాజాగా వచ్చిన కుబేరా సినిమాకు రష్మికకు నిర్మాతలు రూ. 4 కోట్లు మాత్రమే



చెల్లించారట. అంటే పుష్ప2 రెమ్యూనరేషన్ తో పోలిస్తే ఇప్పుడు కుబేరాకు రష్మిక పారితోషికం సుమారు 60% తగ్గింది. ఈ వార్త ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే రెమ్యూనరేషన్ తగ్గినప్పటికీ రష్మికకు ఆఫర్లు మాత్రం ఏం తగ్గడం లేదు. రష్మిక ప్రస్తుతం థామా, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాల్లో నటిస్తోంది. ఈ రెండు సినిమాలూ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. రెమ్యూనరేషన్ తగ్గిందని రష్మికకు కెరీర్లో బెస్ట్ రోల్స్ రావడం మాత్రం ఆగలేదు. అయితే రష్మిక విషయంలో ఈ రెమ్యూనరేషన్ అనేది పెద్ద సమస్యే కాదని అర్థమవుతుంది. రెమ్యూనరేషన్ తో సంబంధం లేకుండా రష్మిక మాత్రం ప్రస్తుతం పలు పాన్ ఇండియన్ సినిమాల్లో బిజీగా ఉంది. రెమ్యూనరేషన్ అనేది సినిమా సినిమాకీ మారే అవకాశముంది. కానీ రష్మిక మాత్రం నిరంతరం ఎంతో యాక్టివ్ గా ఉంటూ పలు పెద్ద ప్రాజెక్టుల్లో నటిస్తూ ఎంతో బిజీగా ఉంది.




## దేవర2 మొదలయ్యేదప్పుడే!



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ వరుస సక్సెస్‌లతో ఫుల్ జోష్ మీదున్నారు. ఆఖరిగా దేవర సినిమాతో సక్సెస్ అందుకున్న ఎన్టీఆర్, ఇప్పుడు ఓ వైపు వార్2 సినిమాను రిలీజ్ కు రెడీ చేస్తూనే మరోవైపు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమాను చేస్తున్నారు. ఇందులో వార్2 ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎన్టీఆర్ ఈ సినిమాతోనే బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నారు.


**హృతిక్ తో కలిసి వార్2....** అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ తో కలిసి జూ. ఎన్టీఆర్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు.

బాలీవుడ్ బ్లాక్ బస్టర్ వార్ సిని మాకు సీక్వెల్ గా తెరకెక్కుతున్న వార్2 పై అందరికీ భారీ అంచనా లున్నాయి. భారీ హైప్ ఉన్న ఈ సినిమా నుంచి రీసెంట్ గా ట్రైలర్ రిలీజవగా అది అప్పటివరకు ఉన్న అంచనాలను తారాస్థాయికి చేరేలా చేసింది.

**డిసెంబర్ కల్లా డ్రాగన్ పూర్తి...** వార్2 ను పూర్తి చేసిన తారక్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ యాక్షన్ థ్రిల్లర్ ను చేయనున్న సంగతి తెలిసిందే. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ చాలా స్టైలిష్ గా తయారయ్యారు. అయితే ఈ సినిమాను నవంబర్ లేదా డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని తారక్ ప్లాన్ చేస్తున్నారట. డ్రాగన్ అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా తర్వాత తారక్ దేవర2 ను చేయబోతున్నారు.

**ప్రీ ప్రొడక్షన్ వర్క్ లో బిజీగా కొరటాల...** అందులో భాగంగానే కొరటాల ప్రస్తుతం దేవర2కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్, ప్రీ ప్రొడక్షన్ వర్క్ లో బిజీగా ఉన్నారట. అంతా అనుకున్నట్టు జరిగితే దేవర2 సినిమా జనవరి లేదా ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలు పెట్టాలని చూస్తున్నారట కొరటాల. దేవర సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కనున్న ఈ సినిమాలో మొదటి భాగంలో ఉన్న చాలా ప్రశ్నలకు సమాధానం దొరకనుండటంతో దేవర2పై భారీ హైప్ నెలకొంది.

## ఫస్ట్ హాఫ్ తో సూపర్ స్టార్ ఫుల్ ఖుషీ!




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. అన్ని పనులు పూర్తి చేసుకుని ఆగస్ట్ 14న రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు. గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇందులో రజనీ కాంత్ స్మగ్లర్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన లుక్ సహా ప్రచార చిత్రాలన్నీ మంచి బజ్ ని తీసుకొచ్చాయి.

ఈ నేపథ్యంలో ట్రైలర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందా? అని అంతా ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. అయితే అంతకన్నా గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ఈ సినిమా ప్రథ మార్ధం రజనీకాంత్ చూసి సర్ ప్రైజ్ అయ్యారుట. ఔట్ పుట్ చూసి రజనీ చాలా సంతోషంగా ఉందని ఫీడ్ బ్యాక్ ఇచ్చారుట. ద్వితియార్థం ఇంకా రెడీ కాకపోవడంతో పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. సెకెండాఫ్ కూడా చూసి రజనీకాంత్ రివ్యూ ఇస్తే సంగతేంటి? అన్నది తేలిపోతుంది. ఈ చిత్రాన్ని లోకేష్ కనగరాజ్ భారీ కాన్వాస్ పై రూపొందించారు. అమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వాళ్ల మధ్యలో రజనీకాంత్ వస్తే ఇంకెలా ఉంటుందో ఊహకే అందదు. మూడు దశాబ్దాల తర్వాత రజనీకాంత్-సత్య రాజ్ ఒకే ఫ్రేమ్ లో కనడటం అన్నది మరో హైలైట్. తొలిసారి ఇద్దరు 1986లో విడుదలైన 'మిస్టర్ భరత్'లో కలిసి కనిపించారు. ఆ తర్వాత మళ్లీ రజనీకాంత్ సినిమాల్లో నటించే అవకాశం వచ్చినా సత్య రాజ్ ఎందుకనో ఛాన్స్ తీసుకోలేదు. 'ఎందిరన్' ,' శివాజీ' లాంటి చిత్రాల్లో సత్యారాజ్ కి కీలక పాత్ర ఆఫర్ చేసారు. అయినా నటించలేదు. మళ్లీ ఇంత కాలానికి లోకేష్ కనగరాజ్ వాళ్లను కలిపాడు.

## యామీ గౌతమ్ ని అలా లాక్ చేయొచ్చు!

సాధారణంగా నటీనటులు ఎవరైనా కథ..అందులో తన పాత్ర విని నచ్చితే ఒకే చెబుతారు. అందులో ఎక్క డైనా గందరోళం ఉందంటే తలెత్తిన సందేహాలను అడిగి తెలుసుకుంటారు. ఇంకా క్లారిటీగా తెలుసుకోవాలనుకుంటే? మళ్లీ నేరెట్ చేయమని దర్శకులకు చెబుతుంటారు. దర్శకులు కూడా అదే విధానంలో నేరేట్ చేస్తుంటారు. వీలైనంత వరకూ ఏ డైరెక్టర్ అయినా నేరేట్ చేయడానికే చూస్తుంటారు. చాలా తక్కువ మంది దర్శకులు మాత్రమే నేరేట్ చేయకుండా రాసిన స్క్రిప్ట్ ను , పాత్రను చేతుల్లో పెట్టి చదువుకుని నిర్ణయం చెప్పమంటారు.



ఇది చాలా అరుదుగా జరుగుతుంది. ఇదంతా దర్శకుడిపై ఆధార పడి ఉంటుంది. కాబట్టి ఇక్కడ హీరోయిన్లు ఛాన్స్ తీసుకోవడానికి ఉండదు. కానీ యామీ గౌతమ్ మాత్రం ఛాన్స్ తీసుకునే టైప్ అని తెలుస్తోంది. యామీ గౌతమ్కి స్టోరీ నేరేట్ చేయడం కంటే రాసింది తనకు ఇచ్చేస్తా బాగా అర్థం చేసుకుంటానంటోంది. తన దగ్గరకు వచ్చే నిర్మాతలకు, దర్శకులకు కథను చెప్పడం కంటే చదవడానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపింది. ఒకవేళ అందులో తన పాత్ర బలంగా ఉంటే మొత్తం స్క్రిప్ట్ చదవకుండానే ఒకే చెప్పేస్తా నంటోంది. ఆ విషయంలో స్క్రిప్ట్ ను పెద్దగా పట్టించుకోనంది.

దీంతో కొంత మంది దర్శక, రచయితలకు యామినీని ఒప్పించడానికి ఇది మంచి అవకాశమే అవుతుంది. తన పాత్రవరకూ రాసిచ్చేస్తే నచ్చితే ఒకే చేస్తుంది. లేదంటే నో చెబుతుంది. దీని వల్ల దర్శక, రచయితలకు బోలెడంత సమయం కలిసొస్తుంది. ప్రత్యేకంగా ఆమె దగ్గరకు వెళ్లి నేరేట్ చేయాల్సిన పనిలేదు. ముందుగానే అపాయింట్ మెంట్ తీసుకోవాల్సిన పని అంతకన్నా ఉండదు. ఫోన్ కాల్ చేసి విషయం చెబితే సరి.

## పెళ్లయ్యాక అవకాశాలే కరువయ్యాయి

అదితి రావు హైదరి పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు. సమ్మోహనం, చెలియా లాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు కూడా బాగానే దగ్గరైంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తున్న అదితి రావు హైదరి కెరీర్లో ప్రస్తుతం సినీ ఆఫర్లు కరువయ్యాయి. ఒకప్పుడు వరుస సినిమాలతో బిజీగా ఉన్న అదితి ఇప్పుడు చేతిలో పెద్దగా ఆఫర్లు లేక ఖాళీగా ఉంటోంది. గత కొన్నేళ్లుగా సినీ హీరో సిద్ధార్థ్ తో ప్రేమాయణంను నడిపించిన అదితి, గతేడాది అతన్ని పెళ్లి చేసుకుని మరోసారి పెళ్లి జీవితంలోకి ఎంటరైంది. సిద్ధార్థ్ ను పెళ్లి చేసుకున్న తర్వాత తన కెరీర్ ఎలా ఉందనే విషయాన్ని అదితి వెల్లడించింది. రీసెంట్ గా జరిగిన ఓ ఇంటరాక్షన్ లో భాగంగా అదితి తన కెరీర్ గురించి మాట్లాడి హాట్ టాపిక్ గా మారింది. తనకు పెళ్లయ్యాక



పెద్దగా ఆఫర్లు రాలేదని, పర్సనల్ లైఫ్ లో పెళ్లి, పిల్లలు లాంటి మైల్ స్టోన్స్ తర్వాత హీరోయిన్లు రెగ్యులర్ గా ఎదుర్కొంటున్న ఛాలెంజెస్ గురించి అదితి మాట్లాడింది. అదితికి అందానికి అందం, టాలెంట్ కు టాలెంట్, భారీ సంఖ్యలో ఫ్యాన్స్ ఉన్నప్పటికీ పెళ్లి తర్వాత తనకు ఆఫర్లు రాకపోవడమేంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. అయితే అదితి అవకాశాలపై మాట్లాడటం ఇదేం మొదటిసారి కాదు, గతంలో కూడా ఓ సారి అదితి ఈ విషయంపై మాట్లాడింది. కాకపోతే అప్పుడు హీరామండి సినిమాలో తన పాత్రకు వచ్చిన గుర్తింపు చూశాక వరుస అవకాశాలు క్యూ కడతాయనుకుంటే అసలు ఆఫర్లే కరువయ్యాయని కామెంట్ చేసింది. ఇప్పుడు పెళ్లయ్యాక ఆఫర్లు రావడం లేదంటోంది. ఏదేమైనా ఈ విషయంలో అదితి మాట్లాడిన తర్వాత ఇండస్ట్రీలో పెళ్లయ్యాక హీరోయిన్లను చూసే విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536